సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM



'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 15 | సంచిక: 329

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special

ఆదివారం 19-2-2023



రేణుక, స్మృతి మెరుపులు వృథా

మహిళల టి20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 11 పరుగుల తేడాతో ఓడిపోయిన భారత్. రేపు ఐర్లాండ్‌పై గెలిస్తేనే సెమీఫైనల్ చేరే అవకాశం.


- వివరాలు 12లో ▶



ఘుమఘుమలు @ 78

గట్టిగా అనుకుని ఆచరణలో పెడితే తలుచుకున్న పని సఫలం అవుతుంది అనే మాటకు ప్రత్యక్ష ఉదాహరణ బామ్మ ఊర్మిళా అషేర్. 78 ఏళ్ల వయసులో తన వంటతో లక్షలాది మందిని కట్టిపడేసింది.

- వివరాలు 11లో ▶



సిసోడియాకు సీబీఐ పిలుపు

మద్యం స్కాం కేసుకు సంబంధించి ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను సీబీఐ ఆదివారం విచారణకు పిలిచింది.

- వివరాలు 6లో ▶



మోదీకి బానిసలా మారిన ఈసీ

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బానిసగా మారిపోయిందని ఉద్ధవ్ ఠాక్రే ధ్వజమెత్తారు.

- వివరాలు 6లో ▶



ఉగ్రవాదం 80 శాతం తగ్గింది

మోదీ హయాంలో కశ్మీర్‌లో ఉగ్రవాదం, ఈశాన్యంలో వామపక్ష తీవ్రవాదం 80% తగ్గుముఖం పట్టాయని అమిత్ షా చెప్పారు.

- వివరాలు 6లో ▶



అమెరికాలో ఆరుగురి కాల్చివేత

అమెరికాలో ఒంటరితనంతో బాధపడుతున్న ఓ వ్యక్తి తన మాజీ భార్య, సవతి తండ్రితో పాటు మరో నలుగురిని కాల్చి చంపాడు.

- వివరాలు 6లో ▶

సంక్షిప్తంగా ఎయిర్‌పోర్టు మెట్రో



ఎయిర్‌పోర్ట్ మెట్రో మార్గాన్ని నిపుణుల బృందం మరోసారి పరిశీలించింది. రాయదుర్గం నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు నిర్మించతలపెట్టిన బ్లూలైన్ మెట్రో రైల్ నిర్మాణంలో ఎదురయ్యే సాంకేతిక సవాళ్లపై దృష్టి సారించింది.

- వివరాలు 13లో ▶



రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శనివారం మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. రాజన్నను దర్శించుకునేందుకు దాదాపు 3 లక్షల మంది భక్తులు వచ్చారు. చిత్రంలో విద్యుత్ దీపాల కాంతుల్లో రాజన్న ఆలయం.

ఊరూవాడా శివనామ స్మరణ..

- రాష్ట్రవ్యాప్తంగా భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- రాజన్నకు పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

- వివరాలు 2లో ▶

'టికెట్' కలవరం!

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ బీఆర్‌ఎస్ నేతల్లో పెరుగుతున్న ఉత్కంఠ

- ఇప్పటికే పోటీ కోసం సిద్ధమవుతున్న సిట్టింగ్‌లు
- అరంగేట్రం చేయాలనే ఆలోచనలో ఆశావహులు
- వారసులను రంగంలోకి దింపే యోచనలో సీనియర్లు
- ఎసరు ఎవరికి, చాన్స్ ఎవరికనే దానిపై విస్తృత చర్చ
- గుంభనంగా సర్వం సిద్ధం చేస్తున్న కేసీఆర్
- బీజేపీ ఎంపీలున్న అసెంబ్లీ సెగ్మెంట్లపై ప్రత్యేక కసరత్తు.. ఇంతవరకు గెలవని 17 స్థానాలపైనా నజర్



సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండటంతో బీఆర్‌ఎస్‌లో కలకలం కనిపిస్తోంది. ఓ వైపు సిట్టింగ్ ఎమ్మెల్యేలు.. మరోవైపు చాలా కాలం నుంచి అవకాశం కోసం ఎదురుచూస్తున్న నేతలు, కొత్తగా చేరినవారు, సీనియర్ల వారసులు.. అంతా ఒక్కసారిగా ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. మళ్లీ బరిలో ఉండేందుకు సిట్టింగ్‌లు సిద్ధమవుతుంటే.. పోటీ అవకాశం కోసం మిగతావారు గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారు చాలా మంది ఈసారి ఎమ్మెల్యేలుగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ పరిణామాలు చాలా మంది నేతల్లో కలవరం రేపుతున్నాయి. ముఖ్యంగా ఎక్కువ మంది బలమైన నేతలున్న స్థానాల్లో ఆధిపత్యం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇక వచ్చే ఎన్నికల్లో లెఫ్ట్ పార్టీలతో కలిసి పనిచేస్తామని బీఆర్‌ఎస్ పెద్దలు సంకేతాలు ఇవ్వడంతో ఆ ప్రభావం ఏ మేర ఉంటుందనే చర్చ సాగుతోంది. మొత్తంగా ఎవరికి టికెట్ దక్కు తుంది? ఎవరికి ఎసరు వస్తుందనే ఆందోళన కనిపిస్తోంది. ఇదంతా ఒకవైపు అయితే.. మరోవైపు బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ గుంభనంగా ఉంటూనే వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. రాష్ట్రంతోపాటు జాతీయ స్థాయిలో వర్తమాన రాజకీయాలు, రాష్ట్రంలో వివిధ రాజకీయ పక్షాల బలాబలాలు, ఎన్నికలు లక్ష్యంగా వాటి ఎత్తుగడలు తదితరాలపై లోతుగా లెక్కలు వేస్తున్నారు.

సిట్టింగ్‌లు వర్సెస్ ఆశావహులు

రాష్ట్ర శాసనసభలో మొత్తం 119 సీట్లకుగాను బీఆర్‌ఎస్‌కు ప్రస్తుతం 104 మంది సభ్యుల బలం ఉంది. వచ్చే ఎన్నికల్లోనూ గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు భావిస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ బలోపేతానికి చర్యలు చేపట్టారు. 65 లక్షల మంది బీఆర్‌ఎస్ సభ్యత్వం కూడా తీసుకున్నారు. ఇలా శాసనసభలో, బయటా అత్యంత బలంగా ఉన్నా.. పలు సంస్థాగత లోపాలు, నేతల మధ్య ఆధిపత్య పోరు ఇబ్బందికరంగా మారాయి. రాజకీయ పునరేకీకరణ పేరిట బీఆర్‌ఎస్‌లో ఇతర పార్టీల ఎమ్మెల్యేల చేరికతో 40కిపైగా అసెంబ్లీ సెగ్మెంట్లలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఇతర బలమైన నేతల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. బహుళ నాయకత్వమున్న కొన్ని నియోజకవర్గాల్లో తమకు అవకాశం దక్కదని భావిస్తున్న నేతలు ఆందోళనలో పడ్డారు. ఇలాంటి వారిలో కొందరు సొంతదారి వెతుక్కోవాలని భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇక పలువురు కొత్త తరం నేతలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతూ.. పార్టీ అధినేత కేసీఆర్ దృష్టిలో పడేందుకు ప్రయత్నిస్తున్నారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సహా పలువురు నేతల వారసులు రంగంలోకి దిగుతున్నారు. వారు పోటీ చేయాలని భావిస్తున్న నియోజకవర్గాల్లో ఇప్పటికే ఉన్న సిట్టింగ్‌ల పరిస్థితి

మిగతా 13వ పేజీలో ▶

'ధరణి' ఇలా దారిలోకి!

- 25 కీలక సమస్యలపై ట్రెసా నివేదిక
- కొత్త సీసీఎల్‌ఏకు ఇవ్వాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: సమస్యల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న 'ధరణి'ని దారిలోకి తెచ్చేందుకు కొత్త భూపరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్‌ఏ) నవీన్ మిత్తల్ కసరత్తు మొదలుపెట్టారు. మొదటగా ధరణి సమస్యలపై అధ్యయనం చేయాలని భావించారు. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. రైతులు, రెవెన్యూ వర్గాలు ధరణి పోర్టల్ ద్వారా ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. మరోవైపు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) ధరణి సమస్యలు, పరిష్కారాలపై తయారు చేసిన నివేదికను కొత్త సీసీఎల్‌ఏకు అందజేయాలని భావిస్తోంది. మొత్తం 25 అంశాలతో రూపొందించిన

మిగతా 10వ పేజీలో ▶



తారకరత్న కన్నుమూత



- లోకేశ్ పాదయాత్ర ప్రారంభమైన రోజు గుండెపోటు
- బెంగళూరు నారాయణ హృదయాలయలో చికిత్స పొందుతూ మృతి
- 23 రోజులపాటు చావుబతుకుల మధ్య పోరాటం
- సీఎం కేసీఆర్, ఏపీ సీఎం వైఎస్ జగన్ సహా రాజకీయ, సినీ ప్రముఖుల సంతాపం
- పార్థివదేహం హైదరాబాద్‌కు తరలింపు

సాక్షి, బెంగళూరు/అమరావతి/శ్రీకాళహస్తి: నందమూరి తారకరత్న (40) శనివారం రాత్రి కన్నుమూశారు. వైద్యులు చేసిన అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాయి. అభిమానుల ప్రార్థనలు ఫలించలేదు. 23 రోజులపాటు చావు బతుకుల మధ్య పోరాటం చేసిన తారకరత్న బెంగళూరులోని నారాయణ హృదయాలయలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహాన్ని శనివారం రాత్రి హైదరాబాద్‌కు తరలించారు. తారకరత్న మృతిపై రాష్ట్ర సీఎం కేసీఆర్, ఏపీ సీఎం వైఎస్ జగన్‌తోపాటు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు.

విదేశీ వైద్యులను రప్పించినా..: లోకేశ్ పాదయాత్ర ప్రారంభమైన గత నెల 27న గుండెపోటుకు గురైన తారకరత్నకు సుమారు 45 నిమిషాల పాటు మెదడుకు రక్త ప్రసరణ ఆగిపోయింది. ఆ సమయంలో

మిగతా 10వ పేజీలో ▶

గుంజీలు శిక్ష కాదు.. మేధకు రక్ష..

- విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, సృజనాత్మకత పెంపునకు దోహదం
- దేశవిదేశాల్లో నిగ్గు తేల్చిన పరిశోధనలు

- 3లో

కుటుంబ ఆర్థిక భద్రతే జీవిత లక్ష్యం..

- కరోనా అనంతరం ఎక్కువ మంది భారతీయుల అభిప్రాయమిదే
- బజాజ్ అలయంజ్ తాజా అధ్యయనంలో వెల్లడి

- 2లో



జీఎస్టీ ఫైలింగ్ ఆలస్య రుసుము తగ్గింపు

జీఎస్టీ మండలి 49వ సమావేశంలో నిర్ణయం

- జీఎస్టీ వార్షిక రిటర్నుల ఫైలింగ్ ఆలస్య రుసుమును హేతుబద్ధీకరిస్తూ జీఎస్టీ మండలి 49వ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి నమోదిత వ్యక్తులు ఫామ్ జీఎస్టీఆర్–9కు సంబంధించి రూ.5 కోట్ల వరకు టర్నోవర్ ఉంటే ఆలస్య రుసుము రోజుకు రూ.50, రూ.5–20 కోట్ల టర్నోవర్ ఉంటే రోజుకు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ రుసుము రూ.200 ఉంది. పన్ను చెల్లింపుదార్లకు ఉపశమనం కలిగించడానికి రిటర్నులకు సంబంధించి షరతులతో కూడిన మినహాయింపు లేదా ఆలస్య రుసుము తగ్గించడం ద్వారా క్షమాభిక్ష పథకాలను జీఎస్టీ మండలి సిఫార్సు చేసింది.

- వివరాలు 6లో ▶

Parachute®
ADVANSED®
ONION
— HAIR OIL —

ఉల్లిపాయతో సమృద్ధిగా ఉన్న కొబ్బరి శక్తి

జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది అలాగే జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది*



*సాంకేతిక అధ్యయనం vs చికిత్స చేయని జుట్టు ఆధారంగా. సృజనాత్మక విజువలైజేషన్ మాత్రమే.

కోటప్పకొండలో...



వేయిస్తంభాల గుడి వద్ద..



పానగల్లు ఛాయా సోమేశ్వరాలయంలో..



క్లుప్తంగా...

అంతా శివుడి అనుగ్రహమే!

- అందరూ సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలి: గవర్నర్ తమిళిసై



హనుమకొండలో జరిగిన ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనంలో గవర్నర్ తమిళిసై

సాక్షి ప్రతినిధి, వరంగల్: ''శివుడి అనుగ్రహం ఉంటే అన్నీ సాధ్యమే.. నేను జార్ఖండ్ రాజధాని రాంచీకి వెళ్లాను. ఓరుగల్లుకు రాలేనని చెప్పాను. కానీ 3,800 కిలోమీటర్లు ప్రయాణం చేసి ఓరుగల్లుకు వచ్చాను. అంతా శివుడి అనుగ్రహమే..''అని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ హయగ్రీవాచారి గ్రౌండ్‌లో ఏనుగుల రాకేశ్‌రెడ్డి అధ్యక్షతన శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'అందరికీ నమస్కారాలు.. తెలంగాణ ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు'అంటూ తెలుగులో మాట్లాడారు. మనం ఇతరులకు మేలు చేస్తే శివుడు మనకు మేలు చేస్తాడన్నారు. ''నేను కాశీ విశ్వనాథుడిని దర్శించుకుని విమానంలో హైదరాబాద్‌కు వచ్చే సమయంలో ఒకరికి ఛాతీలో నొప్పి వచ్చింది. అప్పుడు నేను గవర్నర్‌ను అని చెప్పకుండా ఒక డాక్టర్‌గా వైద్యం అందించాను. కాశీ విశ్వనాథుడే అతడి ప్రాణాలు కాపాడేలా చేశాడు. ఎవరినీ ఇబ్బంది పెట్టవద్దు. దేనినైనా నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రయోజనం ఉండదు.. మనం సంతోషంగా ఉందాం అందర్నీ సంతోషంగా ఉంచుదాం..''అని చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర సరస్వతి, బీజేపీ తమిళనాడు ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శక్తిపీఠం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్సీ కవిత



జోగుళాంబ ఆలయంలో ఎమ్మెల్సీ కవిత

అలంపూర్/జోగుళాంబ శక్తిపీఠం: ఐదవ శక్తిపీఠం జోగుళాంబ ఆలయ క్షేత్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అలంపూర్ ఆలయాలను ఎమ్మెల్సీ కవిత, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్, ఎమ్మెల్యే అబ్రహం, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కవిత విలేకరులతో మాట్లాడుతూ...బాలబ్రహ్మేశ్వర స్వామి ఆశీస్సులతో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ పార్టీ జోగుళాంబ అమ్మవారి ఆలయం, పట్టణ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అలంపూర్‌ను మున్సిపాలిటీగా మార్చి రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో పాలమూరు నుంచి వలస వెళ్లిన పరిస్థితుల నుంచి ఇక్కడకు వలస వచ్చేలా అభివృద్ధి చేశామన్నారు. మహారాష్ట్ర, ఏపీ, కర్ణాటక వంటి ఏ రాష్ట్రానికి వెళ్లినా తెలంగాణలో ఉన్న సంక్షేమ పథకాలు మాకేందుకు వస్తలేవని అడుగుతున్నారని చెప్పారు.



కుటుంబ ఆర్థిక భద్రతే జీవిత లక్ష్యం



కరోనా అనంతరం ఎక్కువ మంది భారతీయుల అభిప్రాయమిదే

బజాజ్ అలయెంజ్ తాజా అధ్యయనంలో వెల్లడి		పెట్టుబడులపై అభిప్రాయం ఏర్పరచుకోవడంలో సోషల్ మీడియా కీలకపాత్ర
82%	వృద్ధాప్యంలో ఆర్థిక స్వాతంత్ర్యం కోసం జీవిత బీమాలో పెట్టుబడులు పెడుతున్నామన్న వారు	

సాక్షి, హైదరాబాద్

కుటుంబాల ఆర్థిక భద్రతే తమకు సర్వోన్నతమైనదని, అదే అత్యున్నత జీవిత లక్ష్యమని ఎక్కువ మంది భారతీయులు అభిప్రాయపడుతున్నట్లు తాజా సర్వేలో వెల్లడైంది. ఆ తర్వాతే వ్యక్తిగత కెరీర్, విదేశీ పర్యటనలు, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవడం వంటి అంశాలను లక్ష్యాలుగా నిర్దేశించుకుంటున్నట్లు తేలింది. కోవిడ్‌తో తలకిందులైన ఆర్థిక పరిస్థితులు, ప్రత్యక్ష, పరోక్ష రూపాల్లో ప్రజలపై కరోనా ప్రభావాల నేపథ్యంలో భారతీయుల ప్రాధాన్యతలపై లైఫ్ ఇండియాస్ లైఫ్ గోల్స్ ప్రిపేర్డ్‌నెస్ సర్వే 2023 పేరిట ప్రముఖ జీవితబీమా సంస్థ బజాజ్ అలయెంజ్ అధ్యయనం చేపట్టింది. ఇందులో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి.



2019లో 51 శాతంతో పోలిస్తే 2023లో 84 శాతం మంది సమతూకమైన జీవనం (బ్యాలెన్స్‌డ్ లైఫ్) గడిపేందుకు మొగ్గు చూపుతున్నారు.

వృద్ధాప్యంలో ఆర్థిక స్వేచ్ఛ కోసం జీవిత బీమాలో పెట్టుబడులకు 82 శాతం ఇష్టపడుతున్నారు.



సర్వేలోని ముఖ్యాంశాలు

- కరోనా అనంతరం ఆర్థిక భద్రత కోసం జీవిత బీమా చేసేందుకు 73 శాతం మంది మొగ్గుతున్నారు.
- ఉద్యోగ విరమణ అనంతరం భద్రతతో కూడిన, చింతలులేని జీవనం గడిపేందుకు వీలుగా జీవిత బీమా చేసేందుకు 77 శాతం మంది ప్రాధాన్యం ఇస్తున్నారు.
- వృద్ధాప్యంలో ఆర్థిక స్వాతంత్ర్య సాధన కష్టసాధ్యమనే భావనలో 67 శాతం ఉన్నారు.
- సొంతింటి కల సాకారమనేది ఇబ్బందితో కూడుకున్నదేనని 61% మంది భావిస్తున్నారు.
- వయసు పైబడిన తల్లిదండ్రుల బాగోగులు 'ప్రయారిటీ లైఫ్ గోల్'గా 40 % మంది పేర్కొన్నారు.

కరోనా మిగిల్చిన దుష్ప్రభావాల నుంచి బయటపడేందుకు..


కరోనా మిగిల్చిన దుష్ప్రభావాల నుంచి బయటపడేందుకు ప్రజలు శ్రమిస్తున్నారు. కరోనా కాలంలో వారి ఆర్థిక పరిస్థితిపై ఏర్పడిన అనిశ్చితి కారణంగా తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే కరోనా అనంతర పరిణామాల్లో కుటుంబ ఆర్థిక భద్రతకే పెద్దపీట వేస్తున్నారు. దీంతోపాటు ఇతరులపట్ల సానుభూతి పెరగడం, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలనే భావనలు పెరిగాయి. బీమా కంపెనీలు సైతం ప్రతి ఏజ్‌గ్రూప్‌కు వర్తించేలా వివిధ బీమా ప్లాన్లు తీసుకొస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలనే ఆలోచనతో ప్రజలు ఉన్నారు.

– వీరేందర్, కన్సల్టెంట్ సైకాలజిస్ట్

పెరిగిన లక్ష్యాలు.. దేశవ్యాప్తంగా ఢిల్లీ, లూధియానా, బరేలీ, కోల్‌కతా, పట్నా, భువనేశ్వర్, ముంబై, సూరత్, అమరావతి (మహారాష్ట్ర), చెన్నై, బెంగళూరు, మధురై, గుంటూరులలో జరిగిన ఈ అధ్యయనంలో 2019తో పోలిస్తే 2023లో సగటు లక్ష్యాల సంఖ్య 5 నుంచి 11కు పెరిగింది. జీవిత లక్ష్యాలకు సన్నద్ధం కావడంలో ఆత్మవిశ్వాసం, అవగాహన, ఆర్థిక ప్రణాళికల కోసం తీసుకొనే చర్యలు వంటి అంశాలను ఈ సర్వేలో పరిశీలించారు. వివిధ పెట్టుబడులపై ప్రజలు అభిప్రాయాలు ఏర్పరుచుకోవడంలో సోషల్ మీడియా, ఇన్‌ఫ్లూయెన్సర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్లు ఈ అధ్యయనంలో వెల్లడైంది.

"కుటుంబ ఆర్థిక భద్రత, సమతూకమైన జీవితాన్ని గడపాలనే ప్రధాన లక్ష్యాలతోపాటు మరిన్ని కోరికలు నెరవేర్చుకోవాలని సర్వేలో పాల్గొన్న భారతీయులు భావిస్తుండటం ఆసక్తికరం. ఇవి దేశ ఆర్థిక వృద్ధికి సంబంధించిన బలమైన సిద్ధాంతాలను, భారతీయుల్లో పెరుగుతున్న ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయి."

– బజాజ్ అలయెంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఢిల్లీ) ఎండీ, సీఈవో తరుణ్ ఛుగ్



శనివారం శివరాత్రి సందర్భంగా శ్రీశైలంలో భక్తులతో పోటెత్తిన పాతాళగంగ

ఊరూవాడా శివనామ స్మరణ

రాష్ట్రవ్యాప్తంగా భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

వేములవాడ, హన్మకొండ కల్చరల్, రామగిరి(నల్లగొండ): 'పరమేశ్వరా.. పాహిమాం.. శివ శివ శంకర శంభో.. శంకర'నామస్మరణతో శివాలయాలు, శైవ క్షేత్రాలు, దేవస్థానాలు మార్మోగాయి. శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి నుంచే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాలన్నీ పోటెత్తాయి. ఎటుచూసినా శివాలయాలు భక్త జనసంద్రంతో కిటకిటలాడాయి. శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు తెలంగాణ సీఎం కేసీఆర్, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరునికి వైభవంగా..

హనుమకొండలోని చారిత్రాత్మక శ్రీరుద్రేశ్వర స్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో శనివారం మహాశివరాత్రి ఉత్సవాలు మహావైభవంగా జరిగాయి. సాయంత్రం 6.45గంటలకు శ్రవణా నక్షత్రయుక్త గోధూళి సింహాలగ్న సుముహూర్తమున శ్రీరుద్రేశ్వరస్వామి శ్రీరుద్రేశ్వరి అమ్మవారి కల్యాణం నిర్వహించారు. రాత్రి 12గంటలకు లింగోద్భవకాల పూజలు జరిపారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, సీపీ రంగనాథ్ తదితర ప్రముఖులు రుద్రేశ్వరునికి అభిషేకాలు చేశారు. నల్లగొండ పట్టణ శివారులోని పానగల్లు ఛాయా సోమేశ్వరాలయం భక్తజనంతో కిటకిటలాడింది.

వేములవాడలో..

రాజన్నను దర్శించుకునేందుకు దాదాపు 3 లక్షల మంది వరకు భక్తులు వేములవాడకు తరలివచ్చారు. స్వామి వారి దర్శనానికి దాదాపు 10 గంటల సమయం పట్టింది. శివదీక్షాపరులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సాయంత్రం 6 గంటలకు వేదమూర్తులచే మహాలింగార్చన వైభవోపేతంగా సాగింది. మహాజాతరను పురస్కరించుకొని ఆర్జిత సేవలను రద్దు చేసి, లఘు దర్శనాలను మాత్రమే అనుమతించారు. భక్తుల రద్దీ భారీగా ఉండడంతో క్యూలైన్‌లలో నిల్చునేందుకు ఇబ్బందులు పడ్డారు. సొమ్మసిల్లి పడిపోయిన భక్తులను ప్రథమ చికిత్స కేంద్రాలకు తరలించారు.

ఏపీలో పోటెత్తిన శైవ క్షేత్రాలు

ఏపీలోని ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం, పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలోని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ, దక్షిణ కైలాసంగా పేరొందిన శ్రీకాళహస్తి లక్షలాదిమంది భక్తులతో పోటెత్తాయి. కోటప్పకొండ ప్రత్యేకతైన ప్రభల ఉత్సవం ఘనంగా జరిగింది. ప్రసిద్ధి చెందిన పంచారామాలైన దాక్షారామం శ్రీభీమేశ్వరస్వామి దేవస్థానం, సామర్లకోట శ్రీకుమార భీమారామం, అమరావతి శ్రీఅమరేశ్వర స్వామి దేవస్థానం, పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి దేవస్థానం, భీమవరం సోమేశ్వరస్వామి గుడి యాత్రికులతో కిటకిటలాడాయి. మహానందిలో పూజలు జరిపారు.



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం నల్లమలలోని భౌరాపూర్ పెంటలోని చెంచుల ఆరాధ్యదైవం భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి కల్యాణాన్ని చెంచు పూజారులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, అమల దంపతులు తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. -సాక్షి, నాగర్‌కర్నూల్



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన శివరాత్రి జాగరణ కార్యక్రమానికి హాజరైన భక్తజన సందోహం - పటాన్‌చెరు



రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

దేవుళ్లను అడ్డం పెట్టి రాజకీయాలా?

ప్రతిపక్ష పార్టీలపై మంత్రి హరీశ్‌రావు విమర్శ

- దేవునిపై భక్తి, విశ్వాసంతో కేసీఆర్ పాలన సాగిస్తున్నారు
- కొత్త జిల్లాలు, ప్రాజెక్టులకు దేవుళ్ల పేర్లే పెట్టారు
- సంగారెడ్డి జిల్లాలో బసవేశ్వర ఎత్తిపోతల పనులకు భూమిపూజ



సంగారెడ్డి జిల్లా బోరంచవద్ద ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కొన్ని రాజకీయ పార్టీలు దేవుళ్లను, మతాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్నాయని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సీఎం కేసీఆర్ దేవునిపై పూర్తి నమ్మకం, విశ్వాసంతో పాలన సాగిస్తున్నారని చెప్పారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని భూలోక వైకుంఠంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కొత్త జిల్లాలు, సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లకు దేవుళ్ల పేర్లుపెట్టారని వివరించారు. సంగారెడ్డి జిల్లా మనూరు మండలం బోరంచ వద్ద రూ.1,774 కోట్లతో బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులకు శనివారం భూమిపూజ చేశారు. ఈ పథకం పూర్తయితే నారాయణఖేడ్, అందోల్ నియోజకవర్గాల పరిధిలో 1.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందని తెలిపారు. గతంలో రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లేవారని, ఇందుకు భిన్నంగా ఇప్పుడు బిహార్, యూపీ, ఒడిశా వంటి రాష్ట్రాల నుంచి తెలంగాణకు వచ్చి వ్యవసాయ కూలి పనులు చేస్తున్నారని చెప్పారు.

గతంలో కేసులు.. బెయిల్.. జైలు..

కాంగ్రెస్, టీడీపీ పాలనలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ వాసుల పరిస్థితి కేసులు.. బెయిలు.. జైలు.. అన్న చందంగా ఉండేదని హరీశ్ అన్నారు. గత పాలకులు ప్రజలను ఏదో ఓ కేసులో ఇరికించి కోర్టుల చుట్టూ తిరిగేలా చేసేవారని ఆరోపించారు.

స్నానం నీటిని తాంబూలంలో పట్టుకున్న గోస

నారాయణఖేడ్ అంటే సాగునీరే కాదు, తాగునీటికి కూడా నోచుకోని పరిస్థితి ఉండేదని మంత్రి హరీశ్ గుర్తు చేశారు. నీళ్లు లేక చిన్నారులను మంచంపై కూర్చుండబెట్టి కింద తాంబూలం పెట్టుకుని స్నానం చేయించిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు మిషన్ భగీరథ ద్వారా ప్రతి గ్రామంలో ఇంటింటికీ నల్లా నీళ్లు రావడంతోపాటు, సాగునీటి కష్టాలు కూడా తీరనున్నాయన్నారు. కరువు కాటకాలతో అల్లాడిన నారాయణఖేడ్ ప్రాంతం రానున్న రోజుల్లో మరో కోనసీమగా మారనుందని చెప్పారు. కాగా, బోరంచ పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న హరీశ్‌రావు.. అమ్మవారికి ముక్కుపుడక చేయించేందుకు డబ్బులు ఇచ్చానన్నారు.

హిందూ ధర్మాన్ని కించపరుస్తున్నా స్పందించడం లేదు

కేసీఆర్.. శివుడినే మోసం చేశాడు

- రాష్ట్రంలో రజాకార్ల పాలన పోయి రామరాజ్యం రావాలి
- కాషాయజెండా నీడలో పనిచేసేటోడే నిజమైన హిందువు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యలు



ముస్తాబాద్ మండలం గూడెంలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న సంజయ్

సిరిసిల్ల: హిందూ మతం ఏ మతానికీ వ్యతిరేకం కాదని, అయినా హిందూ ధర్మాన్ని కించపర్చడం కొందరికి ఫ్యాషన్‌గా మారిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో శనివారం ఛత్రపతి శివాజీ విగ్రహాలను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. కొందరు ఫాల్తుగాళ్లు హిందూ మతాన్ని, అయ్యప్పను, సరస్వతీ అమ్మవార్లను కించపరిస్తే కనీసం నిరసన వ్యక్తం చేయకపోవడం బాధాకరమన్నారు. ఇకపై హిందూ ధర్మాన్ని కించపరిస్తే తరిమి.. తరిమి కొడదామని పిలుపునిచ్చారు. హిందూధర్మ పరిరక్షణకు నిరంతరం పనిచేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాలను ఊరూరా ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో రజాకార్ల పాలనను తరిమికొట్టి, రామరాజ్యాన్ని స్థాపించే దాకా విశ్రమించేది లేదని అన్నారు. రాష్ట్రంలో హిందుత్వ వాతావరణం వచ్చేసిందని, కాషాయజెండా పట్టేవాళ్లే నిజమైన హిందువులన్నారు.

కేసీఆర్.. శివుడినే మోసం చేసిన దుర్మార్గుడు

వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి ఏటా రూ.100 కోట్ల చొప్పున రూ.400 కోట్లు ఖర్చు చేస్తానని చెప్పి మాట తప్పిన దుర్మార్గుడు కేసీఆర్ అని సంజయ్ విమర్శించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడలో శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సంజయ్ మాట్లాడుతూ.. రాజన్న ఆలయానికి ప్రసాదం పథకం కింద ప్రతిపాదనలు పంపితే కేంద్రం నుంచి నిధులు తీసుకొస్తానని రెండు చేతులెత్తి వేడుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. శివుడు అన్నీ గమనిస్తున్నాడని, కేసీఆర్ మూర్ఖపు పాలన పీడ విరగడ కావాలని కోరుకున్నట్లు తెలిపారు. దొంగ సారా దందాలో ఢిల్లీ డిప్యూటీ సీఎంకు సీబీఐ నోటీసులు ఇచ్చిందని.. నీ బిడ్డకు కూడా ఏం జరగాలో అదే జరుగుతుందని కేసీఆర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు.

కేసీఆర్ మతాలను రాజకీయాలకు వాడుకోలేదు

మంత్రి హరీశ్‌రావు

పాపన్న పేట (మెదక్): బడ్జెట్‌లో దేవాలయాలకు నిధులు కేటాయించినా, సీఎం కేసీఆర్ మతాలను రాజకీయాలకు వాడుకోలేదని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఆయన శనివారం ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి, మదన్ రెడ్డితో కలిసి దుర్గమ్మకు పూజలు చేసి ఏడుపాయల జాతరను ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఏడుపాయల జాతరకు ఏటా రూ.కోటి ఇస్తున్నామని, ఈసారి రూ.2 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. ఏడుపాయలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పేద బ్రాహ్మణుల పిల్లలకు ఉన్నత విద్య సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మహా శివరాత్రి సందర్భంగా రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉండాలని, ఏడుపాయల దుర్గమ్మకు మొక్కుకున్నట్లు హరీశ్ చెప్పారు.



ఏడుపాయల జాతరలో దుర్గమ్మతల్లికి పూజలు చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్


గుంజీలు.. ఈ తరం పిల్లలకు పెద్దగా తెలియనప్పటికీ నిన్నటితరం వారికి మాత్రం ఈ పేరు చెప్పగానే బడిలో ఉపాధ్యాయులు విధించిన 'శిక్ష' గుర్తొస్తుంది. అయితే నాటి 'దండన' వెనకున్న శాస్త్రీయతను చాలా మంది అపార్థం చేసుకోవడంతో ఇదో పెద్ద పనిష్మెంట్‌గా ముద్రపడినా పాశ్చాత్య దేశాలు మాత్రం దీని అంతరార్థాన్ని, విద్యార్థులకు కలిగే ఉపయోగాలను గుర్తించాయి. దీన్ని 'సూపర్ బ్రెయిన్ యోగా'గా పిలుస్తూ నిత్యం గుంజీలు తీయడాన్ని ప్రోత్సహిస్తున్నాయి. మరోవైపు ఇది విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని పెంచే విధానమంటూ ఆధునిక పరిశోధకులు సైతం రుజువు చేశారు.

గుంజీలు శిక్ష కాదు.. మేధకు రక్ష

విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, సృజనాత్మకత పెంపునకు దోహదం

దేశవిదేశాల్లో నిగ్గు తేల్చిన పరిశోధనలు

సూపర్ బ్రెయిన్ యోగా పేరిట ప్రోత్సహిస్తున్న పాశ్చాత్య దేశాలు



జ్ఞాపకశక్తి.. ఏకాగ్రత పెరుగుతాయి..

చదువుపై శ్రద్ధ, జ్ఞాపకశక్తి, సృజనాత్మకత, సమస్య పరిష్కారం, అభ్యసన మెరుగవ్వడం గుంజీల వల్లే సాధ్యమని నిరూపించారు. కరోనా తర్వాత విద్యార్థుల్లో పరీక్షలంటే భయం, ఏకాగ్రత కోల్పోవడం, బోధన సమయంలో ధ్యాస లేకపోవడం వంటివి వేధించే సమస్యలు. గుంజీల ద్వారా ఈ సమస్యకు పరిష్కారం ఉందంటున్నారు పరిశోధకులు.

గతంలోనే శాస్త్రీయంగా నిర్ధారణ...

ఆలోచన శక్తికి కేంద్ర బిందువు మెదడే. చెవి కొనలు మెదడుకు రిమోట్ కంట్రోల్‌లా పనిచేస్తాయి. రెండు చెవి కొనలను పట్టుకొని లాగుతూ గుంజీలు తీయడం వల్ల నాడులు స్పందిస్తూ మెదడుకు సంకేతాలు వెళ్తాయి. గుంజీలు తీసేటప్పుడు తీసుకొనే శ్వాస, ఆక్యుప్రెషర్ క్రియల వల్ల మెదడు కుడి భాగాలు ఉత్తేజితం అవుతాయి. ఫలితంగా పిట్యూటరీ గ్రంథి శక్తివంతమవుతుంది. ఈ విషయాన్ని ప్రముఖ ఫ్రెంచ్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పాల్ నోగియర్ గతంలోనే శాస్త్రీయంగా నిరూపించారు. గుంజీల వల్ల మెదడులోని ఆల్ఫా తరంగాలు క్రియాశీలత పెరిగి, భావోద్వేగ స్థిరత్వం, మానసిక స్పష్టత, మెరుగైన సృజనాత్మకతకు దోహదపడుతుందని, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుందని తేల్చారు.





నిజామాబాద్‌కు చెందిన అందె జీవన్‌రావు గుంజీలపై విస్తృత పరిశోధన చేశారు. తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉన్నప్పట్నుంచీ 'సూపర్ బ్రెయిన్ యోగా'(గుంజీలు తీయడం)పై అనేక ప్రయోగాలు చేశారు. పదవీవిరమణ పొందినా బ్రెయిన్ ట్రైనర్‌గా దేశవ్యాప్తంగా గుంజీలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే 150 విద్యా సంస్థల్లో విద్యార్థులకు గుంజీలు తీయడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కేంద్రంలోని ఎన్‌సీఈఆర్‌టీ, రాష్ట్రంలోని ఎస్‌సీఈఆర్‌టీకి దీనిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విద్యార్థి దశ నుంచి దీన్ని అమలులోకి తేవాలని ఆయన ఉద్యమిస్తున్నారు. ఈ నెల 27 నుంచి మార్చి 2 వరకూ అస్సాంలోని బోడోలాండ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌లో సూపర్ బ్రెయిన్ యోగాపై పరిశోధన పత్రాన్ని సమర్పించేందుకు సిద్ధమయ్యారు. శిక్షగా కాకుండా, విద్యార్థి వికాసానికి తోడ్పడే గుంజీల శాస్త్రీయతను ప్రభుత్వాలు గుర్తించాలని, అప్పటివరకూ అవిశ్రాంతంగా పోరాడతానని ఆయన 'సాక్షి' ప్రతినిధికి చెప్పారు.

పరిశోధనలేం చెప్పాయి?

- కాలిఫోర్నియో రేడియాలజీ డాక్టర్ జోయ్ పి జోన్స్ పరిశోధన ప్రకారం... మెదడుకు చెందిన ఆక్యుప్రెషర్ బిందువులు చెవి భాగంలో కేంద్రీకృతమై ఉంటాయి. గుంజీలు తీయడం వల్ల మెదడులోని నాడీ మార్గాలు ఉత్తేజితమవుతాయి. దీనివల్ల మెదడు కుడి, ఎడమ భాగాలు సమన్వయంతో పనిచేస్తాయని ఎలక్ట్రో ఎన్‌సెఫలోగ్రామ్ (ఈఈజీ) ద్వారా నిరూపించారు.
- ఫిలిప్పీన్స్‌కు చెందిన ఆధునిక ప్రాణిక్ హీలింగ్ వ్యవస్థాపకుడు చొ కాక్ సూయ్ గుంజీలపై పరిశోధన ద్వారా... జీవం ఉన్న బ్యాటరీగా పిలిచే మెదడు గుంజీల ద్వారా రీచార్జ్ అవుతుందని తేల్చాడు.
- మైసూరు యూనివర్సిటీ, మహారాజ కాలేజీకి చెందిన శాస్త్రవేత్త శ్రీకాంత్, లాస్సీ 2017లో 6–18 ఏళ్ల వయసున్న 1,945 మంది పాఠశాల విద్యార్థులపై మూడు నెలలు గుంజీలపై పరిశోధన చేశారు. దీనివల్ల 86% మంది విద్యార్థుల్లో పరీక్షల భయం పోయిందని, 75.9% మంది విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరిగిందని, 70.5% మందిలో ఏకాగ్రత గణనీయంగా పెరిగిందని తేల్చారు.

ఇది బిగ్గెస్ట్ బిర్యానీ ప్లేట్

ప్రారంభించిన నటుడు సోనూసూద్



గచ్చిబౌలి: శాఖాహారం మాత్రమే తినే తనపేరిట మాంసాహార బిర్యానీ రావడం సంతోషంగా ఉందని నటుడు సోనూసూద్ పేర్కొన్నారు. కొండాపూర్‌లోని జిస్మత్ జైల్ మండి రెస్టారెంట్‌లో శనివారం సోనూసూద్ ఇండియాస్ బిగ్గెస్ట్ బిర్యానీ ప్లేట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది అడుగుల విస్తీర్ణంలో ఉండే బిగ్గెస్ట్ ప్లేట్ బిర్యానీని ఒకేసారి 15 నుంచి 20 మంది తినవచ్చన్నారు. ఈ సందర్భంగా జిస్మత్ మండి నిర్వాహకులు గౌతమి, ధర్మ, గౌతమ్‌లను ఆయన అభినందించారు. త్వరలో విజయవాడ, గుంటూరు, నెల్లూరు, బెంగళూరులో బిగ్గెస్ట్ బిర్యానీ ప్లేట్‌ను సోనూసూద్‌తో అందుబాటులోకి తెస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఇక్కడ వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తా

మహిళా వ్యాపారవేత్తలతో సోనూసూద్ ముఖాముఖి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఒక వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తానని సినీ/చారిటీ స్టార్ సోనూసూద్ వెల్లడించారు. హైదరాబాద్‌తో తనకు దగ్గర అనుబంధం ఉందనీ, తన భార్య తెలుగు మహిళని తెలిపారు. నగరానికి చెందిన ఫిక్కీ లేడీస్ క్లబ్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో సోమాజిగూడలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో ఆయన మహిళా వ్యాపారవేత్తలతో మాట్లాడారు. ఆయనేమన్నారంటే..

'కరోనా తీవ్రత తగ్గిపోయినా సమస్యలతో మమ్మల్ని సంప్రదించేవారు తగ్గలేదు. ప్రస్తుతం షిరిడీలో ఒక వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తున్నాం. అలాగే తెలంగాణలో మరొకటి రానుంది. పంజాబ్‌లో దీనికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి సమీప భవిష్యత్తులో ప్రతి రాష్ట్రంలోనూ వృద్ధాశ్రమం, ఓ ఉచిత పాఠశాల ఉండేలా చూడాలనేది మా కోరిక. చాలా రాజకీయ పార్టీలు నన్ను తమవైపు తిప్పుకునేందుకు శాయశక్తులా ప్రయత్నించిన మాట వాస్తవమే. ఇప్పటికిప్పుడు రాజకీయాల్లోకి వచ్చే ఆసక్తి నాకు లేదు. చిత్ర పరిశ్రమలో ఇంకా చాలా చేయాల్సి ఉంది.

చెక్‌లు అందించి సాయం చేయడం మాత్రమే కాదు..

చెక్‌లు అందించి, చారిటీలు చేసే వారు చాలా మంది ఉన్నారు. అయితే పర్సనల్ టచ్ చాలా ముఖ్యం. ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న బాలికను నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు విమానంలో తరలించాం. ఆమె సోదరుడు తోడుగా వచ్చాడు. కానీ, దురదృష్టవశాత్తూ ఆమెను రక్షించలేకపోయాం. ఆ తర్వాత ఆమె సోదరుడు కూడా మృతి చెందాడు. ఆమె తల్లిదండ్రులు తమ ఇద్దర్నీ కోల్పోయారు. దీంతో వీలైనప్పుడల్లా నాగ్‌పూర్‌లోని వారి తల్లిదండ్రులను కలవడం అలవాటు చేసుకున్నా. ఇదే నేను ఇష్టపడే పర్సనల్ టచ్.. అని సోనూసూద్ చెప్పారు.

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా వెంకట్

అధ్యక్షుడిగా విజయ రాఘవన్ ఎన్నిక


విజయ రాఘవన్


బి. వెంకట్

సాక్షి, హైదరాబాద్: అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడిగా విజయ రాఘవన్, ప్రధాన కార్యదర్శిగా బి.వెంకట్ ఎన్నికయ్యారు. ఈ నెల 15 నుంచి 18 వరకు పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో జరిగిన సంఘం జాతీయ పదవ మహాసభల చివరి రోజు నూతన కమిటీని, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను, 155 మందితో కూడిన జనరల్ కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ నుంచి 15 మంది, ఏపీ నుంచి 12 మంది, కేరళ నుంచి 30, పశ్చిమ బెంగాల్ నుంచి 18 మందిని జనరల్ కౌన్సిల్‌కు ఎన్నుకున్నారు. తెలంగాణ నుంచి జి.నాగయ్య, ఆర్. వెంకట రాములు, బి.ప్రసాద్, పొన్నం వెంకటేశ్వర్లు, ఎన్.ఐలయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, కె.జగన్, పెద్ది వెంకటేశ్వర్లు, ఎ.వెంకటరాజం, డి.సరోజ, పద్మ, ఎం.ఆంజనేయులు, ఎ.వీరన్న కె.నరసింహులు, ఎం.రాములు కౌన్సిల్‌కు ఎన్నికైనవారిలో ఉన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నికైన వారిలో వి.వెంకటేశ్వర్లు, డి.సుబ్బారావు, వి.శివ నాగరాణి, కె.వి.నారాయణ, కె.ఆంజనేయులు, ఎం.నాగేశ్వరరావు, ఎం.పుల్లయ్య, ఎ.రవి, డి. వెంకన్న, యం.రాజేశ్, జి.సింహాచలం ఉన్నారు. గత మూడేళ్లుగా నిర్వహించిన ఉద్యమాలు, పోరాటా లను సమీక్షించి, ఈ మహాసభల్లో భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్టు సంఘ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు.

రైల్వే ట్రాక్‌లపై పెరుగుతున్న ఆత్మహత్యలు

- ఏడాదిలో ఇప్పటికి 140 మంది మృతి
- ప్రమాదాల నియంత్రణ చర్యలపై దృష్టి పెట్టిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్ : వ్యక్తిగత ఇబ్బందులు, ఇతర సమస్యలు...కారణం ఏదైనా కావొచ్చు చాలామంది రైలుకు ఎదురెళ్లి ప్రాణం తీసుకుంటున్నారు. ఎదురైన సమస్యల్ని ఎదుర్కోలేక తనువు చాలించాలనుకుని పట్టాలపై పడి ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు ఇటీవల పెరిగిపోతున్నాయి. రైల్వే శాఖ గణాంకాల ప్రకారం ఈ ఏడాదిలో జనవరి నుంచి ఈనెల 16 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైల్వేస్టేషన్ల పరిధిలో రైల్వే ట్రాక్‌లపై ఏకంగా 140 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ ఘటనలపై జీఆర్‌పీ (గవర్నమెంట్ రైల్వే పోలీసులు) సీఆర్‌పీసీ సెక్షన్ 174 కింద కేసులు నమోదు చేస్తున్నారు. కాగా, రైల్వే స్టేషన్ ఆవరణలో, రైళ్లలో ప్రయాణికుల సురక్షిత ప్రయాణానికి తీసుకోవాల్సిన చర్యలపై ఇటీవలే పోలీస్, రైల్వే భద్రత అధికారులు సంయుక్తంగా సమావేశం నిర్వహించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే.

సనత్‌నగర్ ఠాణాలో లైబ్రరీ

ఆరో తరగతి విద్యార్థి విజ్ఞప్తి మేరకు ఏర్పాటు ● రాష్ట్రంలోనే తొలిసారిగా పోలీస్ స్టేషన్‌లో లైబ్రరీ


పోలీస్‌స్టేషన్‌లో లైబ్రరీని ప్రారంభించిన విద్యార్థిని ఆకర్షణ

సాక్షి, హైదరాబాద్/సనత్ నగర్: పుస్తకం హస్త భూషణం అంటారు.. ఒక్క పుస్తకం ఎందరో మిత్రులతో సమానమనీ చెప్తారు.. పుస్తకాలతో జ్ఞానాన్ని పెంచుకోవడమే కాదు ఎందరికో జ్ఞానాన్ని పంచేందుకూ ఓ ఆరో తరగతి విద్యార్థిని ముందుకొచ్చింది. తాను చదవటమేకాదు చుట్టూ ఉన్న వాళ్లు కూడా పుస్తకాలు చదవాలన్న ఉద్దేశంతో గ్రంథాలయాల ఏర్పాటుకోసం కృషి చేస్తోంది. అలా హైదరాబాద్‌లోని సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మినీ లైబ్రరీని ఏర్పాటు చేయించింది. సనత్‌నగర్‌కు చెందిన ఆ చిన్నారి పేరు ఆకర్షణ. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న ఆమె వయసు పదకొండేళ్లు. శనివారం స్వయంగా ఆమె చేతుల మీదుగా సనత్‌నగర్ ఠాణాలో లైబ్రరీ ప్రారంభం కావడం గమనార్హం.

ఠాణాకు వెళ్లినప్పుడు గమనించి..

ఆకర్షణ కొన్నిరోజుల క్రితం తండ్రి సతీశ్‌కుమార్‌తో కలిసి స్థానిక పోలీసుస్టేషన్‌కు వెళ్లింది. ఆ సమయంలో కొందరు పోలీసు అధికారులను కలిసేందుకు చాలాసేపు వేచి ఉండటాన్ని గమనించింది. అలా కూర్చున్న సమయంలో ఏదైనా పుస్తకం చదివే అవకాశం ఉంటే బాగుంటుందని భావించింది. దీనివల్ల జ్ఞానం పెరగడంతోపాటు మానసిక ఒత్తిడి కాస్త తగ్గుతుందని అనుకుంది. ఠాణాలో లైబ్రరీ ఏర్పాటు చేయాలని కోరుతూ సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్రకు లేఖ రాసింది. దీనిపై స్పందించిన సీపీ.. ఠాణాలో గ్రంథాలయానికి అవసరమైన స్థలాన్ని కేటాయించి, ఇతర ఏర్పాట్లు కూడా చేయించారు. ఆకర్షణ తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల నుంచి సేకరించిన 750కి పైగా పుస్తకాలను ఠాణా లైబ్రరీలో అందుబాటులో ఉంచారు. ఇందులో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషలకు చెందిన పుస్తకాలు కూడా ఉన్నాయి. ఈ లైబ్రరీని శనివారం ప్రారంభించారు.

గతంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో..

ఆకర్షణ ఇలా మినీ లైబ్రరీని ఏర్పాటు చేయడం ఇది రెండోసారి. 2021 జూలైలో ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో పిల్లల కోసం లైబ్రరీ ఏర్పాటు చేసింది. లైబ్రరీల ఏర్పాటు కోసం ఆకర్షణ దాదాపు 18 నెలల పాటు శ్రమించి మొత్తం 1,700కు పైగా పుస్తకాలను సేకరించింది. అప్పటి సిటీ కమిషనర్ అంజనీకుమార్ చేతుల మీదుగా ఆకర్షణ మెమెంటో కూడా అందుకుంది. కరోనా సమయంలో తాను దాచుకున్న డబ్బులతో మాస్క్‌లు, శానిటైజర్లు, ఫేస్ షీల్డ్స్ వంటివి కొని అప్పటి సైబరాబాద్ కమిషనర్ సజ్జనార్‌కు అందించింది.

24 గంటలు.. 19 కాన్పులు

మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఘనత


విజయసంకేతం చూపుతున్న వైద్యులు, బాలింతలు

నెహ్రూ సెంటర్: మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 24 గంటల్లో 19 కాన్పులు జరిగాయి. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు 19 ప్రసవాలు జరిగాయని, వాటిలో 15 సాధారణ, 4 సిజేరియన్ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రసవాల్లో అధిక రిస్క్ కేసులు కూడా ఉన్నాయని, కానీ తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని చెప్పారు. ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు సిజేరియన్ ప్రసవాలను తగ్గించి.. సాధారణ కాన్పులను పెంచే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది ఈ విజయం సాధించారని వివరించారు. కాన్పుల విభాగం అధిపతి డాక్టర్ బి.వెంకట్రాములు ఆధ్వర్యంలో స్త్రీ వైద్య నిపుణులు అలేఖ్య, శస్త్ర చికిత్స డ్యూటీ నిపుణులు శైలజ, శ్రావణి, మత్తు విభాగం వైద్యులు శ్రవణ్‌కుమార్, శ్రీనివాస్ సేవలందించారని తెలిపారు. వారందరినీ కలెక్టర్ శశాంక అభినందించారని పేర్కొన్నారు.



అమ్మకు రక్షణ.. పిల్లలకు ఆటవిడుపు..

- పోలీస్‌స్టేషన్‌లో మహిళ, శిశు స్నేహపూర్వక గది
- రాష్ట్రంలోనే తొలి సెంటర్ మహబూబాబాద్‌లో ఏర్పాటు
- ఆటల గదిని ప్రారంభించిన మంత్రి సత్యవతి


మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక గది

సాక్షి, మహబూబాబాద్: పోలీస్‌స్టేషన్‌లో జరిగే విచారణలు, ఇతర సంఘటనలు చిన్న పిల్లల కంట పడకూడదు..అందుకోసం స్టేషన్‌కు అమ్మలతో వచ్చే పిల్లల కోసం స్టేషన్‌లో ఒక గది ఏర్పాటు. అన్ని ఆటవస్తువులు.. ఆహ్లాదకరమైన బొమ్మలు, పడుకునేందుకు బెడ్ కూడా ఏర్పాటు.... ఇటువంటి కేంద్రాన్ని రాష్ట్రంలోనే తొలిసారిగా మహబూబాబాద్ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. దీనిని శనివారం రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ లాంఛనంగా ప్రారంభించారు.

అమ్మకు రక్షణగా..

వివిధ సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు చిన్నపిల్లల తల్లులు కూడా వస్తుంటారు. ఇప్పటివరకు స్టేషన్‌లో వారికోసం ప్రత్యేక గది లేదు. దీంతో అమ్మ.. బిడ్డకు పాలు ఇవ్వాలన్నా.. ఇతరులు పక్కనే ఉన్నప్పుడు తమ సమస్యను చెప్పుకోవాలన్నా.. ఇబ్బందిగా ఉంటుంది. దీనిని గమనించిన మహబూబాబాద్ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ జిల్లాకేంద్రంలోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఓ ప్రత్యేక గదిని కేటాయించారు. ఇందులో కుర్చీలు వేయడంతోపాటు తల్లి.. బిడ్డకు పాలు ఇచ్చేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ అంతా మహిళా పోలీస్ అధికారి నిర్వర్తించడంతో మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం ఉంది. ఇక ఈ సెంటర్‌లో పిల్లలను ఆకట్టుకునే విధంగా ఆట వస్తువులు, అక్షర మాల బోర్డులు, అలసిపోతే పడుకునేందుకు మెత్తటి బెడ్ ఏర్పాటు చేశారు.

మహిళల ఆత్మగౌరవం కోసమే..



మహబూబాబాద్ పట్టణంలో రాష్ట్రంలోనే తొలిసారి తల్లీబిడ్డల సౌకర్యం కోసం పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం సంతోషకరం. ఇందుకు జిల్లా పోలీస్ అధికారుల బృందాన్ని అభినందిస్తున్నా.. ఈ సెంటర్ ద్వారా మహిళల ఆత్మగౌరవం పెంపొందుతుంది. పిల్లల మనస్సు గాయపడకుండా ఉంటుంది. మహిళలకు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం కలుగుతుంది. –సత్యవతి రాథోడ్, రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి





నీతిమంతుల తలంపులు న్యాయ యుక్తములు. భక్తిహీనులు చెప్పు ఆలోచనలు మోసకరములు.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.చతుర్దశి ప.3.56 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** శ్రవణం ప.2.32 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** సా.6.13 నుండి 7.44 వరకు **దుర్ముహూర్తం:** సా.4.24 నుండి 5.13 వరకు **అమృతఘడియలు:** రా.3.10 నుండి 4.41 వరకు.

సూర్యోదయం : 6.29
సూర్యాస్తమయం : 5.58
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

జో బైడెన్ (80), అమెరికా ప్రెసిడెంట్

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

అమెరికాకు ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ అధ్యక్ష ఎన్నికలు వాటికై అవి దగ్గర పడవు. అధ్యక్షులే తమకై తాము ఎన్నికలకు దగ్గర పడుతుంటారు!

రెండేళ్లే అయింది అధ్యక్షుడిగా నేనొచ్చి. ఇంకో రెండేళ్ల సమయం మిగిలే ఉంది. అప్పుడే మొదలు పెట్టేశారు.. "జో బైడెన్ రెండో టెర్మ్‌కి ఫిట్‌గా ఉంటారా?!" అని!!

కరోనాని డీల్ చేశాను. అఫ్గానిస్తాన్‌ని డీల్ చేశాను. రష్యాను డీల్ చేస్తున్నాను. డీల్ చేయవలసినవి ఇంకా ఉన్నాయి. వీటి గురించి ఎవరూ మాట్లాడ్డం లేదు! "నెక్స్‌ట్ ఎలక్షన్స్‌కి తనని తను డీల్ చేసుకోగలడా బైడెన్?"... సెనెట్‌లో ఇదే, హౌస్‌లో ఇదే, నా చాటున వైట్ హౌస్‌లోనూ ఇదే డిబేట్!

అమెరికాలో ఓట్ల కన్నా ఎక్కువగా డిబేట్‌లే అధ్యక్షుడి జీవితాన్ని ఛిన్నాభిన్నం చేస్తాయి.

నా సొంత డెమొక్రాట్‌లు కూడా నా ఫిట్‌నెస్ మీద నమ్మకం ఉంచడం లేదు! "ఇప్పుడే 80 అంటే రెండో టెర్మ్‌కి 82 వచ్చేస్తాయి. 82 ఏళ్ల వయసులో బైడెన్ తన



కాళ్లపై తను నడవగలడా?!" అని వారి సందేహం!

"మిస్టర్ ప్రెసిడెంట్.. మీరెంతో ఫిట్‌గా ఉన్నారు. మెంటల్‌గా, ఫిజికల్‌గా కూడా.." అంటున్నారెవరో! హిప్నాటిస్టుగానీ కాదు కదా!!

మెల్లిగా కళ్లు తెరిచి చూశాను.

"ఎవరు మీరు? నేనెక్కడ ఉన్నాను?" అని అడిగాను.

"మిస్టర్ ప్రెసిడెంట్.. నా పేరు కెవిన్ ఒకానర్. ప్రజాహితార్థం ఏడాదికొకసారి మీ ఆరోగ్య స్థితిని అమెరికా సంయుక్త రాష్ట్రాలకు నివేదించడం కోసం వాషింగ్టన్ శివార్లలో ఉన్న వాల్టర్ రీడ్ నేషనల్ మిలటరీ మెడికల్ సెంటర్‌లో ప్రత్యేక నియామకంపై విధి నిర్వహణలో ఉన్న మీ వ్యక్తిగత వైద్యుడిని. ప్రస్తుతం మీరు నా పర్యవేక్షణలోనే ఉన్నారు. అంతేకాకుండా..."

అతడింకా ఏదో చెప్పబోతున్నాడు.

ఆగమన్నట్లు సైగ చేశాను. ఆగాడు.

"మిస్టర్ కెవిన్. మీరొక వైద్యుడని మాత్రమే నేను అర్థం చేసుకోగలిగాను. అలాగే మీరు చెబుతున్నది నా ఫిట్‌నెస్ గురించేనని నేను అర్థం చేసుకోవచ్చా?" అన్నాను.

"ష్యూర్ మిస్టర్ ప్రెసిడెంట్. 6 అడుగుల ఎత్తూ, 80.7 కిలోల బరువూ కలిగి ఉండి; గత ఏడాదిగా నడకలో గానీ, మాటలో గానీ ఏ విధమైన మార్పునూ కనబరచని; మరియు.. ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లేమీ లేని 80 ఏళ్ల జో బైడెన్ అనే ఒక రివట వంటి మనిషి ఫిట్‌నెస్ గురించే నేను మీతో మాట్లాడుతున్నాను.." అన్నారు డాక్టర్ కెవిన్ తన వైద్య పరిభాషలో! ఆయన చేతిలో ఉన్నవి నా మెడికల్ రిపోర్ట్సే కావచ్చు.

"ఇట్స్ ఓకే మిస్టర్ కెవిన్.." అని నవ్వాను.

నేను అలా నవ్వుతూ ఉన్నప్పుడు జొనాథన్ ఫైనర్ అక్కడికి వచ్చాడు! యు.ఎస్. డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అతడు.

"ఎక్స్‌క్యూజ్‌మీ మిస్టర్ ప్రెసిడెంట్.. ఒక ఫోన్ కాల్‌ని మీకోసం చాలాసేపటిగా హోల్డ్ చేసి ఉంచాను. కలపమంటారా?" అని అడిగాడు జొనాథన్.

"ఎవరు?" అన్నాను.

కాస్త సంశయించి, "సర్.. ఆయన.. మీ బద్ధశత్రువైన మిస్టర్ డొనాల్డ్ ట్రంప్" అన్నాడు జొనాథన్. కనెక్ట్ చెయ్యమన్నాను.

మెడికల్ సెంటర్ నుంచి నేను బయటికి వస్తుండగా కాల్ కనెక్ట్ అయింది.

"హవ్యూ మిస్టర్ ట్రంప్?" అని అడిగాను.


"ఫైన్ అండ్ ఫిట్.. మిస్టర్ బైడెన్. థ్యాంక్యూ. మీరెలా ఉన్నారని అడిగేందుకే మీకోసం ట్రై చేస్తున్నాను.." అన్నారు ట్రంప్.

"నేను కూడా ఫైన్ అండ్ ఫిట్.. మిస్టర్ ట్రంప్. థ్యాంక్యూ.." అని నవ్వాను.

"మనమెప్పుడూ ఫిట్‌గానే ఉంటాం మిస్టర్ బైడెన్. కానీ మన చుట్టూ ఉన్నవాళ్లే.. మన ఫిట్‌నెస్‌పై నిరంతరం సందేహాలు వ్యక్తం చేస్తూ ఉంటారు.." అని పెద్దగా నవ్వారు ట్రంప్.

ఆ సమయంలో ట్రంప్ నాకు ఆప్త శత్రువులా, బద్ధ మిత్రుడిలా అనిపించారు!

తెలంగాణలో 'గంధర్వ' కార్యం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

గడువు ప్రకారం ఇంకో తొమ్మిది నెలల్లో తెలంగాణ శాసనసభకు ఎన్నికలు జరగాలి. ముందస్తు ఎన్నికల ప్రచారానికి ఇక తెరపడినట్టే! కర్ణాటకతోపాటే ఎన్నికలు (ముందస్తు) జరగాలంటే ఈ నెలాఖరులోగా శాసనసభను రద్దు చేయాలి. ఇప్పుడు రాజ్‌భవన్‌తోనూ, కేంద్రంతోనూ ఉన్న సంబంధాలను బట్టి చూస్తే అసెంబ్లీని రద్దు చేసి కూర్చునే సాహసానికి రాష్ట్ర ప్రభుత్వం ఒడిగట్టే అవకాశం లేదు. కనుక షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయి. అయినప్పటికీ ఎన్నికల సీజన్ ఇప్పటికే ప్రారంభమైంది.

జాతీయ పార్టీగా ప్రకటించుకున్న నేపథ్యంలో వస్తున్న ఎన్నికలు కనుక ప్రభుత్వాన్ని నిలబెట్టుకొని తీరవలసిన అవసరం బీఆర్ఎస్‌కు ఏర్పడింది. ఇప్పుడు గెలవకపోతే నేషనల్ హైవేపై రెడ్‌లైట్ పడినట్టవుతుంది. ఎంత పేరు మార్చుకున్నా తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్నందున ఎంతోకొంత ప్రజా వ్యతిరేకత ఉంటుందనే అభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సుమారు 47 శాతం ఓట్లు పడ్డాయి. ఆ తర్వాత ఆరు నెలల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆ ఓట్ల శాతం 41కి పడిపోయింది. కాంగ్రెస్ పార్టీ రెండు ఎన్నికల్లోనూ సుమారు 30 శాతం ఓట్లతో స్థిరంగా నిలబడగలిగింది. బీజేపీ మాత్రం అసెంబ్లీతో పోలిస్తే అదనంగా 12 శాతానికి పైగా ఓట్లను సాధించింది.

ఈ వివరాలను బట్టి చూస్తే బీఆర్ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో పడిన ఓట్లలో ఆరు శాతం బీజేపీకి బదిలీ అయ్యాయి. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న తెలుగుదేశం పార్టీ 2018లో మూడున్నర శాతం ఓట్లను సాధించింది. ఆరు నెలల తర్వాత ఈ ఓట్లలో ఒక శాతం కాంగ్రెస్‌కు, రెండున్నర శాతం బీజేపీకి బదిలీ అయ్యాయి. గతంలో 1998 లోక్‌సభ ఎన్నికల సందర్భంలో కూడా తెలంగాణ ప్రాంతంలో బీజేపీకి ఇరవై శాతానికి పైగా ఓట్లు పోలయ్యాయి. కేంద్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఆ పార్టీ కనిపిస్తే ఒంటరిగా పోటీ చేసి కూడా ఇరవై శాతం ఓట్లను బీజేపీ పొందగలదనే విషయం రుజువైంది. అసెంబ్లీ ఎన్నికల్లో గట్టి ప్రత్యామ్నాయంగా కనిపించిన సందర్భం గతంలో రాలేదు. ఇప్పుడు ఆ సందర్భాన్ని సృష్టించడానికి కమలం పార్టీ విశ్వప్రయత్నం చేస్తున్నది.

నాలుగేళ్ల తర్వాత ప్రభుత్వ వ్యతిరేక ప్రభావం వల్ల బీఆర్ఎస్ బలమేమైనా తగ్గిందా? లేక పెరిగిందా? కాంగ్రెస్ పార్టీలో దిగే మెట్లే తప్ప ఎక్కే మెట్లు కనిపించని ఈ పరిస్థితుల్లో అంతా భావిస్తున్నట్టు ఓటింగ్ బలాన్ని ఏ మేరకు ఆ పార్టీ కోల్పోయి ఉంటుంది? కోల్పోతే ఏ పార్టీ ఖాతాలోకి? తనను తాను ప్రత్యామ్నాయ శక్తిగా చెప్పుకుంటున్న భారతీయ జనతా పార్టీ ఇరవై శాతాన్ని దాటి ఏ స్థాయికి బలాన్ని పెంచుకోగలిగింది? క్షేత్రస్థాయి పరిస్థితులను శాస్త్రీయ పద్ధతిలో మదింపు చేయడం ద్వారా మాత్రమే ఈ ప్రశ్నలకు సమాధానాలను వెతుక్కోవడం సాధ్యమవుతుంది. అలా మదింపు చేసిన సమాచారాన్ని బట్టి మజ్లిస్ పార్టీ ఖాయంగా గెలిచే ఏడు స్థానాలు పోను మిగిలిన 112 చోట్ల కూడా అధికార పార్టీ ప్రధాన పోటీదారుగానే ఉంటుంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు శాతం ఓట్లతో ఒక్క సీటే గెలిచిన బీజేపీ గణనీయంగా పుంజుకొని సుమారు యాభై స్థానాల్లో గట్టి పోటీదారుగా కనబడుతున్నది. ఇంకో యాభై సీట్లలో కాంగ్రెస్ పార్టీ బలంగా పోటీపడుతున్నది. పది పన్నెండు స్థానాల్లో త్రిముఖ పోటీ ఉండవచ్చు. తాజా జాతీయ పరిణామాల నేపథ్యంలో బీజేపీ ప్రతిష్ఠ మసకబారితే ఈ అంచనాలు మారవచ్చు.

తెలంగాణలో చిన్న పార్టీలు కూడా పెద్దసంఖ్యలోనే ఉన్నాయి. వాటికి తోడు తిరుగుబాటు అభ్యర్థులూ, ఇండిపెండెంట్లూ వగైరాలు కలిసి ఎనిమిది నుంచి పది శాతం ఓట్లను కొల్లగొట్టే అవకాశం ఉంటుంది. మిగిలిన 90–92 శాతం ఓట్లనే మూడు ప్రధాన పార్టీలు పంచుకోవాలి. లోక్‌సభ ఎన్నికల్లో పడిన 41 శాతం ఓట్లను బీఆర్ఎస్ యథాతథంగా నిలబెట్టుకోగలిగితే మిగిలిన యాభై శాతం ఓట్లలో బీజేపీ, కాంగ్రెస్‌లు పునర్విభజన చేసుకోవాల్సి ఉంటుంది. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డి పాత జిల్లాల్లో బీజేపీ ప్రభావం కనబడుతున్నది. మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఏజెన్సీ ప్రాంతాల్లో కాంగ్రెస్ పరిస్థితి బీజేపీ కంటే మెరుగ్గా ఉన్నది. ఖమ్మం జిల్లాలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీజేపీలో చేరతారనే ప్రచారమే నిజమైతే ఆ జిల్లా ముఖచిత్రం కూడా త్రిముఖ పోరుగా మారవచ్చు.

బీఆర్ఎస్‌కు 41 శాతం ఓట్లు భద్రంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లో ఉన్నాయనే అభిప్రాయం నిజమైతే మిగిలిన యాభై శాతంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్, బీజేపీలకు చెరో ఇరవై ఐదు శాతం ఓట్లు పడవచ్చు. ఈ లెక్క ప్రకారం బీఆర్ఎస్ గెలుపు నల్లేరుపై నడక కావాలి. కానీ, ఈ పరిస్థితిని మార్చేస్తామన్న ధీమా బీజేపీ వ్యక్తం చేస్తున్నది. ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉన్నదని, అందువల్ల బీఆర్ఎస్ ఓట్లు కొన్ని తమ ఖాతాలో పడతాయని బీజేపీ ఆశిస్తున్నది. రానున్న రోజుల్లో కాంగ్రెస్ నుంచి, బీఆర్ఎస్ నుంచీ పలుకుబడి గల నాయకులు పెద్దఎత్తున తమ పార్టీలోకి వస్తారనీ, వారి వెంట ఓట్ల బ్యాంకును కూడా తెచ్చుకుంటారనీ ఆ పార్టీ నమ్ముతున్నది. కానీ, ఎంత బలమైన నాయకుడు పార్టీ మారినా ఆయన వెంట ఆ పార్టీ ఓటర్లందరూ నడిచే అవకాశం ఉండదని మునుగోడు ఎన్నిక నిరూపించింది. ఇతర పార్టీల నాయకులు బీజేపీలోకి ఫిరాయించే అవకాశాలు కూడా క్రమంగా సన్నగిల్లుతున్నాయి.

బెంగాల్ ఎన్నికలకు ముందు అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కొమ్ములు తిరిగిన నాయకుల్లో చాలా మందిని బీజేపీ తన కాంపౌండ్‌లోకి తెచ్చుకోగలిగింది. అధికార పార్టీని ఓడించినంత హడావుడి చేసింది. కానీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 'ఖేలా హోబే' (ఆట ఇంకా వుంది) అని సవాల్ చేసి పీఠాన్ని నిలబెట్టుకోగలిగింది. కాకపోతే బీజేపీ ఒక బలమైన శక్తిగా బెంగాల్‌లో నిలదొక్కుకోవడం ఒక వాస్తవం. తెలంగాణలో హిందూ భావజాలం వెనుక, మోదీ ఇమేజ్ వెనుక సమీకరించగలిగే గరిష్ఠ స్థాయి మద్దతు ఇరవై ఐదు, ముప్పై శాతాన్ని దాటకపోవచ్చు. ఇప్పటికే ఆ పార్టీ ఇందులో చాలావరకు సాధించింది. ఇంకా అదనపు మద్దతు కావాలంటే సుపరిపాలన, అభివృద్ధి కొనసాగింపు, విశ్వసనీయ నాయకత్వం వంటి అంశాలు తోడు కావాలి. హిందూత్వ అంశాన్ని ఇంతకంటే ఎక్కువ లాగితే మొదటికే మోసం వచ్చే అవకాశం కూడా ఉన్నది. మేము అధికారంలోకి వస్తే కొత్త సెక్రటేరియట్ గుమ్మటాలను కూల్చివేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చేసిన ప్రకటనకు ప్రజల్లో నెగెటివ్ స్పందనే కనిపించింది. నిర్మాణ కౌశలం మీద మతం ముద్ర వేయడమేమిటని బుద్ధిజీవులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారం ఇంకా ముదిరితే బిర్యానీకి, పులిహోరకు, వేణు గానానికి, షెహనాయ్ రాగానికీ, మృదంగ నాదానికీ, తబలా వాద్యానికీ కూడా మతం రంగు పులమరనే నమ్మకం ఏముంటుందనే ప్రశ్న తలెత్తుతుంది.

బీజేపీకి, బీఆర్ఎస్‌కూ ఎవరి వ్యూహం వారికున్నది. ఎవరి నమ్మకం వారికున్నది. కానీ కాంగ్రెస్‌లో మాత్రమే వ్యూహం గానీ, నమ్మకం గానీ కనిపించడం లేదు. కాకపోతే విజేతను నిర్ణయించడంలో కాంగ్రెస్ శ్రేణులు కీలకపాత్ర పోషించగల అవకాశాలు మాత్రం కొన్ని కనిపిస్తున్నాయి. అంతర్గత సమాచారం ప్రకారం రాష్ట్ర కాంగ్రెస్‌లో మూడు రకాల ఆలోచనా ధారలతో కూడిన మూడు పాయలున్నాయి. ఎన్నికల అనంతరం ఏ పార్టీకీ సొంతంగా మెజారిటీ రాదు. సెక్యులర్ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ఇది మొదటి పాయ ఆలోచన. అయితే ఈ రెండు పార్టీలు విడివిడిగా పోటీ చేయడం వలన బీజేపీ గణనీయంగా సీట్లు గెలిచి ప్రతిపక్షంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది. కనుక ఎన్నికల ముందే బీఆర్ఎస్‌తో పొత్తు కుదిరితే బీజేపీని సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయవచ్చనేది రెండో రకం ఆలోచనా స్రవంతి. రాష్ట్ర విభజన చట్టాన్ని రూపొందించడంలో కీలకపాత్ర పోషించిన ఒక ఏఐసీసీ నేత మద్దతు కూడా ఈ వర్గానికి ఉందట! కేంద్ర స్థాయిలో బీజేపీని ఓడించడానికి ప్రతిపక్షాలన్నీ కలిసి పోటీ చేయాలని వస్తున్న ప్రతిపాదనలకు అనుగుణమైన ఆలోచనే ఇది. ఇక ఎవరితో పొత్తులేకుండా ఒంటరిగా పోటీ చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దామని మూడో వర్గం భావిస్తున్నది. అయితే వీరి వాదన వెనుక దురుద్దేశాలున్నాయని బీఆర్ఎస్‌తో పొత్తు అనుకూల వర్గాలు ఆరోపిస్తున్నాయి. తమ వర్గం వారిని ఎక్కువమందిని గెలిపించుకొని హంగ్ అసెంబ్లీ ఏర్పడినట్లయితే బీజేపీ వైపు ఫిరాయించాలనేది వీరి ఆలోచనగా చెబుతున్నారు.

ఈ మూడు పరిణామాల్లో ఏది జరిగినా కొత్త ప్రభుత్వంలో కాంగ్రెస్ నేతల ప్రమేయమున్నట్టే లెక్క. పోషించబోయేది కూరలో కరివేపాకు పాత్రయినా, తులాభారంలో తులసి ఆకు పాత్రయినా సరే, కాగల కార్యాన్ని గంధర్వులు తీర్చిన చందంగా రాజుగారి గది తాళాలను కాంగ్రెస్ నేతలే తెరుస్తారు. హిండెన్‌బర్గ్ వ్యవహారం తర్వాత దేశవ్యాప్తంగా బీజేపీ గ్రాఫ్ వేగంగా పడిపోతున్నదనే వార్తలు కూడా వస్తున్నాయి. ఒకవేళ అదే నిజమైతే ఆ ప్రభావం తెలంగాణపై కూడా అంతో ఇంతో ఉండవచ్చు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవనానికి అవకాశం కూడా లభిస్తుంది. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోగలిగితే రాష్ట్రంలో రాబోయే ఎన్నికలు బీఆర్ఎస్ – కాంగ్రెస్ మధ్య పోటీగా మారతాయి. మూడు ముక్కలాటనే కొనసాగిస్తే రెండో స్థానం కోసం పోరాడవలసిన పరిస్థితి ఏర్పడవచ్చు.

vardhelli1959@gmail.com

> నాలుగేళ్ల తర్వాత ప్రభుత్వ వ్యతిరేక ప్రభావం వల్ల బీఆర్ఎస్ బలమేమైనా తగ్గిందా? లేక పెరిగిందా? తెలంగాణలో చిన్న పార్టీలు కూడా పెద్దసంఖ్యలోనే ఉన్నాయి. వాటికి తోడు తిరుగుబాటు అభ్యర్థులూ, ఇండిపెండెంట్లూ వగైరాలు కలిసి ఎనిమిది నుంచి పది శాతం ఓట్లను కొల్లగొట్టే అవకాశం ఉంటుంది. మిగిలిన 90–92 శాతం ఓట్లనే మూడు ప్రధాన పార్టీలు పంచుకోవాలి. లోక్‌సభ ఎన్నికల్లో పడిన 41 శాతం ఓట్లను బీఆర్ఎస్ యథాతథంగా నిలబెట్టుకోగలిగితే మిగిలిన యాభై శాతం ఓట్లలో బీజేపీ, కాంగ్రెస్‌లు పునర్విభజన చేసుకోవాల్సి ఉంటుంది. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డి పాత జిల్లాల్లో బీజేపీ ప్రభావం కనబడుతున్నది. మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఏజెన్సీ ప్రాంతాల్లో కాంగ్రెస్ పరిస్థితి బీజేపీ కంటే మెరుగ్గా ఉన్నది. ఖమ్మం జిల్లాలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీజేపీలో చేరతారనే ప్రచారమే నిజమైతే ఆ జిల్లా ముఖచిత్రం కూడా త్రిముఖ పోరుగా మారవచ్చు.

> బీజేపీకి, బీఆర్ఎస్‌కూ ఎవరి వ్యూహం వారికున్నది. ఎవరి నమ్మకం వారికున్నది. కానీ కాంగ్రెస్‌లో మాత్రమే వ్యూహం గానీ, నమ్మకం గానీ కనిపించడం లేదు. కాకపోతే విజేతను నిర్ణయించడంలో కాంగ్రెస్ శ్రేణులు కీలకపాత్ర పోషించగల అవకాశాలు మాత్రం కొన్ని కనిపిస్తున్నాయి. పోషించబోయేది కూరలో కరివేపాకు పాత్రయినా, తులాభారంలో తులసి ఆకు పాత్రయినా సరే, కాగల కార్యాన్ని గంధర్వులు తీర్చిన చందంగా రాజుగారి గది తాళాలను కాంగ్రెస్ నేతలే తెరుస్తారు. హిండెన్‌బర్గ్ వ్యవహారం తర్వాత దేశవ్యాప్తంగా బీజేపీ గ్రాఫ్ వేగంగా పడిపోతున్నదనే వార్తలు కూడా వస్తున్నాయి. ఒకవేళ అదే నిజమైతే ఆ ప్రభావం తెలంగాణపై కూడా అంతో ఇంతో ఉండవచ్చు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవనానికి అవకాశం కూడా లభిస్తుంది. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోగలిగితే రాష్ట్రంలో రాబోయే ఎన్నికలు బీఆర్ఎస్ – కాంగ్రెస్ మధ్య పోటీగా మారతాయి. మూడు ముక్కలాటనే కొనసాగిస్తే రెండో స్థానం కోసం పోరాడవలసిన పరిస్థితి ఏర్పడవచ్చు.

ప్రక్షిప్తాలు లేని వాల్మీకి రామాయణమే ప్రామాణికం

అభిప్రాయం




వనం జ్వాలా నరసింహారావు

ఉత్తర కాండలో చెప్పబడింది అంటూ, ప్రక్షిప్తమో, నిక్షిప్తమో, మరేదో తెలియని ఒక అప్రాధాన్యమైన 'శంబుక వధ' స్వకపోల కల్పిత కథ గురించి పుంఖాను పుంఖాలుగా వ్యాసాలూ, నాటికలూ, వ్యాఖ్యానాలూ గతంలోనూ, ఇటీవలి కాలంలోనూ ప్రచారంలోకి తేవడం వేదకాలం నుంచి భారతీయులు ఆచరిస్తూ వస్తున్న అపారమైన సంస్కృతీ, సంప్రదాయాలకు విఘాతం కలిగించడమే. శ్రీరాముడు ధర్మంగా పాలన చేస్తున్న సమయంలో, ఒక బ్రాహ్మణుడు ఆయన దగ్గరకు వచ్చి, చనిపోయిన తన కుమారుడిని చూపించి, అతడి అకాల మృత్యువుకు కారణం ఏమిటని రాముడిని ప్రశ్నించి, దీనికి కారణం ఆయన చేసిన పాపం అని నింద వేస్తాడట. కొడుకుని బ్రతికించకపోతే తానూ, తన భార్యా ప్రాణాలు విడుస్తామనీ, దానివల్ల శ్రీరాముడికి బ్రహ్మహత్యా దోషం కలుగుతుందని హెచ్చరిస్తాడట!

అక్కడే ఉన్న నారదుడు, యుగధర్మం గురించి రాముడికి వివరించి, త్రేతాయుగంలో బ్రాహ్మణులు, క్షత్రియులు, మాత్రమే తపస్సు చేయడానికి అర్హులనీ, దీనికి విరుద్ధంగా ఒక శూద్రుడు తపస్సు చేస్తున్నాడనీ, అందుకే బ్రాహ్మణుడి కుమారుడు మరణించాడనీ, దీనికి తగిన ప్రతిక్రియ చేయమనీ సలహా ఇస్తాడట. రాముడు పుష్పక విమానాన్ని స్మరించడం, అది రావడం, దానిలో ఎక్కి తిరుగుతూ, ఒక పర్వత సమీపంలో తలకిందుగా తపస్సు చేస్తున్న ఒకడిని చూసి (అతడే నారదుడు చెప్పిన శూద్రుడని ఎలా తెలిసిందో?) అతడి దగ్గరికి పోయి, తపస్సు చేయడానికి కారణం అడిగి, అతడు శూద్రజాతివాడని, పేరు శంబుకుడు అని, దేహంతో స్వర్గానికి పోవడానికి తపస్సు చేస్తున్నాడని అతడి ద్వారా తెలుసుకుని, వెనకా ముందూ చూడకుండా... కనీసం అతడి వాదన వినకుండా, కత్తితో శంబుకుడి తల నరికాడని అల్లిన అభూత కల్పన. రాముడి చేతిలో చనిపోయిన శంబుకుడికి మోక్షప్రాప్తి, చనిపోయిన బ్రాహ్మణుడి కుమారుడు బ్రతకడం, దానికి పొడిగింపు కథ. ఇందులోని వాస్తవాలు నమ్మదగ్గవో, కాదో, చదివినవారికే అర్థం కావాలి!

ఆదర్శ పురుషుడు, మర్యాద పురుషోత్తముడైన శ్రీరాముడి చరితాన్ని ఆదికావ్యంగా, శ్రీరామాయణ కావ్యంగా వాల్మీకి మహర్షి అనుగ్రహించారు. వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా 24 వేల శ్లోకాలను 24 వేల పద్యాలతో 7 కాండలుగా 'శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం'గా తెలుగు భాషలోనికి అనువదించిన మహామహానుభావులు, ఆంధ్ర వాల్మీకిగా, వాసు దాసుగా ప్రసిద్ధి కెక్కిన వావిలికొలను సుబ్బారావు గారు. వారి ప్రతిపదార్థ తాత్పర్య సహిత వేలాది పేజీల 'మందరాల'ను ఆసాంతం రెండు – మూడు పర్యాయాలు చదివి, శిష్ట వ్యావహారిక భాషలో అనువక్తగా రాసిన వ్యక్తిగా, బహుళ ప్రచారంలో అనేక విషయాలు వాల్మీకి రామాయణంలో లేవనే సంగతి అర్థం చేసుకున్న వ్యక్తిగా, కొన్ని విషయాలు చెప్పే ప్రయత్నం ఇది.





శ్రీ సీతారాముల చరితానికి సంబంధించినంతవరకు వాల్మీకి రామాయణం మాత్రమే ఏకైక ప్రామాణిక గ్రంథం. అహల్య శిలగా మారిందనడం వాస్తవం కాదని ఇది స్పష్టం చేసింది. గౌతముడు అహల్య స్వరూప నాశనం చేయకుండా, గాలిని ఆహారంగా తీసుకుంటూ, కఠిన వ్రతం ఆచరించమని మాత్రమే అంటాడు. తాను నాస్తికుడిని కాదనీ, నాస్తికోక్తులను చెప్పననీ, నాస్తి అనేది లోకంలో లేదనీ, సర్వం అస్తియే అనీ, తనని క్షమించమనీ స్వయంగా జాబాలి రాముడికి చెప్పడం... వశిష్ఠుడు సహితం జాబాలి వాస్తవానికి నాస్తికుడు కాదని చెప్పడం వాల్మీకి రామాయణంలో ఉన్నది. అడవిలో అన్నకు సాయంగా వెళ్తూ–వెళ్తూ సీతను జాగ్రత్తగా ఉండమని మాత్రమే అన్నాడు లక్ష్మణుడు. కాని ఎలాంటి రేఖా (లక్ష్మణ రేఖ) గీయలేదు. బ్రాహ్మణ సన్యాసి వేషంలో వచ్చిన రావణాసురుడు ఎడమ చేత్తో సీతాదేవి తల వెంట్రుకలను, కుడిచేత్తో తొడలను పట్టుకుని ఒడిలో ఎత్తుకున్నట్లు ఎత్తుకుని, తన మాయా రథంలో వేశాడు. అంటే రావణుడు సీతను తాకకుండా ఆమె నిలబడిన నేలను పెకలించాడన్నది అబద్ధమన్నమాట.

యుద్ధానికి వచ్చిన ఇంద్రజిత్తు, రామలక్ష్మణుల మీద బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తే, బ్రహ్మ వాక్కుకు కట్టుబడి వారు మూర్ఛపోయారు. అప్పుడు హనుమంతుడు హిమవత్పర్వతం పోయి, సంజీవని పర్వతం తేవడంతో, మహామూలికల వాసన చూసి రామలక్ష్మణులు స్మృతి తెచ్చుకుని తెప్పరిల్లారు. ఇంద్రజిత్తు లక్ష్మణుడిని చంపాడని ప్రచారంలో ఉన్న కథ వాస్తవం కాదు. సంజీవని తేవడం వాస్తవం అయినప్పటికీ, లక్ష్మణుడిని బతికించడానికి కాదు. ఇంద్రజిత్తు మరణించిన తరువాత యుద్ధానికి వచ్చిన రావణుడు, 'శక్తి' అనే బాణాన్ని లక్ష్మణుడి మీద ప్రయోగించగా లక్ష్మణుడు మూర్ఛపోయి నేలకూలాడు. మరణించలేదు. హనుమంతుడు తాను తెచ్చిన సంజీవని కొండనుంచి బయటికి తీసిన ఔషధులను లక్ష్మణుడికి వాసన చూపించాడు. వెంటనే అతడు సంతోషంగా మూర్ఛనుండి తేరుకున్నాడు. ఈ సారి కూడా లక్ష్మణుడు మరణించలేదనేది ప్రధానం. రామరావణుల మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో శ్రీరాముడు ఇంద్రుడి సారథి మాతలి రథాన్ని ఎక్కి బాణాన్ని సంధించి రావణుడి శిరస్సు నరికాడు. రావణుడి తల కిందపడ్డది కాని వెంటనే మరొక తల మొలిచింది. వాడు చనిపోయే విధం రాముడికి కనబడలేదు. అప్పుడు మాతలి సలహా ఇవ్వగా బ్రహ్మాస్త్రాన్ని రామచంద్రమూర్తి రావణుడిమీద వేయడంతో మరణించాడు. ఇదీ వాస్తవం. విభీషణుడు రావణుడి మరణ రహస్యం చెప్పాడని ఇతర రామాయణాలలో ప్రచారంలో ఉన్న విషయం వాస్తవం కానే కాదు.

విభీషణుడిని లంకకు అభిషిక్తుడిని చేసిన తరువాత రామాజ్ఞ ప్రకారం విభీషణుడు సీతను ఆయన దగ్గరికి తెచ్చాడు. సీతాదేవిరాగానే, లోకులు సందేహించడానికి అవకాశం ఇచ్చే చరిత్ర కలదానివయ్యావనీ, ఆమె తన ఇష్టం వచ్చిన చోటుకు పోవచ్చనీ అంటాడు. సీతాదేవి తన శీలంలో ఏ దోషం లేదనీ, తన పాతివ్రత్యం మీద ప్రమాణం చేసి చెప్తున్నాననీ అంటుంది. మరిది లక్ష్మణుడిని చూసి తనకు అగ్నిప్రవేశం తప్ప మరొక మార్గం లేదని, చితి పేర్చమని, అగ్నిప్రవేశం చేస్తానని అంటుంది. లక్ష్మణుడు చితిని పేర్చగా, అగ్నిలో సీతాదేవి ప్రవేశించింది. అగ్నిహోత్రుడు సీతాదేవిని ఒడిలో ఉంచుకుని బయటకు వచ్చి, సీతలో ఏ పాపం ఏమాత్రం లేదనీ, ఆమెను స్వీకరించమని రామునితో అన్నాడు. సీతాదేవి తనకు తానే అగ్నిపరీక్షకు సిద్ధమైంది కాని రాముడి ఆదేశంతో కాదు. రాముడు సీతను స్వీకరించాడు. అయోధ్యకు మరలి వచ్చిన శ్రీరాముడికి వసిష్ఠుడు పట్టాభిషేకం జరిపించాడు. చివరగా ఒక్క మాట. ప్రక్షిప్తాలు లేని వాల్మీకి రామాయణమే ప్రామాణికం.

వ్యాసకర్త ప్రధాన పౌర సంబంధాల అధికారి, తెలంగాణ

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

'శివాజీ' ర్యాలీకి హైకోర్టు ఓకే

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ ర్యాలీకి హైకోర్టు అనుమతించింది. అయితే నిర్వాహకులకు పలు షరతులు విధించింది. ర్యాలీలో 300 కంటే ఎక్కువ మంది పాల్గొన కూడదని, ఇతరులను రెచ్చగొట్టేలా ఎలాంటి నినాదాలు చేయరాదని ఆదేశించింది. షేక్‌పేట నుంచి యూసుఫ్‌గూడ వరకు నిర్వహించ తలపెట్టిన ఈ ర్యాలీకి తొలుత పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో హైదరాబాద్‌కు చెందిన ప్రశాంత్ హైకోర్టును ఆశ్రయించారు. పోలీసులు ర్యాలీకి అనుమతి ఇచ్చేలా ఆదేశించాలని కోరుతూ శుక్రవారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టగా, ట్రాఫిక్.. తదితర ఇబ్బందుల కారణంగా పిటిషనర్ కోరిన రూట్‌లో ర్యాలీకి అనుమతించలేమని పోలీసులు తెలిపారు. దీంతో విచారణ ఎటూ తెలకుండానే ముగిసింది. కాగా ఇదే అంశంపై పిటిషనర్ శనివారం మళ్లీ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ వినోద్ కుమార్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. షరతులతో ర్యాలీకి అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు.

అన్నింటినీ కలిపి విచారణ చేయండి

సాక్షి, హైదరాబాద్: అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ల విక్రయం పేరిట కోట్ల రూపాయలు వసూలు చేసి, మోసానికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై కేసులు ఎదుర్కొంటున్న సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఎండీ బూదాటి లక్ష్మీనారాయణపై వచ్చిన ఫిర్యాదులను స్టేట్‌మెంట్లుగా రికార్డు చేయాలని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఒకే నేరంపై పలు చోట్ల కేసులు నమోదు చేయడాన్ని లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు హైకోర్టులో సవాల్ చేశారు. తొలుత దీనిపై సింగిల్ జడ్జి విచారణ చేపట్టారు. లక్ష్మీనారాయణపై నమోదైన కేసులను సీసీఎస్‌కు బదిలీ చేయాలని చెప్పారు. ఒక కేసును లీడ్ కేసుగా తీసుకుని దర్యాప్తు చేయాలని పోలీసులను ఆదేశించారు. అయితే సింగిల్ జడ్జి ఆదేశాలను సవాల్ చేస్తూ లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించారు. ఈ అప్పీల్ పిటిషన్లపై చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ జరిపింది. సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. చట్టప్రకారం ఒకే నేరంపై అనేక కేసులు నమోదు చేయరాదని.. ఒకవేళ చేసినా అన్నింటినీ కలిపి ఒకే కేసుగా విచారణ చేపట్టాలని స్పష్టం చేసింది. చట్టప్రకారం ఎఫ్ఆర్ఐ నమోదు విషయంలో స్పష్టత ఉన్న నేపథ్యంలో ప్రస్తుత అప్పీల్ విచారణార్హతపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా అప్పీళ్లను ముగిస్తున్నట్లు పేర్కొన్నది.

ఖదీర్ కేసులో నిందితులను అరెస్టు చేయాలి



పిట్లం(జుక్కల్): మెదక్ జిల్లాకు చెందిన ఖదీర్‌ఖాన్ మృతికి కారకులైన అధికారులపై ఐపీసీ 302 సెక్షన్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. పేద వర్గాలకు చెందినవారనే మొన్న అడ్డగూడూరులో మరియమ్మ, ఇప్పుడు ఖదీర్‌ఖాన్‌లను దొంగతనం నెపంతో దారుణంగా చంపారని ఆరోపించారు. ప్రవీణ్‌కుమార్ శనివారం రెండో విడత బహుజన రాజ్యాధికారయాత్రలో భాగంగా కామారెడ్డి జిల్లా పిట్లం మండలం పిట్లం, పోతురెడ్డిపల్లి, కంభాపూర్, మర్దాండ, తిమ్మానగర్, గోద్మెగాం, కారెగాం, చిన్న కొడపగల్, బుర్నాపూర్ గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సర్కారును కోరారు. నాలుగేళ్లుగా రూ.4 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి ఉంటే తాజా బడ్జెట్‌లో కేవలం రూ.2,800 కోట్లు విడుదల చేసిందని విచారం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని, రోజుకు 12 గంటలు పనిచేయించుకొని నెలకు కేవలం రూ.8,500 జీతం ఇస్తోందని, పైగా 3 నెలలకొకసారి విడుదల చేస్తోందని అన్నారు.

'విద్యార్థులకు నష్టం లేకుండా విద్యాబోధన'

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న 9, 10 తరగతుల విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా భాషా పండితులు బోధన కొనసాగించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేసిన విజ్ఞప్తికి భాషా పండితుల జేఏసీ సుముఖత వ్యక్తం చేసింది. సోమవారం నుంచి బోధన చేస్తామని జేఏసీ ప్రకటించింది. బదిలీలు, పదోన్నతుల విషయంపై 17 రోజులుగా భాషా పండితులు 9, 10 తరగతుల తెలుగు, హిందీ, ఉర్దూ బోధనను బహిష్కరించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు నష్టం వాటిల్లకూడదని భావించిన మంత్రి సబిత.. శనివారం జేఏసీ నాయకులను చర్చలకు ఆహ్వానించారు. పదోన్నతుల సమస్యను పరిష్కరించి తగిన న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దీంతో సోమవారం నుంచి 9, 10 తరగతులకు తెలుగు, హిందీ, ఉర్దూ విద్యాబోధన చేస్తామని భాషా పండితుల జేఏసీ ప్రకటించింది. సమావేశంలో జేఏసీ నాయకులు ఎండీ అబ్దుల్లా, జగదీశ్, చక్రవర్తుల శ్రీనివాస్, కృష్ణ, నర్సింహులు, గౌరీశంకర్ పాల్గొన్నారు.

పాలడుగు.. పుడమి దీక్ష!

తొమ్మిదేళ్లుగా చెప్పులు వేసుకోని యువకుడు

- భూమాతతో అనుబంధం విడిపోకూడదనే సంకల్పం
- పర్యావరణ పరిరక్షణ కోసం కృషి.. గ్రామాలకు వెళ్తూ ప్రజలకు అవగాహన
- చెట్లు నరకడాన్ని అడ్డుకునేందుకు హరిత సైన్యం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి

చాలా మంది దేవుళ్ల పేరిట నియమ నిష్టలతో దీక్షలు చేస్తుండటం చూస్తూనే ఉంటాం.. కానీ 21 ఏళ్ల యువకుడు పాలడుగు జ్ఞానేశ్వర్ పర్యావరణాన్ని కాపాడాలనే సంకల్పంతో 'పుడమి'దీక్ష తీసుకున్నారు. పర్యావరణ పరిరక్షించేందుకు నడుం బిగించిన ఆయన.. భూమాతతో అనుబంధం విడిపోకూడదనే ఉద్దేశంతో తొమ్మిదేళ్లుగా చెప్పులు కూడా వేసుకోవడం లేదు. సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం ముక్టాపూర్ గ్రామానికి చెందిన పాలడుగు జ్ఞానేశ్వర్ జువాలజీలో పీజీ చేశారు. జ్ఞానేశ్వర్ కుటుంబానికి మంజీరా తీరానికి సమీపంలో నాలుగు ఎకరాల భూమి ఉంది. కొన్నేళ్లుగా నదిలో నీరు లేక పొలాలన్నీ బీడువారాయి. దీంతో చలించిపోయిన జ్ఞానేశ్వర్ పర్యావరణ పరిరక్షణ కోసం పోరాటం మొదలుపెట్టారు. ధరణి బాగుంటేనే మనం బాగుంటామని, మొక్కలు నాటడంతోనే సరిపోదని, ఉన్న చెట్లను నరకకుండా కాపాడుకుంటేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని చాటి చెబుతున్నారు.

ప్రకృతిని కాపాడితేనే మనిషికి మనుగడ

పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను ప్రతి ఒక్కరికి చాటి చెప్పేందుకే నేను చెప్పులు వేసుకోకుండా దీక్ష చేస్తున్నాను. భూమిపై ఉన్న ఏ ప్రాణి కూడా చెప్పుల్లాంటివి ధరించదు. పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న మనిషి మాత్రమే చెప్పులు ధరిస్తున్నాడు. భూమికి మనిషికి ఉన్న అనుబంధం ఎన్నటికీ విడదీయలేనిది. పర్యావరణ సమతుల్యతను కాపాడితేనే మానవ మనుగడ ఉంటుంది. దీనిని ఆచరణలో చూపేందుకు దీక్ష చేపట్టాను.
–జ్ఞానేశ్వర్, పర్యావరణ ఉద్యమకారుడు





పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ పాదయాత్ర చేస్తున్న జ్ఞానేశ్వర్

గ్రీన్ సోల్జర్లను ఏర్పాటు చేసుకుని..

పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు జ్ఞానేశ్వర్ తమ చుట్టుపక్కల ఉన్న సుమారు 35 గ్రామాల్లో హరిత సైన్యాన్ని (గ్రీన్ సోల్జర్స్)ను ఏర్పాటు చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో పాఠశాల విద్యార్థులను హరిత సైనికులుగా ఏర్పాటు చేసుకున్నాడు. పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడంపై వారికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరైనా చెట్లు నరికేందుకు ప్రయత్నిస్తే ఆపాలని, వెంటనే తనకు ఫోన్ చేయాలని వారికి చెప్పారు. అలా ఫోన్ చేస్తే ఆ గ్రామానికి వెళ్లి విద్యార్థులతో కలిసి చెట్లను కౌగిలించుకుంటారు. చెట్లు నరకవద్దని కోరుతారు. అటవీ అధికారులకు సమాచారం ఇచ్చి చెట్లు నరికి వేయకుండా కట్టడి చేస్తున్నాడు. ఏడాది క్రితం నాగల్‌గిద్దలో కొందరు పెద్ద చెట్టును నరికివేశారు. ఈ విషయం తెలిసిన జ్ఞానేశ్వర్.. అక్కడికి వెళ్లి మోడువారి వృక్షాన్ని తిరిగి భూమిలో పాతించాడు. కొద్దిరోజుల తర్వాత ఆ చెట్టు మళ్లీ చిగురించడం ఎంతో సంతోషం కలిగించిందని జ్ఞానేశ్వర్ చెబుతున్నారు.

యాత్రలతో అవగాహన

పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జ్ఞానేశ్వర్ తరచూ గ్రామాల్లో హరిత సైనికులతో కలిసి పాదయాత్రలు, సైకిల్ యాత్రలు చేస్తుంటారు. నాగల్‌గిద్ద, కంగ్టి, మనూర్, నారాయణఖేడ్, న్యాల్‌కల్ తదితర మండలాల పరిధిలోని గ్రామాల్లో ఇలా యాత్రలు చేశారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న జ్ఞానేశ్వర్‌కు ప్రతిష్టాత్మకమైన 'సాక్షి'ఎక్స్‌లెన్స్ అవార్డు కూడా దక్కింది.

యథేచ్ఛగా అటవీ చట్టాల ఉల్లంఘన

- రాష్ట్ర ప్రభుత్వంపై 'నేషనల్ బోర్డ్ ఆఫ్ వైల్డ్‌లైఫ్ స్టాండింగ్ కమిటీ'ఆగ్రహం
- నిబంధనలు, మార్గదర్శకాలకు భిన్నంగా పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖల తీరు
- మంచిర్యాల జిల్లా నీల్వాయి ప్రాజెక్టు విషయంలో అధికారులపై చర్యలకు ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: వివిధ అటవీ, వన్యప్రాణి సంరక్షణ చట్టాలను ఉల్లంఘించేలా తెలంగాణ ప్రభుత్వం, వివిధ శాఖలు వ్యవహరిస్తున్నాయని 'నేషనల్ బోర్డ్ ఆఫ్ వైల్డ్ లైఫ్ (ఎన్‌బీడబ్ల్యూఎల్)'స్టాండింగ్ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. 1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1980 అటవీ పరిరక్షణ చట్టాల నిబంధనలు, మార్గదర్శకాలకు భిన్నంగా పంచాయతీరాజ్, నీటిపారుదల తదితర శాఖల చర్యలు ఉన్నాయని పేర్కొంది. చట్టాలను ఉల్లంఘిస్తున్న శాఖల అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనికి సంబంధించి గత నెల 27న ప్రచురించిన 71వ ఎన్‌బీడబ్ల్యూఎల్ స్టాండింగ్ కమిటీ మినిట్స్ (డిసెంబర్ 29న ఢిల్లీలో ఈ సమావేశం జరిగింది) వివరాలు తాజాగా వెల్లడయ్యాయి.

ఎన్‌బీడబ్ల్యూఎల్ పేర్కొన్న ఉల్లంఘనలివీ..

- మంచిర్యాల జిల్లా పరిధిలో ప్రాణహిత వన్యప్రాణి అభయారణ్యం డీఫాల్ట్ ఈఎస్‌జెడ్‌లోని 18 హెక్టార్ల అటవీ భూమిలో.. నిబంధనలకు విరుద్ధంగా నీల్వాయ్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ 8-ఆర్ డిస్ట్రిబ్యూటరీ పనులు చేపట్టారు. దీనికి అధికారులపై వన్యప్రాణి సంరక్షణ, అటవీ పరిరక్షణ చట్టాల కింద చర్యలు చేపట్టి.. ఆ వివరాలను ఎన్‌బీడబ్ల్యూఎల్‌కు పంపాలి.
- మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మట్టేవాడ–వీరంపేట మధ్య బీటీ రోడ్డు నిర్మాణం కోసం పాకాల వైల్డ్ లైఫ్ శాంక్చువరీ నుంచి 5.93 హెక్టార్ల అటవీ భూమిని కేటాయించాలని ప్రతిపాదించారు. కానీ రోడ్డు నిర్మాణంలో ఉల్లంఘనలు జరిగాయి. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొండికుంట–మామిలవాయ్ రోడ్డు అప్‌గ్రేడేషన్ కోసం కిన్నెరసాని వైల్డ్ లైఫ్ శాంక్చువరీ నుంచి 3.43 హెక్టార్ల అటవీ భూమిని మళ్లించడంపై నివేదిక సమర్పించి.. ఉల్లంఘనలపై చర్యలు చేపట్టాలి.

జిల్లాకో బీసీ గురుకుల డిగ్రీ కాలేజీ!

కార్యాచరణ ప్రణాళిక రూపొందించిన బీసీ గురుకుల సొసైటీ

- ప్రస్తుతం రాష్ట్రంలో 16 బీసీ డిగ్రీ కళాశాలల నిర్వహణ
- మరో 17 కాలేజీల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారీ
- కొత్తగా ప్రతి జిల్లాకూ మరో బీసీ గురుకుల పాఠశాల స్థాపన
- ప్రభుత్వానికి నివేదించిన సొసైటీ
- అనుమతులు జారీ అయితే 2023–24 విద్యా సంవత్సరంలోనే ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: పేద బీసీ విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేసే దిశగా మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతులు సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) కసరత్తు చేస్తోంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత అత్యధిక గురుకుల పాఠశాలలను ప్రారంభించి చరిత్ర సృష్టించింది. విడతల వారీగా ఏకంగా 271 పాఠశాలలు కొత్తగా అందుబాటులోకి వచ్చాయి. ఈ విద్యా సంస్థల్లో సీట్ల కోసం డిమాండు విపరీతంగా ఉంది. ఈ క్రమంలో కొత్త విద్యా సంస్థల స్థాపనకు సొసైటీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి జిల్లాలో ఒక గురుకుల డిగ్రీ కాలేజీ ఏర్పాటును లక్ష్యంగా నిర్దేశించుకుంది.

–ప్రస్తుతం బీసీ గురుకుల సొసైటీ పరిధిలో 16 గురుకుల డిగ్రీ కాలేజీలున్నాయి. ఇందులో గతంలో ఒక డిగ్రీ కాలేజీ మాత్రమే ఉండగా... 2022–23 విద్యా సంవత్సరంలో కొత్తగా 15 డిగ్రీ కాలేజీలను ప్రారంభించింది. ప్రస్తుతం ఈ కళాశాలల్లో మొదటి సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్నారు. తాజాగా మిగతా జిల్లాల్లోనూ గురుకుల డిగ్రీ కాలేజీల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేసింది. కొత్తగా 17 డిగ్రీ కాలేజీల ఏర్పాటుకు సొసైటీ ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించింది.

జిల్లాకు ఒక పాఠశాల కూడా....

బీసీ గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఏటా ఐదో తరగతిలో 23వేలకు పైగా విద్యార్థులకు ఐదో తరగతిలో అడ్మిషన్లు ఇస్తున్నారు. వాస్తవానికి ప్రవేశాల కోసం వస్తున్న దరఖాస్తులతో పోలిస్తే సీట్ల ఖాళీల సంఖ్య అత్యల్పం. సగటున లక్షమందికి పైగా దరఖాస్తు చేసుకుంటుండగా... కేవలం పావువంతు మాత్రమే అవకాశం కల్పిస్తున్నారు. ఈక్రమంలో చాలామంది నిరుత్సాహానికి గురవుతున్నారు. ఈ పరిస్థితిని సమీక్షించిన సొసైటీ అధికారులు కొత్తగా జిల్లాకు ఒక పాఠశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. డిగ్రీ కాలేజీల అంశంతో పాటు పాఠశాలల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ఒకట్రెండు నెలల్లో ప్రభుత్వం ఆమోదించే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసిన వెంటనే ప్రారంభ పనులను వేగవంతం చేసేలా ఉండాలని మంత్రి సొసైటీ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడితే 2023–24 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కాలేజీలు, కొత్త పాఠశాలలు అందుబాటులోకి రానున్నాయి.

జనశక్తి మాజీల వసూళ్ల దందా!

- బీడీ కంపెనీ యజమాని వద్ద రూ.5 లక్షలు వసూలు
- కామారెడ్డి జిల్లాలో నలుగురు అరెస్ట్
- జనశక్తి అగ్రనేతలపైనా కేసులు
- అరెస్టయిన వారిలో ముగ్గురు రాజన్న సిరిసిల్ల జిల్లా వాసులు



ఎడ్ల లక్ష్మీరాజం

సిరిసిల్ల: సీపీఐ (ఎంఎల్) జనశక్తి మాజీ నక్సలైట్ల వసూళ్ల దందాపై పోలీసులు దృష్టిసారించారు. బీడీ కంపెనీ యజమానిని బెదిరించి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై కామారెడ్డి జిల్లా పోలీసులు శుక్రవారం నలుగురిని అరెస్ట్ చేశారు. వీరిలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన అధికార పార్టీ నాయకుడు కూడా ఉన్నారు. సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం అడవిపదిర సర్పంచ్, రైతుబంధు మండల సమితి అధ్యక్షుడు ఎడ్ల లక్ష్మీరాజం అలియాస్ సాగర్ (55), ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామానికి చెందిన జక్కుల యాదగిరి (45), వేములవాడ రూరల్ మండలం నూకలమర్రికి చెందిన సామల అనసూర్య (57), కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం మంథని దేవునిపల్లికి చెందిన వెంకటలక్ష్మి(53) అరెస్టయినవారిలో ఉన్నారు. కాగా, జనశక్తి అగ్రనేతలు కూర దేవేందర్ అలియాస్ అమర్, విమలక్క, బొమ్మని నర్సింహ అలియాస్ ఆనంద్, సంతోష్‌లకు ఈ కేసులో ప్రమేయం ఉందని, వీరు పరారీలో ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు. మరో అగ్రనేత, ప్రస్తుతం జైలులో ఉన్న కూర రాజన్న అలియాస్ రాజేందర్‌కు కూడా ఈ వసూళ్ల వ్యవహారంలో ప్రమేయం ఉన్నట్లు తెలిపారు.

50 లక్షలు డిమాండ్..

కామారెడ్డికి చెందిన చాట్ల నర్సయ్యకు జనశక్తి పార్టీ నక్సలైట్లతో పాత పరిచయాలు ఉన్నాయి. ఇప్పుడు నర్సయ్య కొడుకు శ్రీశైలం బీడీ కంపెనీ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జనశక్తి పార్టీకి అనుబంధంగా పనిచేసే గ్రామికశక్తి బీడీ కార్మిక సంఘం మహిళా నాయకులు చాట్ల శ్రీశైలంను రూ.50 లక్షలు డిమాండ్ చేసినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీశైలంను చంపుతామని కత్తితో బెదిరించి, నిజాంసాగర్ రోడ్డులోని బీడీ కంపెనీ నుంచి రూ.5 లక్షలు తీసుకెళ్లారు. కాగా, డబ్బులు తీసుకుని వెళ్తుండగా.. అనసూర్య, వెంకటలక్ష్మి, సాగర్, యాదగిరిలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలకలం

జనశక్తి మాజీ రాష్ట్ర కార్యదర్శి సాగర్ అరెస్ట్ కావడం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలకలం సృష్టించింది. 2005లో సాగర్ అరెస్టయ్యారు. అనంతరం సిరిసిల్లలో వ్యాపారం చేస్తూ.. అడవిపదిర సర్పంచ్‌గా ఉన్నారు. అలాగే అధికార పార్టీ నేతగా రైతుబంధు సమితి మండలాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఆయనతోపాటు యాదగిరి, ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మాజీ జనశక్తి దళనాయకుడు గొడ్డలి రామన్న భార్య అనసూర్య, అలాగే బీడీ కార్మిక సంఘం నాయకురాలు వెంకటలక్ష్మి అరెస్ట్ కావడం సిరిసిల్ల జిల్లాలో చర్చనీయాంశమైంది.

వ్యవసాయం పరిశ్రమగా అభివృద్ధి చెందాలి

- దిగుమతి నుంచి ఎగుమతిచేసే స్థాయికి ఎదగాలి
- వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



అగ్రిటెక్ పరిశ్రమలో మంత్రి నిరంజన్‌రెడ్డి

మనోహరాబాద్ (తూప్రాన్): 'దిగుమతి నుంచి ఎగుమతి చేసేస్థాయికి ఎదిగినపుడే వ్యవసాయ రంగంలో ముందుకు వెళ్లినట్టు.. సాంకేతికతతో, అధునాతన వ్యవసాయం చేసినప్పుడే అగ్రస్థానంలోకి వెళతాము'అని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వ్యవసాయం పరిశ్రమగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. శనివారం ఆయన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామికవాడలో అక్షయ అగ్రిటెక్ పరిశ్రమను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలసి సందర్శించారు. పరిశ్రమ డైరెక్టర్ రోబేశ్ మైతి మంత్రికి పరిశ్రమ గురించి వివరించారు. దక్షిణ భారతదేశంలో మొదటిసారిగా హార్వెస్టర్ పరిశ్రమను ముప్పిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ వ్యవసాయ రంగంలో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. వ్యవసాయ రంగానికి పనిముట్లు, ఆధునిక పరికరాలు ఎంతో అవసరమన్నారు.

మెట్రో రైలు వేళల్లో మార్పులు



సాక్షి, హైదరాబాద్: మెట్రో రైలు వేళలను తిరిగి సవరించినట్లు హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొన్నటి వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ సందర్భంగా రాత్రి 12 గంటల వరకు మెట్రో రైళ్లు నడిచాయి. ప్రస్తుతం ఎగ్జిబిషన్ ముగియడంతో పాత పద్ధతిలోనే చివరి ట్రిప్పు రాత్రి 11 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎల్‌బీనగర్, మియాపూర్, నాగోల్, రాయదుర్గం, జేబీఎస్ టర్మినల్ స్టేషన్ల నుంచి చివరి మెట్రో రైళ్లు బయలుదేరుతాయి. రాత్రి 12 గంటల వరకు గమ్యస్థానానికి చేరుకుంటాయి.

ఖదీర్ మృతిపై డీజీపీ సీరియస్

- శాఖాపరమైన చర్యలకు డీజీపీ ఆదేశం
- సీఐ, ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్
- విచారణాధికారిగా కామారెడ్డి డీఎస్పీ సురేశ్
- పర్యవేక్షణాధికారిగా జోనల్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి



ఖదీర్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

సాక్షి, హైదరాబాద్/మెదక్ మున్సిపాలిటీ: చైన్ స్నాచింగ్ చేశాడనే అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత తీవ్ర అనారోగ్యంతో ఖదీర్ అనే వ్యక్తి మృతి చెందిన కేసు జటిలమవుతోంది. పోలీసుల చిత్రహింసల వల్లే ఖదీర్ మృతి చెందాడన్న కుటుంబ సభ్యుల ఆరోపణల నేపథ్యంలో పోలీస్ అధికారులపై డీజీపీ అంజనీకుమార్ ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన సీఐ, సబ్ ఇన్‌స్పెక్టర్లపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని జోనల్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిని శనివారం ఆదేశించారు. కేసు దర్యాప్తును కామారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ పోలీస్ అధికారికి అప్పగించాలని డీజీపీ అంజనీకుమార్ ఆదేశాలు జారీ చేశా రు. కేసు దర్యాప్తును పర్యవేక్షించాలని ఐజీకి సూచించారు. కాగా, ఈ కేసులో సంబంధం ఉన్న మెదక్ టౌన్ ఇన్‌స్పెక్టర్ మధు, ఎస్ఐ రాజశేఖర్, కానిస్టేబుళ్లు పవన్‌కుమార్, ప్రశాంత్‌లను సస్పెండ్ చేసినట్టు ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కేసు దర్యా ప్తును కామారెడ్డి డీఎస్పీ సురేశ్‌కు అప్పగించినట్టు వెల్లడించారు. కాగా.. ఖదీర్ మృతి కేసులో ఇన్ స్పెక్టర్, ఎస్ఐ, కానిస్టేబుళ్లపై ఐజీ కార్యాలయానికి రిపోర్ట్ పంపినట్టు మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఖదీర్ అంత్యక్రియలు పూర్తి

ఖదీర్ అంత్యక్రియలు మెదక్ పట్టణంలో జరిగాయి. సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి నుంచి ఖదీర్ మృతదేహాన్ని శనివారం ఉదయం 6 గంటలకు మెదక్‌లోని పిట్లంబేస్‌కు తీసుకొచ్చారు. అనంతరం నవా పేట్‌లో ముస్లిం సంప్రదాయం ప్రకారం ఖదీర్ అంత్యక్రియలు పూర్తి చేశారు.

టీచర్ల బదిలీలపై ప్రభుత్వం సానుకూలంగా ఉంది



సాక్షి, హైదరాబాద్: టీచర్ల బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఎప్పటిలాగే తెలంగాణ ఉద్యోగులందరూ ప్రభుత్వానికి సహకరించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో శనివారం తెలంగాణ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యోగులు చేసిన పోరాటం మరువలేనిదని, తెలంగాణ ఉద్యోగులందరికి ధన్యవాదాలు తెలియజేస్తూ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఉద్యోగుల సంఘం చైర్మన్ పద్మాచారి రిటైర్డ్ అయినప్పటికీ తెలంగాణ ఉద్యోగుల సమస్యలు, వాటి పరిష్కారానికి నిత్యం ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి హరీశ్ కుమార్‌రెడ్డిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్పౌజ్ బదిలీలపై పూర్తిస్థాయి ఉత్తర్వులకు వినతి

సాక్షి, హైదరాబాద్: స్పౌజ్ టీచర్ల బదిలీలకు సంబంధించి పూర్తిస్థాయి ఉత్తర్వులను జారీ చేయాలని స్పౌజ్ టీచర్ల బదిలీల ఫోరం రాష్ట్ర కన్వీనర్ వివేక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్పౌజ్ టీచర్ల బదిలీల ఫోరం సమావేశం శనివారం జరిగింది. ఈ మేరకు బదిలీల ప్రక్రియ పూర్తికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కన్వీనర్ వివేక్ మాట్లాడుతూ స్పౌజ్ బదిలీలకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్ కేటగిరీని పూర్తి చేసిన ప్రభుత్వం.. సెకండరీ గ్రేడ్ టీచర్లు, పీఈటీ కేటగిరీలను నిలిపివేయడంతో వారంతా తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో 2 వేలకు పైగా ఉపాధ్యాయులు బదిలీల కోసం ఎదురు చూస్తుండగా.. ఇందులో 615 కేసులను ప్రభుత్వం ఆమోదించి ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. మిగతా టీచర్ల బదిలీలను నిలిపివేయడంతో వారు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని కేటగిరీల్లో స్పౌజ్ బదిలీలను పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'అటవీ భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణ నిలిపివేయాలి'

సాక్షి, హైదరాబాద్: అటవీ హక్కుల రక్షణ చట్టం–ఆర్‌వోఎఫ్ఆర్ (ఫారెస్ట్ రైట్స్ యాక్ట్, 2006) అమలు చేస్తున్నామనే సాకుతో రాష్ట్రంలో అటవీ భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణ జరపడాన్ని నిలిపేయాలని సీఎస్ శాంతికుమారి, తెలంగాణ చీఫ్‌వైల్డ్‌లైఫ్ వార్డెన్, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్‌కు పర్యావరణ కార్యకర్త సందీప్ కె.రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజకీయ ప్రేరేపిత నిర్ణయం కారణంగా మరిన్ని అటవీ ఆక్రమణలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. 11.5 లక్షల ఎకరాలను గిరిజనులు, అటవీప్రాంత వాసులకు పంపిణీ చేస్తామంటూ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ఏకపక్షంగా హామీనివ్వడం అటవీచట్టాలను ఉల్లంఘించడమేనని, ఇది రాజ్యాంగ వ్యతిరేకమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గిరిజనులెవరూ సంప్రదాయ పోడు వ్యవసాయాన్ని చేయడం లేదని, అందువల్ల అటవీ ఆక్రమణలను అధికారికంగా పోడుగా పరిగణించడం నిలిపేయాలని కోరారు. 2005 డిసెంబర్ 13 తర్వాత గిరిజనుల నుంచి, 1930ల తర్వాత గిరిజనేతరుల నుంచి క్లెయిమ్స్ స్వీకరించొద్దని సూచించారు. ఈ వినతిపత్రం ప్రతులను చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కార్యాలయానికి, ఢిల్లీలోని కేంద్ర సాధికారత కమిటీకి, రాష్ట్ర అటవీ శాఖ స్పెషల్ సీఎస్, కేంద్ర అటవీశాఖ ముఖ్యకార్యదర్శికి పంపించారు.

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండెంట్ కార్యాలయం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, నల్గొండ
టెండరు ప్రకటన
RC No.164/Canteen/GGH/NLG/2023 తేది: 15-02-2023
[illegible]
సం/- సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, నల్గొండ
DIPR RO No.12632-PP/CL/Adv/1/2022-23, Dt. 17.02.2023

ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ సెంటర్ (ARCI) ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్
(శాస్త్ర & సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వం యొక్క స్వయంప్రతిపత్తి గల పరిశోధన & అభివృద్ధి కేంద్రం)
P.O. బాలాపూర్, హైదరాబాద్ -500005, తెలంగాణ
Advt.No.ARCI/HRD/FELLOWSHIPS/1/2023
రీసెర్చ్ అసోసియేట్స్/జూనియర్/సీనియర్ రీసెర్చ్ ఫెలోస్ కోసం దరఖాస్తులు కోరబడుచున్నవి
(నాన్ - GATE/NET అభ్యర్థుల కోసం ARCI నిర్వహించిన వ్రాతపరీక్ష ద్వారా)
అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌కు సంబంధించి వివిధ అభివృద్ధి చెందుతున్న రంగాలలో ARCI యొక్క టైమ్-బౌండ్ స్పాన్సర్డ్/ ఇన్-హౌస్ ప్రాజెక్టుల కోసం దిగువ తెలిపిన ఫెలోషిప్ ఉద్యోగాలను నియమించడానికి ARCI అన్వేషిస్తున్నది:

క్ర.సం.	ఫెలోషిప్ రకం & విద్యార్హతలు & అనుభవం	ఉద్యోగాల తాత్కాలిక సంఖ్య	విద్యార్హతలు & అనుభవం ఆధారంగా నెలవారీ స్టైపెండ్ శ్రేణి
1	సంబంధిత సబ్జెక్టులో రీసెర్చ్ అసోసియేట్ (లెవల్ I/II/III) Ph.D లేదా తత్సమాన డిగ్రీ M.E./ M.Tech తరువాత 3 సంవత్సరాల పరిశోధన, బోధన, రూపకల్పన & అభివృద్ధి అనుభవంతో పాటు సైన్స్ సైటేషన్ ఇండెక్స్‌డ్ (SCI) జర్నల్‌లో కనీసం ఒక రీసెర్చ్ పేపర్ కలిగిన వారు.	మూడు (3)	రూ.47,000/- నుండి రూ.54,000/- + వర్తించు విధంగా HRA
2	జూనియర్ రీసెర్చ్ ఫెలో (JRF)/ సీనియర్ రీసెర్చ్ ఫెలో (SRF) B.E./B.Tech/M.Sc. లేదా M.E./M.Tech వ్యాలిడ్ GATE/ NET స్కోర్ కార్డ్‌తో లేదా పై విద్యార్హతలు కలిగిన నాన్-GATE/ NET అభ్యర్థులు ARCI చే నిర్వహించబోయే వ్రాతపరీక్షకు హాజరు కావలెను.	పదిహేను (15)	రూ.31,000/- నుండి రూ.35,000/- + వర్తించు విధంగా HRA

గమనించగలరు: ప్రస్తుతం చివరి సంవత్సరం/ సెమిస్టర్‌లో ఉన్న మరియు మే/ జూన్ 2023లోగా తమ డిగ్రీలను పూర్తి చేయాలనుకుంటున్న Ph.D /ఇంజనీరింగ్/ సైన్స్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేయవచ్చును.
పూర్తి వివరాల కోసం లాగాన్ అవ్వండి: http://www.arci.res.in/careers.html
ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలుకు చివరి తేది 13/03/2023

క్లుప్తంగా...

22న ఢిల్లీ మేయర్ ఎన్నిక

న్యూఢిల్లీ: ఢిల్లీ మేయర్ ఎన్నిక ఈ నెల 22న జరగనుంది. ఈ మేరకు ఢిల్లీ లెఫ్టినెంట్ జనరల్ (ఎల్‌జీ) వి.కె. సక్సేనా అనుమతినిచ్చారు. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సిఫారసు మేరకు 22న మున్సిపల్ హౌస్ సమావేశమై అదే రోజు మేయర్‌ను ఎన్నుకోవడానికి సక్సేనా అంగీకరించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ) మొదటి సమావేశమైన 24 గంటల్లోనే మేయర్, డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక పూర్తి కావాలని సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. మేయర్ ఎన్నికల్లో ఎల్‌జీ నామినేట్ చేసిన సభ్యులకు ఓటు వేసే హక్కు లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేయడంతో అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి పరిస్థితులు అనుకూలంగా మారాయి.

పాకిస్తాన్‌ను తాలిబన్లు ఆక్రమించుకుంటారేమో!

న్యూఢిల్లీ: తాలిబన్లు ఏదో ఒకరోజు పాకిస్తాన్‌ను ఆక్రమించుకున్నా ఆశ్చర్యపడాల్సిన పని లేదని ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ అన్నారు. పాకిస్తాన్‌లోని రేవు నగరం కరాచీలో పోలీసు స్టేషన్‌పై శుక్రవారం జరిగిన ఉగ్రవాదిపై ఆమె స్పందించారు. ఆ దేశాన్ని భయకంపితులను చేసే సామర్థ్యం ఐసిస్ ముష్కర మూకలకు కాదు, పాకిస్తానీ తాలిబన్లకు ఉందని పేర్కొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ హాస్పిటల్స్ సీఈఓగా మేఘనా పండిట్



లండన్: బ్రిటన్‌లోని అతిపెద్ద బోధనా ఆసుపత్రుల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ హాస్పిటల్స్–ఎన్‌హెచ్‌ఎస్ ఫౌండేషన్ ట్రస్టు సీఈఓగా భారత సంతతికి చెందిన వైద్యురాలు ప్రొఫెసర్ మేఘనా పండిట్ నియమితులయ్యారు. నేషనల్ హెల్త్ సర్వీస్(ఎన్‌హెచ్‌ఎస్) ట్రస్టుకు ఒక మహిళ, అందునా భారత సంతతికి చెందిన వ్యక్తి సీఈఓ కావడం ఇదే తొలిసారి. ఆమె 2022 జూలై నుంచి ఓయూహెచ్ మధ్యంతర సీఈఓగా ఉన్నారు. కఠిన పోటీని ఎదుర్కొని తాజాగా పూర్తిస్థాయి సీఈఓ అయ్యారు. భాగస్వామ్య వర్సిటీలతో, ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ హాస్పిటల్స్ చారిటీతో కలిసి పనిచేస్తానని మేఘనా చెప్పారు. అత్యున్నత నాణ్యతతో కూడిన పరిశోధనలు, నవీన ఆవిష్కరణలపై ప్రత్యేకంగా దృష్టి పెడతానన్నారు. ఆమె అబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీలో మేఘనా పండిట్ శిక్షణ పొందారు. అమెరికాలో యూనివర్సిటీ ఆఫ్ మిషిగన్‌లో యూరోగైనకాలజీ విజిటింగ్ ప్రొఫెసర్‌గా, ఎన్‌హెచ్‌ఎస్ ట్రస్టులో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా, వార్విక్ యూనివర్సిటీలో గౌరవ ప్రొఫెసర్‌గా చేశారు.

పండోరా క్లస్టర్



అంతరిక్షంలో మనకు సుదూరంలో ఉన్న 'పండోరాస్ క్లస్టర్' తాలూకు అద్భుత దృశ్యాలివి. జేమ్స్ వెబ్ టెలిస్కోప్ వీటిని తొలిసారిగా తన అత్యాధునిక నియర్ ఇన్‌ఫ్రారెడ్ కెమెరా సాయంతో ఇలా అందంగా బంధించింది! మూడు భారీ గెలాక్సీల సమూహాలు పరస్పరం కలిసిపోయి ఒక మెగా క్లస్టర్‌గా ఏర్పడ్డ తీరును నాన్ని కూడా ఈ క్లస్టర్లో గమనించవచ్చని నాసా చెబుతోంది. అంతేగాక ఈ కలయిక వల్ల పుట్టుకొచ్చిన అతి శక్తిమంతమైన గురుత్వాకర్షణ శక్తి వల్ల పండోరాకు ఆవల మరింత సుదూరాల్లోని గెలాక్సీలను కూడా పరిశీలించడం జేమ్స్ వెబ్‌కు సులువుగా మారిందట! పండోరా క్లస్టర్‌ను భూమి నుంచి ఇంత స్పష్టంగా వీక్షించగలగడం ఇదే తొలిసారి.

కృష్ణబిలం పుట్టింది!



అంతరిక్షంలో ఒక అరుదైన దృగ్విషయం సైంటిస్టుల కంటబడింది! రెండు న్యూట్రాన్ నక్షత్రాలు పరస్పరం కలిసిపోయి కిలోనోవాగా పేర్కొనే భారీ పేలుడుకు దారి తీయడమే గాక, చూస్తుండగానే శక్తిమంతమైన కృష్ణబిలంగా రూపాంతరం చెందాయి. ఇటీవలి కాలంలో అంతరిక్షంలో చోటుచేసుకున్న అత్యంత శక్తిమంతమైన పేలుడు ఇదేనని నాసా వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో రెండు తారలూ కలిసిపోయి కొద్దిసేపు ఒకే తారగా మారి అలరించాయట. ఈ మొత్తం ఎపిసోడ్‌ను చిలీలోని యూరోపియన్ సదరన్ అబ్జర్వేటరీ నుంచి సైంటిస్టులు సంభ్రమాశ్చర్యాలతో వీక్షించారు. ఇదంతా మనకు 1.5 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఎన్‌జీసీ4993 గెలాక్సీలో చోటుచేసుకుందట.

బ్రిటన్ గ్రాఫ్ పడిపోతోంది..!


ముసురుకుంటున్న మాంద్యం • తీవ్ర ఆర్థిక సంక్షోభం • షాక్ కొడుతున్న కరెంటు బిల్లులు

నిత్యావసరాల ధరలు నానాటికీ పైపైకి • వృద్ధి రేటు అట్టడుగుకు

యునైటెడ్ కింగ్‌డమ్. స్థిరత్వానికి మారుపేరు. ఎన్ని సంక్షోభాలు, ప్రపంచ యుద్ధాలు జరిగినా ఆర్థిక మూలాలు చెక్కు చెదరని దేశం. కానీ ఇప్పుడు ఆ దేశం కనీవినీ ఎరుగని గడ్డుకాలాన్ని ఎదుర్కొంటోంది. ఏడాదిలో ముగ్గురు ప్రధానమంత్రులు మారారు. అయినా బలహీనపడిపోతున్న ఆర్థిక వ్యవస్థని కాపాడే దిక్కు లేకుండా పోయింది. ధనిక దేశాల కంటే అన్నింట్లోనూ వెనుకబడిపోతూ మాంద్యం ఉచ్చులో చిక్కుకుంటోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్






నానాటికీ పతనం...

బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ రోజు రోజుకి పతనమైపోతోంది. ధరాభారం ప్రజల జేబుల్ని గుల్ల చేస్తోంది. పెరుగుతున్న ధరలకి తగ్గట్టుగా ఆదాయాలు పెరగకపోవడంతో ప్రజలకి కొనుక్కొని తినే స్తోమత కూడా కరువు అవుతోంది.దీంతో సమాజంలోని వివిధ వర్గాలు వేతనాల పెంపు డిమాండ్‌తో సమ్మెకు దిగుతున్నాయి. ప్రపంచంలోని మిగిలిన అభివృద్ధి చెందిన దేశాలు ఈ ఏడాది ఆర్థికంగా పుంజుకుంటే బ్రిటన్ మరింత క్షీణిస్తుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) అంచనా వేస్తోంది. ఆర్థిక మాంద్యం ఎదుర్కోక తప్పదని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రతో చమురు లభ్యత చాలా దేశాలకు అతి పెద్ద సమస్యగా మారింది. అమెరికా తన సొంత గడ్డపై లభించే శిలాజ ఇంధనాలపై ఆధారపడితే, ఫ్రాన్స్ అణు విద్యుత్‌పైనా, నార్వే జలవిద్యుత్‌పైన ఆధారపడ్డాయి. యూకే గ్యాస్‌పైనే ఆధారపడే దేశం కావడంతో విద్యుత్ బిల్లులు తడిసిపోపెడైపోయాయి. ఒకానొక దశలో 100% పెరిగాయి. దేశం ఆర్థికంగా కుదేలు కావడానికి ఇంధనం అసలుసిసలు కారణమని ఫిస్కల్ స్టడీస్ ఇనిస్టిట్యూట్ డిప్యూటీ డైరెక్టర్ కార్ల్ ఎమ్మర్‌సన్ అభిప్రాయపడ్డారు.

జీ–7 దేశాల్లో వెనక్కి


అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి సంపన్న దేశాల కంటే బ్రిటన్ ఎందుకు వెనుకబడిందనే చర్చ జరుగుతోంది. కరోనా మహమ్మారి, ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర ప్రపంచ ఆర్థిక వ్యవస్థలనే ఛిన్నాభిన్నం చేశాయి. కరోనా విసిరిన సవాళ్ల నుంచి కోలుకునే దశలో ఉక్రెయిన్‌పై రష్యా ప్రారంభించిన యుద్ధం పులి మీద పుట్రలా మారింది. అన్నింటిని తట్టుకొని ధనిక దేశాలు మళ్లీ పూర్వ స్థితికి వస్తూ ఉంటే బ్రిటన్ మాత్రం కోలుకోలేకపోతోంది. ఇందుకు ఎన్నో కారణాలు ఉన్నాయి. రాజకీయాలు, వాతావరణ పరిస్థితులు వంటివి కూడా ప్రభావం చూపిస్తాయి. ఇతర దేశాలు విద్య, ఆరోగ్య రంగం ఆధారంగా పరిస్థితుల్ని అంచనా వేస్తే బ్రిటన్ మాత్రం సేవల ఆధారంగా నిర్ణయిస్తుంది. జీ–7 దేశాలన్నీ ఈ ఏడాది కోలుకుంటాయని ఐఎంఎఫ్ వంటి సంస్థలు అంచనా వేస్తున్నాయి. కానీ బ్రిటన్ పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.



బ్రెగ్జిట్ దెబ్బ...

ప్రపంచదేశాలు కరోనా, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వంటి సంక్షోభాలను ఎదుర్కొంటే బ్రిటన్ ఆర్థిక సమస్యలకు బ్రెగ్జిట్ అదనపు కారణంగా నిలిచింది. 2016లో యూరోపియన్ యూనియన్ నుంచి బయటకు వచ్చినప్పటి నుంచీ దేశానికి ఆర్థిక సమస్యలు మొదలయ్యాయి. బ్రెగ్జిట్ కారణంగా యూకే ఆర్థిక వ్యవస్థకు ఏడాదికి ఏకంగా 10 వేల కోట్ల పౌండ్ల నష్టం వాటిల్లుతోందని బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. దీర్ఘకాలంలో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ 4 శాతానికి తగ్గుతుందని తెలిపింది. 2021 జనవరి నుంచి బ్రిటన్ నుంచి ఈయూకు ఎగుమతులు 16% పడిపోయాయి. ఈయూ నుంచి వచ్చే పెట్టుబడులు 2,900 కోట్ల పౌండ్లు తగ్గిపోయాయి.

శ్రామికులు కావలెను...



బ్రెగ్జిట్ ముందు వరకు ఈయూ నుంచి బ్రిటన్‌కి స్వేచ్ఛగా పని చేయడానికి వచ్చేవారు. ఇప్పుడు వర్కర్లు రావడం మానేశారు. ఫలితంగా ఆతిథ్యం, వ్యవసాయం, సేవా రంగాల్లో సిబ్బంది కొరత ఏర్పడింది. యువత పని చేయడం కంటే ఉన్నత చదువులపై దృష్టి పెడుతూ ఉంటే, వయసు మీద పడ్డ వారు ముందస్తుగా పదవీ విరమణ చేస్తున్నారు. అత్యధికులు రోగాల పాలై ప్రభుత్వం నుంచి లబ్ధి పొందుతున్నారే తప్ప పని చేసే వారి సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. ఇవన్నీ దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయి.

డాలర్‌తో పౌండ్ విలువ **0.83**



బ్రిటన్ జీడీపీ వృద్ధి రేటు అంచనా **-0.6%**



ద్రవ్యోల్బణం **10.1%**



• శివరాత్రి శోభ



మహాశివరాత్రి సందర్భంగా శనివారం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో గంగా-యమున-సరస్వతి నదుల త్రివేణి సంగమం ప్రాంతంలో పవిత్ర స్నానాలు చేస్తున్న భక్తులు

జీఎస్టీ ఫైలింగ్ ఆలస్య రుసుము తగ్గింపు



న్యూఢిల్లీ: జీఎస్టీ వార్షిక రిటర్నుల ఫైలింగ్ ఆలస్య రుసుమును హేతుబద్ధీకరిస్తూ జీఎస్టీ మండలి 49వ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను నమోదిత వ్యక్తులు ఫామ్ జీఎస్టీఆర్–9కు సంబంధించి రూ.5 కోట్ల వరకు టర్నోవర్ ఉంటే ఆలస్య రుసుము రోజుకు రూ.50, రూ.5–20 కోట్ల టర్నోవర్ ఉంటే రోజుకు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ రుసుము రూ.200 ఉంది. పన్ను చెల్లింపుదార్లకు ఉపశమనం కలిగించడానికి ఫామ్ జీఎస్టీఆర్–4, ఫామ్ జీఎస్టీఆర్–9, ఫామ్ జీఎస్టీఆర్–10లో పెండింగ్‌లో ఉన్న రిటర్నులకు సంబంధించి షరతులతో కూడిన మినహాయింపు లేదా ఆలస్య రుసుము తగ్గించడం ద్వారా క్షమాభిక్ష పథకాలను జీఎస్టీ మండలి సిఫార్సు చేసింది.

రాష్ట్రాలకు పరిహార బకాయిలు..

2022 జూన్‌కు సంబంధించి రాష్ట్రాలకు చెల్లించాల్సిన జీఎస్టీ పరిహార బకాయిలు రూ.16,982 కోట్లు, అలాగే ఆరు రాష్ట్రాలకు మరో రూ.16,524 కోట్లు విడుదల చేస్తున్నట్టు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రకటించారు. కేంద్రం తన సొంత వనరుల నుంచి ఈ మొత్తాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకుందని, భవిష్యత్తులో పరిహార రుసుము వసూళ్ల నుంచి ఈ మొత్తాన్ని తిరిగి పొందుతామని ఆమె చెప్పారు. దీంతో జీఎస్టీ చట్టం 2017 ప్రకారం ఐదేళ్ల కాలానికి తాత్కాలికంగా అనుమతించదగిన మొత్తం పరిహార బకాయిలను కేంద్రం క్లియర్ చేస్తుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటన వెల్లడించింది. రాష్ట్రాలు వారి అకౌంటెంట్ జనరల్ నుంచి సర్టిఫికేట్‌లను ఇచ్చినప్పుడు పెండింగ్‌లో ఉన్న ఏవైనా పరిహార రుసుము మొత్తాలను వెంటనే క్లియర్ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పరిహార బకాయి కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.689 కోట్లు, తెలంగాణకు రూ.548 కోట్లు సమకూరనున్నాయి.

బెల్లం పానకంపై తగ్గింపు..

ఇక విడిగా విక్రయించే బెల్లం పానకంపై ప్రస్తుతం 18 శాతం ఉన్న జీఎస్టీ ఎత్తివేస్తూ మండలి నిర్ణయం తీసుకుంది. ప్యాక్, లేబులింగ్ చేసి బెల్లం పానకం విక్రయిస్తే 5 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. పెన్సిల్ షార్ప్‌నర్స్‌కు 18 శాతం నుంచి జీఎస్టీని 12 శాతానికి చేర్చారు. పన్ను ఎగవేతలను అరికట్టడంతోపాటు పాన్ మసాలా, గుట్కా, నమిలే పొగాకు వంటి వస్తువుల నుండి ఆదాయ సేకరణను మెరుగుపరచడానికి గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ చేసిన సిఫార్సులను జీఎస్టీ మండలి ఆమోదించింది.

మోదీకి బానిసలా మారిన ఈసీ: ఉద్ధవ్



ముంబై: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బానిసగా మారిపోయిందని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే ధ్వజమెత్తారు. శివసేనను అంతం చేయడం ఎవరి తరమూ కాదని బీజేపీ, మోదీ గుర్తుంచుకోవాలన్నారు. శివసేన పేరు, ఎన్నికల గుర్తు సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గానికే చెందుతాయని ఈసీ ప్రకటించిన నేపథ్యంలో ఠాక్రే శనివారం ముంబైలో తన వర్గం నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. పార్టీ పేరును, గుర్తును దొంగిలించిన వాళ్లకు, వారి యజమానులకు గుణపాఠం నేర్పిద్దామని పిలుపునిచ్చారు. ''ఎన్నికల్లో నెగ్గడానికి బాల్‌ఠాక్రే ఫొటో, పేరును మోదీ వాడుకున్నారు. ఈ ద్రోహులకు ఠాక్రే ఫొటో కావాలి గానీ ఆయన కుటుంబం అక్కర్లేదు. దొంగ (సీఎం షిండే)కు బుద్ధి చెప్పేదాకా విశ్రమించేదే లేదు. అతను తేనెతుట్టెపై రాయి విసిరాడు. తేనెటీగలు కుట్టడం తథ్యం. దొంగిలించిన విల్లు, బాణాన్ని మోయలేడు. శివధనస్సు ఎత్తలేకపోయిన రావణుడిలాగే కూలిపోతాడు'' అన్నారు.

'పరిపూర్ణత్వానికి దగ్గరగా కొలీజియం'

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో జడ్జీల నియామకం కోసం ఉద్దేశించిన కొలీజియం వ్యవస్థ ప్రస్తుతం పరిపూర్ణత్వానికి(పర్‌ఫెక్ట్ మోడల్) దగ్గరగా ఉందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్ చెప్పారు. న్యాయ వ్యవస్థలో నియామకాలు, సంస్కరణలపై సీజేఏఆర్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోర్టుల్లో జడ్జీల నియామకం కోసం పేర్లను ప్రతిపాదించడం వెనుక కఠినమైన ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొలీజియం కంటే మెరుగైన వ్యవస్థ ఉంటుందని తాను అనుకోవడం లేదన్నారు. ప్రత్యామ్నాయం లేదు కాబట్టి కొలీజియంను కాపాడుకొనేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొలీజియంపై కేంద్ర ప్రభుత్వం, న్యాయ వర్గాల మధ్య వివాదం రగులుతున్న నేపథ్యంలో జస్టిస్ యు.యు.లలిత్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

18.82 లక్షల దీపాలతో గిన్నిస్ రికార్డు

ఉజ్జయిని: మహా శివరాత్రి సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని నగరంలో ఏకంగా 18,82,229 దీపాలు వెలిగించారు. గిన్నిస్ రికార్డు సృష్టించారు. శనివారం సాయంత్రం క్షిప్రా నది ఒడ్డున నిర్వహించిన ఈ కార్యక్రమంలో 20 వేల మంది వాలంటీర్లు పాల్గొన్నారు. 2022లో అయోధ్యలో అత్యధికంగా 15.76 లక్షల దీపాలు వెలిగించారు. ఉజ్జయినిలో గత శివరాత్రి సందర్భంగా 11,71,078 దీపాలు వెలిగించారు.

ముందెవరు ఐ లవ్యూ చెప్తారో?

విపక్ష ఐక్యతపై ఖుర్షీద్ • కాంగ్రెసే చెప్పుందని వెయిటింగ్: నితీశ్

పట్నా: బీజేపీని ఓడించేందుకు జాతీయ స్థాయిలో విపక్షాలు ఎంత త్వరగా ఒక్కతాటిపైకి వస్తే అంత మంచిదని కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. ''అయితే ఇందుకు ఎవరు ముందుగా చొరవ తీసుకోవాలన్నదే ప్రశ్న. ప్రేమలోనూ ఇలాంటి సందిగ్ధం అప్పుడప్పుడూ ఎదురవుతుంది. ఎవరు ముందు ఐ లవ్యూ చెప్పాలన్న ప్రశ్న తలెత్తుతుంది'' అంటూ చమత్కరించారు. శనివారం పట్నాలో జరిగిన సీపీఎం భేటీ ఇందుకు వేదికైంది. అందుకు కాంగ్రెసే తక్షణం చొరవ తీసుకోవాలని ఖుర్షీద్‌తో అందులో పాల్గొన్న జేడీ(యూ) నేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్, సూచించారు. ''మేం ఎదురు చూస్తున్నాం (వుయ్ ఆర్ వెయిటింగ్). ఈ విషయంలో ఇంకేమాత్రం ఆలస్యం కూడదు'' అన్నారు. ''రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ద్వారా వచ్చిన ఊపును పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నింటితోనూ జట్టు కట్టాలి. తక్షణం ఈ పని జరగాలి'' అని సూచించారు. అలా విపక్షాలన్నీ కలసికట్టుగా రంగంలోకి దిగితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 100 సీట్లు కూడా రావని ఆయన జోస్యం చెప్పారు. త్వరలో ఢిల్లీ వెళ్లి రాహుల్‌తో పాటు కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీతో భేటీ అవుతానని నితీశ్ తెలిపారు. విపక్ష కూటమిలో ప్రాంతీయ పార్టీలకే కాంగ్రెస్ అధిక ప్రాధాన్యమివ్వాలని ఆర్జేడీ నేత, బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ సూచించారు!

మాజీ భార్యతోపాటు ఆరుగురి కాల్చివేత

అమెరికాలో 52 ఏళ్ల వ్యక్తి ఘాతుకం

ఆర్కాబుతాలా(యూఎస్): అమెరికాలో మరో ఘోరం జరిగిపోయింది. ఒంటరితనంలో బాధపడుతున్న ఓ వ్యక్తి తన మాజీ భార్య, సవతి తండ్రితో పాటు మరో నలుగురిని కాల్చి చంపాడు. ఉత్తర మిసిసిపీలో శుక్రవారం ఈ దారుణం చోటుచేసుకుంది. రిచర్డ్ డేల్ క్రమ్(52) తొలుత టెన్నెసీ స్టేట్ లైన్ సమీపంలోని ఆర్కాబుతాలా దుకాణంలో బయట ఓ వాహనంలో డ్రైవర్ సీట్లో కూర్చున్న వ్యక్తిని హ్యాండ్‌గన్‌తో కాల్చేశాడు. తర్వాత కొద్ది మైళ్ల దూరంలోని ఓ ఇంట్లోకి ప్రవేశించి, అక్కడున్న మాజీ భార్య, ఆమె భర్తపై తూటాల వర్షం కురిపించాడు. మాజీ భార్య మరణించగా భర్త గాయాల పాలయ్యాడు. అనంతరం మరో తన సవతి తండ్రి ఇంట్లోకి దూరి ఆయన్ను, ఆయన సోదరిని అంతం చేశాడు. తర్వాత తాపీగా నడుచుకుంటూ తన ఇంటి వెనుకకు చేరుకున్నాడు. రోడ్డుపై కనిపించిన ఓ వ్యక్తిపై, వాహనంలో కూర్చున్న మరొకరిని కాల్చి చంపాడు. పోలీసులు రంగంలోకి దిగి క్రమ్‌ను అతడి ఇంటి వద్దే అదుపులోకి తీసుకున్నారు. హత్య కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. కాల్పుల్లో ఆరుగురు మరణించడం పట్ల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ప్రథమ మహిళ జిల్ బైడెన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. తుపాకీ చట్టాలను సంస్కరించడంపై ఇకనైనా దృష్టి పెట్టాలని కాంగ్రెస్‌కు జో బైడెన్ మరోసారి విజ్ఞప్తి చేశారు.

ఉగ్రవాదం తీవ్రవాదం 80% తగ్గాయి: అమిత్ షా



నాగపూర్: నరేంద్ర మోదీ హయాంలో కశ్మీర్‌లో ఉగ్రవాదం, ఈశాన్యంలో వామపక్ష తీవ్రవాదం 80 శాతం దాకా తగ్గుముఖం పట్టాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. శనివారం ఇక్కడ మరాఠా వార్తా లోక్‌మత్ స్వర్ణోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోదీకి ముందు దాకా దేశం పలు అంతర్గత భద్రతా సవాళ్లతో సతమతమవుతూ ఉండేదన్నారు. అలాంటిది గతేడాది కశ్మీర్ లోయను ఏకంగా 1.8 కోట్ల మంది పర్యాటకులు సందర్శించడం గొప్ప ఘనత అని అభిప్రాయపడ్డారు. ''అంతేగాక గత 70 ఏళ్లలో మొత్తం కలిపి కశ్మీర్‌కు రూ.12 వేల కోట్ల పెట్టుబడులు వస్తే గత మూడేళ్లలోనే మరో రూ.12 వేల కోట్ల పెట్టుబడులను మోదీ ప్రభుత్వం సాధించింది. పైగా కశ్మీర్‌లో ప్రతి ఇంటికీ నల్లా నీరు, కరెంటు అందించాం. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో కూడా వామపక్ష తీవ్రవాదం పూర్తిగా అదుపులోకి వచ్చింది. 60 శాతం ప్రాంతాల్లో సాయుధ దళాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని రద్దు చేశాం కూడా. రక్షణ రంగంలో దేశం స్వయంసమృద్ధంగా మారుతోంది. ఉపగ్రహ ప్రయోగాల్లో మనమెంతగా దూసుకెళ్తున్నదీ ప్రపంచమంతా చూస్తోంది. మన స్టార్టప్‌లు దుమ్ము రేపుతున్నాయి. ఇలా అన్ని రంగాల్లోనూ భారత్‌లో ప్రపంచంలో అత్యుత్తమ స్థానంలో చూడాలన్న ప్రధాని మోదీ ఆశయం నెరవేరేందుకు ఇంకెంతో దూరం లేదు'' అన్నారు. అందుకు తగ్గట్టుగా వచ్చే పాతికేళ్ల అమృత కాలంలో పలు లక్ష్యాలు పెట్టుకుని ముందుకెళ్తున్నట్టు వివరించారు.

సిసోడియాకు సీబీఐ పిలుపు

మద్యం కుంభకోణంలో నేడు విచారణ

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆప్ నేత మనీశ్ సిసోడియాను సీబీఐ ఆదివారం విచారణకు పిలిచింది. ఆయనపై విచారణ కొనసాగుతున్నందున ఇంకా నిందితుల జాబితాలో చేర్చలేదని సీబీఐ వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో గత అక్టోబర్ 17న సీబీఐ ఆయన్ను ప్రశ్నించడమే గాక ఇంటినీ, బ్యాంకు లాకర్లను కూడా శోధించింది.

కుంభకోణమే లేదు: కేజ్రీవాల్

మద్యం కుంభకోణమనేదే జరగలేదని ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఆప్‌పై కక్షసాధింపు చర్యల్లో భాగంగా మోదీ సర్కారు కుట్రపూరితంగా ఇలా లేని కుంభకోణాన్ని పుట్టించిందని ఆరోపించారు. ''అయితే విచారణకు మేం పూర్తిగా సహకరిస్తాం. చివరికి సత్యమే గెలుస్తుంది'' అన్నారు. కేజ్రీవాల్ వ్యాఖ్యలను బీజేపీ ఎద్దేవా చేసింది. ఏ కుంభకోణమూ జరక్కపోతే మద్యం విధానాన్ని ఎందుకు రద్దు చేసినట్టని ప్రశ్నించింది.

దక్షిణాఫ్రికా నుంచి 12 చీతాల రాక

శివోపూర్: దక్షిణాఫ్రికా నుంచి 12 చీతాలు భారత వైమానిక దళం విమానంలో మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ ఎయిర్‌పోర్టుకు శనివారం ఉదయం 10 గంటలకు చేరుకున్నాయి. ఇందులో ఏడు మగవి, ఐదు ఆడ చీతాలు ఉన్నాయి. వీటిని 165 కిలోమీటర్ల దూరంలోని శివోపూర్ జిల్లా కునో జాతీయ పార్కు(కేఎన్‌పీ)లోని క్వారంటైన్ ఎన్‌క్లోజర్‌లో భద్రంగా వదిలారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర పర్యావరణ, అడవుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐదు నెలల క్రితం ఆఫ్రికా ఖండంలోని నమీబియా నుంచి 8 చీతాలను భారత్‌కు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ చీతాలను గత ఏడాది సెప్టెంబర్ 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కునో జాతీయ పార్కులో స్వయంగా వదిలారు. ఇవి ప్రస్తుతం అడవిలో సందడి చేస్తున్నాయి. తాజాగా తీసుకొచ్చినవాటితో కలిసి మన దేశంలో చీతాల సంఖ్య 20కు చేరుకుంది. వీటిలో 10 మగ, 10 ఆడ చీతాలు ఉన్నాయి. భారత్‌లో చీతాలు ఏడు దశాబ్దాల క్రితం పూర్తిగా అంతరించిపోయాయి. వీటిని మళ్లీ ప్రవేశపెట్టి, సంఖ్యను పెంచాలని 2009లో అప్పటి యూపీఏ ప్రభుత్వం సంకల్పించింది. కేంద్ర పర్యావరణ శాఖ మాజీ మంత్రి జైరామ్ రమేశ్ 'ప్రాజెక్ట్ చీతా'కు శ్రీకారం చుట్టారు.


• కునో జాతీయ పార్కుకు తరలింపు
• భారత్‌లో 20కి చేరిన చీతాల సంఖ్య

ఇందులో భాగంగా ఆఫ్రికా ఖండం నుంచి చీతాలను తీసుకొచ్చేందుకు అక్కడి దేశాలతో భారత ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ఒక్కో చీతా కోసం రూ.2,48,296 (3,000 డాలర్లు) ఖర్చు చేసింది. చీతాలను 30 రోజులపాటు క్వారంటైన్‌లో ఉంచిన అనంతరం ఆరోగ్య పరిస్థితి సక్రమంగా ఉంటే అడవిలోకి వదిలేస్తారు.



కునో జాతీయ పార్కు క్వారెంటైన్ ఎన్‌క్లోజర్లో చీతా

సాక్షి
కరీంనగర్
ఆదివారం | 19 | ఫిబ్రవరి | 2023


వేములవాడ ఆలయం ఏరియల్ వ్యూ..


కళాకారిణి నృత్యప్రదర్శన


వేములవాడలో అనువంశిక అర్చకుల లింగార్చన


కరీంనగర్ కమాన్ రోడ్డు రామేశ్వరాలయంలో..


రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు



హరహర మహాదేవ

వేములవాడలో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

- రాజన్నను దర్శించుకున్న 3 లక్షల మంది భక్తులు
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- టీటీడీ తరఫున వచ్చిన డిప్యూటీ ఈవో బృందం
- అలరించిన శివార్చన.. ఆర్జిత సేవలు రద్దు
- శివనామస్మరణతో మారుమోగిన జిల్లా శైవక్షేత్రాలు


జాగరణ మొక్కులు

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పూజలు

వేములవాడ: దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ రాజన్న క్షేత్రం శివనామస్మరణతో మారుమోగింది. మహాశివరాత్రిని పురస్కరించుకొని రాజన్న దర్శనానికి దాదాపు 3 లక్షల మంది వరకు వేములవాడకు తరలివచ్చారు. ఒక్కో భక్తుడి దర్శనానికి దాదాపు పది గంటల సమయం పట్టింది. శివమాలాధారులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. సాయంత్రం 6 గంటల నుంచి నిరంతరం లఘు దర్శనాలకు అవకాశం కల్పించారు. ఉదయం వేళలో మధ్య మధ్యలో దర్శనాలు నిలిపివేయడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. ఆర్జిత సేవలు రద్దు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో క్యూలైన్లలో భక్తులు సొమ్మసిల్లి పడిపోయారు. లింగోద్భవ సమయంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఏర్పాట్లను కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్‌లు ఖీమ్యానాయక్, సత్యప్రసాద్, ఏఎస్పీ చంద్రయ్య, తహసీల్దార్ రాజారెడ్డి పరిశీలించారు.

రాజన్నకు వెంకన్న పట్టువస్త్రాలు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజన్నకు తిరుమల తిరుపతి దేవస్థానం తరపున పట్టువస్త్రాలను డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ బృందం సమర్పించారు. వీరికి ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ప్రసాదాలు అందించి, సత్కరించారు.

రూ.50 కోట్లతో అభివృద్ధి : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

వేములవాడ, సిరిసిల్ల పట్టణాలను రూ.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీరాజరాజేశ్వరస్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న మంత్రులకు కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఆలయ ఈవో కృష్ణప్రసాద్, అడిషనల్ కలెక్టర్లు ఖీమ్యానాయక్, సత్యప్రసాద్ స్వాగతం పలికారు. రాజన్న దర్శనం అనంతరం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వేములవాడపై ప్రత్యేక దృష్టి పెట్టారని, రాష్ట్రంలోనే ఎములాడ రాజన్న ఆదాయంలో నంబర్ వన్‌గా నిలుస్తుందన్నారు. గుడి చెరువు, ధర్మ గుండంలను ఎల్లప్పుడు గోదావరి జలాలతో నింపుతామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు ఉన్నారు.

మార్మోగిన ఆలయాలు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ పట్టణంతో పాటు జిల్లావ్యాప్తంగా ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. కరీంనగర్ పాతబజారులోని శివాలయం, కమాన్ వద్ద రామేశ్వరాలయంలో స్వామివారి దర్శనం కోసం ఉదయం నుంచే భక్తులు బారులుతీరారు.

వేడుకలు ఇలా...

- శుక్రవారం అర్ధరాత్రి 12 నుంచి శనివారం వేకువజాము 3.30 గంటలు: స్థానికుల దర్శనాల అనంతరం నిరంతరం లఘు దర్శనాల కొనసాగింపు.
- శనివారం ఉదయం 7 గంటలు: టీటీడీ డిప్యూటీ ఈవో హరీంద్ర నాథ్ ఆధ్వర్యంలో రాజన్నకు పట్టు వస్త్రాలు సమర్పించారు.
- ఉదయం 8: రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ దంపతులు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పట్టువస్త్రాలు సమర్పించారు.
- మధ్యాహ్నం 3.30: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రాజన్నను దర్శించుకున్నారు.
- సాయంత్రం 4: శివమాలధారులు రాజన్నను దర్శించుకున్నారు.
- సాయంత్రం 6: అద్దాల మండపంలో అనువంశిక అర్చకుల ఆధ్వర్యంలో సామూహిక మహాలింగార్చన.
- సాయంత్రం 6 నుంచి ..: రాష్ట్ర భాషా, సాంస్కృతికశాఖ జాయింట్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఆధ్వర్యంలో శివార్చన.
- రాత్రి 11.35 నుంచి ఉదయం 4 గంటలు: లింగోద్భవ సమయంలో రాజన్నకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం.

సేవలు ఇలా..

- రాజన్న మహాజాతరలో 2 వేల మంది పోలీసులు బందోబస్తు చేపట్టారు.
- 650 మంది శానిటేషన్ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు విధులకు హాజరయ్యారు.
- ఎంపీవోలు 80 మంది, మెడికల్ సిబ్బంది 300, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ 150, అంగన్‌వాడీలు 150, స్వచ్ఛంద సంస్థ సభ్యులు వెయ్యి మంది జాతరలో విధులు నిర్వహించారు.
- ఆలయ సిబ్బంది 850, సెస్ ఉద్యోగులు 90, ఎక్సైజ్ 75 మంది విధులకు హాజరయ్యారు.
- 800 బస్సుల్లో భక్తులను వివిధ ప్రాంతాలకు చేరవేశారు.
- 14 ఉచిత బస్సులు తిప్పాపూర్ నుంచి రాజన్న ఆలయానికి భక్తులను ఉచితంగా చేరవేశాయి.


పూనకంతో భక్తురాలు


అమ్మవారి ప్రతిమతో కళాకారుడి ప్రదర్శన




గన్నేరువరం మండలం కాసింపేటలోని స్వయంభూ మానసాదేవి ఆలయంలో భక్తులు


కోనేరులో భక్తుల స్నానాలు

బాలికలు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

కరీంనగర్‌కల్చరల్: లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే దిశగా ప్రతీ బాలిక ముందుకు సాగాలని క్రీడాకారిణి మౌంటైనర్ ఆశ మాల్వియా అన్నారు. దేశ పర్యటనలో భాగంగా ఆమె సైకిల్‌పై అన్ని రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం కరీంనగర్ జిల్లాకు చేరుకున్న మాల్వియా, కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌ను కలిశారు. సైకిల్‌పై అన్ని రాష్ట్రాల్లో తాను పర్యటిస్తున్న సందర్భంగా ఎదురైనా అనుభవాలను వివరించారు. అనంతరం మానకొండూరులోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళా సాధికారత, రక్షణతో కూడిన దేశ గొప్పతనం చాటేందుకు తాను సైకిల్‌పై దేశ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాలికలు లక్ష్యం నిర్దేశించుకోవాలని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కాగా గత నవంబర్ 1న గుజరాత్‌లో ప్రారంభమైన ఆశ మాల్వియా సైకిల్ యాత్ర ఈ ఏడాది సెప్టెంబర్ 29న ఢిల్లీలో ముగియనుంది.

అభినందించిన సీపీ

కరీంనగర్‌క్రైం: మహిళా సాధికారత, రక్షణతో కూడిన భారత దేశాన్ని గురించి చాటేందుకు సైకిల్ యాత్ర చేపట్టిన ఆశ మాల్వియా శనివారం కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడును కరీంనగర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ ఆమెను అభినందించారు. ఈ పర్యటన సందర్భంగా ఎదురైనా అనుభవాలను సీపీకి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఆశ మాల్వియా


ఆశమాల్వియాను అభినందిస్తున్న సీపీ సుబ్బారాయుడు

అధికారుల నిర్లక్ష్యం.. పేషెంట్లకు శాపం..

- మనుగడలో ఉన్నా మూలకే అంబులెన్స్‌లు
- ఆరుగురు డ్రైవర్లున్నా సౌకర్యం సున్నా
- అడ్డూ అదుపు లేని ప్రైవేటు అంబులెన్స్‌ల దోపిడీ

కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో అధికారుల నిర్లక్ష్యం.. రోగులకు శాపంగా మారుతోంది. హైరిస్క్ ఉన్న రోగులకు అత్యవసర పరిస్థితుల్లో వరంగల్, హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించేందుకు ఉపయోగకరంగా ఉండే అంబులెన్స్‌లను మూలన పడేస్తున్నారు. రోగుల సౌకర్యార్థం మూడు అంబులెన్స్‌లు ఉన్నా ఎలాంటి ఉపయోగం లేకుండా పోతోంది. రెండు అంబులెన్స్‌లను పక్కన పడేసి ఒకే ఒక్క అంబులెన్స్‌ను వాడుతున్నారు. రెండేళ్ల క్రితం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ బర్త్‌డే సందర్భంగా అత్యాధునిక సౌకర్యాలు కలిగిన అంబులెన్స్ ఖరీదు చేసిన కరీంనగర్ జిల్లా ఆసుపత్రికి అందించారు. ఏడాది తిరగకముందే దాన్ని పక్కనబెట్టారు. మరొక వింగర్ అంబులెన్స్‌ను కూడా పేషెంట్‌లకు వాడకుండా అవసరమైనప్పుడు వైద్యుల అవసరాలకు వాడుతున్నారు. ఒకే ఒక్క పాత అంబులెన్స్‌ను మాత్రం పేషెంట్ల సేవలకు వాడుతున్నారు.


ఎంపీ సంజయ్ బహుకరించిన అంబులెన్స్

ఒక్క అంబులెన్స్‌తో తిప్పలు..

కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి నిరుపేదలకు వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుంటే అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. మూడు అంబులెన్స్‌లు మంచి కండీషన్‌లో అందుబాటులో ఉన్నప్పటికీ ఒకే ఒక్క అంబులెన్స్‌ను వాడుతూ పేషెంట్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని వాడకపోవడం వల్ల పేషెంట్లు ప్రైవేటు అంబులెన్స్‌ల దోపిడీకి గురవుతున్నారు. సర్కారు ఆసుపత్రికి వస్తే అంబులెన్స్‌ల రూపంలో అడ్డూఅదుపు లేని దోపిడీకి గురవుతున్నామని రోగుల బంధువులు వాపోతున్నారు.


మరో అంబులెన్స్

ఆరుగురు డ్రైవర్లు ఉన్నా..

రోడ్డు ప్రమాదాలు, పాయిజన్ వంటి ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ఇక్కడ వైద్యం చేయలేని పరిస్థితుల్లో వరంగల్ ఎంజీఎం, హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు రెఫర్ చేస్తుంటారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ ఇలాంటి కేసులు జిల్లా ఆసుపత్రికి వస్తూ ఉంటాయి. ఈ క్రమంలో ఒక పేషెంట్ తీసుకొని ఒక అంబులెన్స్ వెళితే.. ఆ తర్వాత రెఫర్ చేసే కేసులకు అంబులెన్స్‌లు లేవని చెప్తున్నారు. అంతేకాదు.. ప్రైవేటు అంబులెన్స్‌ల్లో వెళ్లాలంటూ పురమాయిస్తున్నారు. దీంతో తప్పనిపరిస్థితిలో రోగి బంధువులు ప్రైవేటు అంబులెన్సులను ఆశ్రయిస్తున్నారు. జిల్లా ఆసుపత్రిలో అంబులెన్స్‌లు నడపడానికి ఆరుగురు డ్రైవర్లు సైతం ఉన్నారు. వీరిలో ఒకరిద్దరు తప్పా మిగతా వారెవ్వరూ డ్యూటీలు చేయడం లేదు. డ్యూటీ సమయంలో ఆసుపత్రిలోనే ఉన్నా వారి సొంత పనుల్లో మునిగితేలుతుంటారు. ఇప్పటికైనా పేద రోగుల గురించి అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాగా.. ఈ విషయమై ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాలను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.

క్లుప్తంగా

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ


విచారిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): మండల కేంద్రంలో అట్రాసిటీ కేసుపై శనివారం మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి విచారించారు. రెండు రోజుల క్రితం 17న మండలంలోని రాఘవపేట గ్రామానికి చెందిన వీవోఏ అనురాధను ఐకేపీ ఏపీఎం రాజేశ్ కొంతకాలంగా ప్రతి పనికి మానసికంగా ఇబ్బంది పెడుతూ కులం పేరుతో దూషించాడని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేయడంతో అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ క్రమంలో డీఎస్పీ మల్లాపూర్ మండల కేంద్రంలో పర్యటించి ఫిర్యాదురాలితో పాటు ప్రత్యక్ష సాక్షులను విచారించారు. విచారణలో డీఎస్పీ వెంట మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ పరికరాలు చోరీ

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామంలో గోస్కుల మహేశ్‌కు చెందిన ట్రాక్టర్ సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లినట్లు రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసుల వివరాలు.. మహేశ్ తన ట్రాక్టర్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. శుక్రవారం రాత్రి దొంగలు ట్రాక్టర్ ట్రాలీ పరికరాలు, రోటవేటర్, హైడ్రాలిక్ పట్టీలను ఎత్తుకెళ్లారు. అలాగే అదే గ్రామానికి చెందిన నెరేళ్ల అంకుష్ ట్రాక్టర్ బ్యాటరీని సైతం దొంగలు అపహరించారు. మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

గీతకార్మికుడిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి


దాడిలో గాయపడిన వెంకన్న

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ ఫర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్‌లో కల్లు గీసే కత్తితో గీత కార్మికుడిపై విచక్షణ రహితంగా ఇద్దరు గుర్తుతెలియని యువకులు దాడి చేసిన ఘటన జరిగింది. పోలీసుల వివరాలు.. 14వ డివిజన్ లక్ష్మీపురంకు చెందిన కొయ్యాడ వెంకన్న వృత్తిరీత్యా శనివారం ఫర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్‌లోని అయ్యప్ప ఆలయం సమీపంలో కల్లు మండువాకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు మద్యం తాగాడానికి వచ్చారు. కల్లు మండువాలో మందు తాగరాదని వెంకన్న అనడంతో యువకులు కోపంతో వెంకన్న వద్ద ఉన్న కల్లు గీసే ఉలితో దాడి చేసి పరారయ్యారు. తీవ్ర గాయాల పాలైన వెంకన్న అరవడంతో స్థానికులు 108, పోలీసులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో ఎన్టీపీసీ ఎస్సై జీవన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాక్షస రాజ్యం పోయి.. రామరాజ్యం రావాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్


గూడెంలో మాట్లాడుతున్న బండి సంజయ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/ముస్తాబాద్(సిరిసిల్ల): రాష్ట్రంలో రాక్షస పాలన పోయి.. రామరాజ్యం రావాలని, అందుకు ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో, ముస్తాబాద్ మండలం గూడెంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలను ఆవిష్కరించి మాట్లాడారు. ధర్మం కోసం యుద్ధం చేసిన శివాజీని ఈ తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నాడు మొఘలులను తరిమేందుకు శివాజీ పనిచేశారని, నేడు ఓట్లు, సీట్ల కోసం వచ్చే ఎంఐఎం, ఇతర పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీని ఓడించడానికే బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో జత కడుతోందని ఆరోపించారు. రెండు పార్టీలు ఏకమైనా ప్రజల మద్దతుతో తాము అధికారంలోకి రావడం ఖాయమన్నారు. 24 గంటల కరెంట్ ఇస్తున్నామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఎండాకాలానికి ముందే కరెంట్ కోతలు విధిస్తూ, రైతాంగాన్ని ఆగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చీకోడు, ముస్తాబాద్‌లో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సుధాకర్‌రెడ్డి, మెంగని మహేందర్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమాల్లో సర్పంచులు సరిత, కోల అంజమ్మ, ఉపసర్పంచ్ బాలయ్య, బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు కార్తీక్‌రెడ్డి, పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, ఉపాధ్యక్షుడు శీలం రాజు, సర్పంచ్ కోల అంజమ్మ, ఉపసర్పంచ్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

హిందుత్వం గురించి మాట్లాడితే మతతత్వవాదా?

కథలాపూర్(వేములవాడ): హిందుత్వం గురించి మాట్లాడితే మతతత్వవాది అని ముద్ర వేస్తున్నారని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి బొమ్మెన, తక్కళ్లపల్లి గ్రామాల్లో ఛత్రపతి శివాజీ విగ్రహాలను ఆవిష్కరించి మాట్లాడారు. హిందూ ధర్మం కోసం మాట్లాడటం మతతత్వమైతే తాను బరాబర్ మాట్లాడుతానన్నారు. అవసరమైతే మతతత్వవాది అనే బోర్డును మెడలో వేసుకుని తిరిగేందుకైనా సిద్ధమేనని వెల్లడించారు. హిందూ ధర్మానికి మోసం చేయవద్దని, చచ్చేంత వరకు హిందువుగానే బతకాలన్నారు. మతాన్ని కించపరిచేలా వ్యవహరించవద్దని, మత మార్పిడులు సరికాదన్నారు. పిల్లలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలతోపాటు నైతిక విలువలను అలవర్చాలని కోరారు. బర్త్ డే రోజు కేక్ కట్ చేయించి, దీపాలు ఆర్పించడం మంచిది కాదని, దీపాలు వెలిగించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కంటె సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పిడుగు ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ మొలిగె లక్ష్మి, ఉపసర్పంచ్ చిందం సుధాకర్, నాయకులు శ్రీనివాస్, మారుతి, బాపురెడ్డి పాల్గొన్నారు.

శివుడినే మోసం చేసిన ఘనుడు సీఎం కేసీఆర్


ఎంపీ సంజయ్‌కుమార్‌కు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో

వేములవాడ: ఈ మూర్ఖపు సీఎం పాలన నుంచి పీడవిరగడ కావాలని, రాజన్నకు ఏటా రూ.100 కోట్లు ఇస్తానని ప్రకటించి శివుడినే మోసం చేసిన ఘనుడు కేసీఆర్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ అన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వేములవాడ రాజన్నను శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. ఈవో కృష్ణప్రసాద్ స్వామివారి ప్రసాదం అందజేసి సత్కరించారు. అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ, భక్తుల ద్వారా కోట్లాది రూపాయల ఆదాయం వస్తుంటే వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలేదన్నారు. క్యూలైన్లలో పసిపిల్లలు, శివభక్తులు అల్లాడి పోతున్నారన్నారు. పేదలంటే కేసీఆర్‌కు చులకన అయ్యిందన్నారు. కేసీఆర్ బిడ్డకు దొంగసారా, పేకాట దందాలకు వేలకోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. ఇవన్నీ దేవుడు చూస్తున్నాడని, త్వరలోనే తన పాలనకు జనం చరమగీతం పాడబోతున్నారని పేర్కొన్నారు. ప్రసాదాల స్కీమ్ కింద రాజన్న గుడిని చేర్చేందుకు పత్రం ఇమ్మంటే ఇవ్వడం లేదని, కేంద్రం నుంచి నేరుగా తాను నిధులు తీసుకొస్తానన్నారు. ఎంపీ వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఉపాధ్యక్షుడు గోపు బాలరాజు, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు తదితరులు ఉన్నారు.

పండుగపూట పాణంతీత్తివా దేవుడా..!

- ఈతచెట్టు పై నుంచి పడి గీతకార్మికుడి దుర్మరణం
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు
- పెద్దంపేటలో విషాదం


లచ్చయ్యగౌడ్ (ఫైల్)


లచ్చయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రామగుండం: 'పండుగపూట పాణం తీత్తివా దేవుడా.. అందరి ఇళ్లలో సంతోషం.. మా ఇంట్లో ఏడుపా..' అంటూ ఆ కుటుంబం రోదించడం గ్రామస్తులను కలచివేసింది. అందరి ఇళ్లలో మహాశివరాత్రి సంబురం.. ఇంటిల్లిపాది ఉదయమే స్నానాలాచరించి ఆలయాలకు వెళ్లి మమ్మల్ని చల్లగా చూడాలని ప్రత్యేక పూజలు చేసి దేవున్ని దర్శించుకుంటే.. మరికొందరు పుణ్య స్నానాలు ఆచరించేందుకు గోదావరి నదికి వెళ్తే.. ఆ ఇంట్లో మాత్రం విషాదం నెలకొంది. కులవృత్తిలో భాగంగా ఇంటి పెద్ద కల్లు గీసేందుకు వెళ్లి చెట్టుపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందగా.. విషయం తెలుసుకున్న భార్య, అతడి కూతుళ్లు పరుగున ఘటన స్థలానికి వెళ్లి.. మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదించారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామానికి చెందిన రంగు లచ్చయ్యగౌడ్(55) గీత కార్మికుడు. భార్య నర్సమ్మ, నలుగురు కూతుళ్లు ఉన్నారు. కూతుళ్లందరికీ పెళ్లిళ్లు అయ్యా యి. కాగా ఇటీవల లచ్చయ్య తన కులవృత్తిలో భాగంగా కొన్ని ఈతచెట్లకు కల్లు గీసేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఈక్రమంలో శనివారం ఉదయం కల్లు గీసేందుకు గ్రామ పరిధిలోని ఈత వనానికి వెళ్లాడు. ఈత చెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో నడుముకు కట్టుకున్న మోకు తెగిపోవడంతో కింద వెల్లకిల పడి తీవ్ర గాయాలైనాయి. తలపగిలి చెవుల నుంచి రక్తం కారి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహంపై పడి రోదించడం గ్రామస్తులను కలచివేసింది. ఈ ఘటన పండుగ పూట బాధిత కుటుంబంలో విషాదం నింపగా, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్ కేసు నమోదు చేశారు.

పరిహారం చెల్లించాలి

పెద్దంపేట గ్రామానికి చెందిన రంగు లచ్చయ్య అనే గీత కార్మికుడు ప్రమాదవశాత్తు విధి నిర్వహణలో పండుగపూట మృతిచెందడం బాధాకరమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ప్రతినిధి జూపాక శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

సాగు భూములకే రైతుబంధు ఇవ్వాలి

- బీజేపీ జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి


మాట్లాడుతున్న భాస్కరాచారి

చిగురుమామిడి(హుస్నాబాద్): మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో శనివారం ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. శక్తికేంద్రం ఇన్‌చార్జి కంది శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి బీజేపీ జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సాగుచేసే భూములకే రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగుకు యోగ్యంకాని గుట్టలు, బండలు, అటవీ ప్రాంతాలకు ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు దుడ్డెల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి శ్రీనివాస్, నాయకులు కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బోయిని ప్రశాంత్, సయ్యద్ షరీఫ్, శ్రీమూర్తి తిరుపతి, కానవేని హన్మయ్య, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యగిరీంద్రస్వామి సేవలో ఐఏఎస్ అధికారి


అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ బాధ్యులు

శంకరపట్నం(మానకొండూర్): శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి దేవాలయంలో శనివారం ఐఏఎస్ అధికారి కోరెం అశోక్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కొత్తగట్టు గ్రామానికి చెందిన అశోక్‌రెడ్డి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు శేషం మురళీధరాచార్యులు ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ మలహల్‌రావు సన్మానం చేశారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర 3వ మహాసభలు మార్చి 1,2,3వ తేదీల్లో నల్గొండ జిల్లా మిర్యాలగూడలో జరుగుతాయని విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమాసాహెబ్ పిలుపునిచ్చారు. శనివారం మంకమ్మతోటలోని సంఘ కార్యాలయంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించి మట్లాడారు. మహాసభలకు 33 జిల్లాల నుంచి వివిధ యూనివర్సిటీల గిరిజన మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు. తండాల గ్రామపంచాయతీలుగా మారడం, ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్లు కేవలం గిరిజన సంఘం పోరాట ఫలితంగానే సాధించామన్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు, బయ్యారం ఉక్కు పరిశ్రమ స్థాపనకు, గిరిజన రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేలా రానున్న కాలంలో రాష్ట్రవ్యాప్తంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బోడ మోహన్‌నాయక్, నాయకులు లక్‌పతి నాయక్, రవీందర్‌నాయక్, రాజ్‌కుమార్, రమేష్, ప్రదీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యం చూపుతున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ గ్రామ శివారులో శిథిలావస్థలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లలో బియ్యం నిల్వ ఉంచారనే సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేశారు. 30 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితుడు గన్నేరువరం మండలం ఖాసింపేట గ్రామానికి చెందిన ఆడెపు రాజ్‌కుమార్ (45) అని తేలడంతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని సిద్దిపేట, నిజామాబాద్ ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేసేందుకు నిల్వ ఉంచినట్లు నిందితుడు వెల్లడించాడు. పట్టుకున్న బియ్యాన్ని ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. టాస్క్‌ఫోర్సు ఏసీపీ జె.విజయసారథి ఆధ్వర్యంలో జరిగిన దాడిలో ఇన్‌స్పెక్టర్లు సృజన్‌రెడ్డి, ఎం.రవీందర్, ఎస్సైలు సాంబమూర్తి, రఘుపతి, నరసింహారావు, ఏఆర్ఎస్ఐ నర్సయ్య, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
FREE TRAINING

PRAISE THE LORD: పేద అమ్మాయిలకు HYD-కూకట్‌పల్లిలో ఫ్రీ-వసతితో HR+ మీడియా+ డిజి॥మా॥+ అకౌంట్స్+కంప్యూటర్‌లో 120డేస్ ట్రైనింగ్, తర్వాత వర్క్‌ఫ్రమ్ హోమ్ ఆదాయం, డిగ్రీ+ స్మార్ట్ ఫోన్ మస్ట్, ఫోన్: 9182242932. [HA-2415]

REAL ESTATE
PLOT FOR SALE

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలకి శుభవార్త: జగిత్యాల జిల్లా గర్షకుర్తి గ్రామంలో ఇంటి నిర్మాణానికి అనువైన అద్భుతమైన వెంచర్ కలదు. Ph: 9866616506 [HA-9789]

హైదరాబాద్, ఇబ్రహీంపట్నం–జనహర్ష డ్రీమ్ సిటీ– 1 & 2లోని ప్లాట్లు అమ్మబడును. మరియు కొనబడును. సంప్ర: 9247266234, 8886972345 [H-793508]

SERVICES

ఆధార్‌కార్డు, పాన్ కార్డు కలిగి స్వంత ఇల్లు ఉన్న ప్రతి ఒక్కరికి 1 లక్ష నుండి 10 లక్షల వరకు ఋణాలు ఇవ్వబడును సంప్ర: 9014653011, 9391225462 [H-793607]

TO LET

TO LET: Single Room for Office Near Shiva Theater, Jyothinagar, Karimnagar. Cont: Cell: 7569232003 [K-1219957]

మూలికావైద్యం

అంగస్తంభన లేకపోవటం, సెక్స్‌లో ఎక్కువసేపు చేయలేకపోవడం, అంగం లావుగా, దృఢంగా, బలంగా ఉండుటకు మూలికౌషధం, వయస్సు పైబడిన వారు కూడా వాడవచ్చు. డా.సి.హెచ్ రామకృష్ణ VJA. ఫోన్: 84650 56289 [V-6068]

WANTED

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586. [G-781830]

విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోస్త్ డ్రైవరు-3, హెల్పర్లు-5, జీతం: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1226251]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు, కావలెను, ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18 k ఏజెంట్స్ కమీషన్ 3k ఫోన్: 7569955551, 9848571888. [H-786836]

బ్రాహ్మణ స్త్రీలు మాత్రమే: వంట మనుషులు - 25 వేలు, ట్యూషన్‌కు - 30 వేలు, ఇంటిపనికి : 15 వేలు, సంగీతపు టీచర్ - 25 వేలు. హైదరాబాద్. ఫ్రీ భోజనం + వసతి ✆ 98662 52220 / 98492 52220 [B-331]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడు మృతి


అశోక్(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ బస్టాండ్ సమీపంలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాస్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన ముత్యాల అశోక్(26) పని నిమిత్తం తన స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై సుల్తానాబాద్ వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాస్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. దీంతో తీవ్రగాయాలైన ఇరువురిని సుల్తానాబాద్ అసుపత్రికి తీసుకవెళ్లగా, వైద్యులు పరీక్షించి అప్పటికే అశోక్ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా అశోక్ నేత్రాలను అతడి తండ్రి దానం చేశారు.

రాజన్న దర్శనానికి వెళ్తూ ఒకరు..

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం ఆరెపల్లి శివారులోని కరీంనగర్–సిరిసిల్ల రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కోనాపూర్‌కు చెందిన బెక్కం శాంతికుమార్(24) కరీంనగర్‌లో ఉంటున్నాడు. మహాశివరాత్రి సందర్భంగా వేములవాడకు బైక్‌పై స్నేహితుడు లక్ష్మణ్‌తో కలిసి బయలుదేరాడు. ఈక్రమంలో వేములవాడ మండలంలోని ఆరెపల్లి శివారుకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో శాంతికుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరు లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని కరీంనగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరికి చూపునిచ్చిన అమ్మ


పడాల లక్ష్మి(ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): ఆమె మరణించినా చూపుమాత్రం మరో ఇద్దరి దేహంలో సజీవంగానే ఉంది. నేత్రదానం చేసి ఇద్దరికి చూపునిచ్చింది ఓ అమ్మ. గోదావరిఖని మార్కండేయకాలనీకి చెందిన పడాల లక్ష్మి(70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. ఆమె నేత్రాలను దానం చేస్తే మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చని అదే కాలనీకి చెందిన భారతి అనే మహిళ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. స్పందించిన మృతురాలి కుమారుడు సాంబయ్య, కోడలు స్వరూపరాణి, మనుమడు సాయిపవన్, మనుమరాలు శివాణి ఐ బ్యాంక్‌కు నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. స్థానిక సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు రాజమౌళి, కేఎస్.వాసు, లయన్స్ క్లబ్ ప్రతినిధి బెజిగోపాల్ త్రివేది ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ ద్వారా శుక్రవారం రాత్రి సేకరించిన లక్ష్మి నేత్రాలను హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. లక్ష్మి మృతికి కార్పొరేటర్ మంచికట్ల భిక్షపతి, సదాశయ ప్రతినిధులు శ్రావణ్‌కుమార్, లింగమూర్తి, భీష్మాచారి, లయన్స్ క్లబ్ బాధ్యులు రాజేందర్, పి.మల్లికార్జున్ ప్రగాఢ సంతాపం తెలిపి నేత్రదాత కుటుంబాన్ని అభినందించారు.

పింఛన్ మార్పునకు లైన్‌క్లియర్

- వితంతువులకు 15 రోజుల్లోనే పెన్షన్
- ఆదేశాలు జారీ.. సదరు ప్రక్రియలో యంత్రాంగం
- మరి మిగతావారి మాటేమిటి..?



కరీంనగర్ అర్బన్: పింఛన్ అంటేనే పడిగాపులు.. నిరీక్షణకు మారుపేరుగా మారింది. దరఖాస్తు చేసి ఏళ్ల తరబడి వేచిచూడటం జరిగే ప్రక్రియ. సదరు జాప్యానికి చెక్ పెడుతూ నిర్ణీత వ్యవధిలో పింఛన్ మంజూరు చేసే ప్రక్రియకు సర్కార్ లైన్ క్లియర్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో అధికార యంత్రాగం సదరు పనుల్లో నిమగ్నమైంది. ఆసరా పథకం కింద పింఛన్ పొందే వృద్ధుడు మరణిస్తే అతడి భార్యకు 15 రోజుల్లో పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అర్హులైన మహిళల నుంచి కార్యదర్శులు దరఖాస్తులు స్వీకరిస్తుండగా పరిశీలన అనంతరం ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేస్తున్నారు.

పక్షం రోజుల్లో మార్పు

ఆసరా పథకం కింద పింఛన్ పొందుతూ వృద్ధుడు మరణిస్తే అతడి భార్య పేరుపై 15 రోజుల్లోనే పింఛన్ మార్పు చేయాలని ఇటీవలే ప్రభుత్వం నిర్ణయించి ఆమేరకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం సంబంధిత వృద్ధురాలు భర్త మరణ ధ్రువీకరణ పత్రం జతచేసి, దరఖాస్తులను కార్యదర్శికి అందించాలి. కార్యదర్శులు దరఖాస్తు అందిన వెంటనే పరిశీలించి ఎంపీడీఓలకు నివేదిస్తే వారు మరోసారి ధ్రువీకరించి పింఛన్ మంజూరు కోసం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. తదుపరి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పింఛన్ మంజూరు చేస్తారు.

ఆసరాతో భరోసా..

బీఆర్ఎస్ ప్రభుత్వం ఆసరా పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చింది. ప్రారంభంలో వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, చేనేత కార్మికులకు ఆసరా కింద పింఛన్ అందించింది. తర్వాత బీడీ, గీత కార్మికులను, ఒంటరి మహిళలు, ఇటీవలే 57 ఏళ్ల వారికి పింఛన్ అందిస్తూ పథకాన్ని మరింత విస్తరించింది. అయితే భర్త మరణిస్తే.. అతడి పింఛన్‌ను భార్య పేరుపైకి మార్చేందుకు ఏళ్లు పట్టేది. దీంతో వారు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడేవారు. భర్తను పోగొట్టుకొని పుట్టెడు దుఃఖంలో ఉండి, కుటుంబ పోషణకు నానా అవస్థలు పడేవారు. కాగా ప్రస్తుతం బాధితుల నుంచి కార్యదర్శులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 300లకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వివరించారు. ఇదిలా ఉండగా ఇక నుంచి ఆసరా పింఛన్ పొందుతూ మరణించిన వృద్ధుడి పేరుపై వెంటనే మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయడంతోపాటు అతడి భార్య వివరాలతో ఎంపీడీఓ కార్యాలయంలో ఆసరా దరఖాస్తులను అందించనున్నారు. ఆయా గ్రామాల్లో కార్యదర్శులు బాధితులను నెలవారీగా గుర్తించి, లబ్ధి చేకూరేలా సంబంధిత వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేయనున్నారు.

మిగతావారి మాటేమిటి

వృద్ధాప్య పింఛన్ తీసుకునేవారు వృద్ధులు మరణిస్తే వారి భార్యలకు పింఛన్ మంజూరు చేయాలని ఆదేశాలివ్వడం శుభసూచకం. కానీ ఇతర వర్గాలపై స్పష్టత లేకపోవడం ఆందోళనకు గురి చేస్తోంది. గీత, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, బోధకాలు వ్యాధిగ్రస్తులు, ఎయిడ్స్ ఇతర బాధితుల పింఛన్ల మంజూరులో నిర్ణీత వ్యవధి ఉంటే బాగుంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆయా కేటగిరీలో పింఛన్ల కోసం దరఖాస్తు చేస్తే నాలుగేళ్లకు పైగా నిరీక్షించాల్సి వచ్చిందని ఇటీవల జారీ చేసిన కొత్త పింఛన్లతో తేటతెల్లమైంది. ఈ క్రమంలో అన్ని పింఛన్లకు వేగవంతమైన చర్యలు అవసరం.

జిల్లాలో ఆసరా లబ్ధిదారుల వివరాలు..

వృద్ధాప్య	48,918
వితంతు	34,229
దివ్యాంగ	20,702
గీతకార్మిక	3,767
చేనేత	2,817
ఒంటరి మహిళలు	3,271
బీడీ కార్మికులు	9,937

పింఛన్ మార్పునకు మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు

కరీంనగర్ అర్బన్	102
కరీంనగర్ రూరల్	50
కొత్తపల్లి	23
రామడుగు	14
గంగాధర	28
చొప్పదండి	21
తిమ్మాపూర్	20
మానకొండూర్	25
శంకరపట్నం	31
హుజూరాబాద్	39
ఇల్లందకుంట	9
జమ్మికుంట	12
వీణవంక	8
చిగురుమామిడి	13
సైదాపూర్	7
గన్నేరువరం	13


నగునూరు దుర్గాభవానీ ఆలయంలోని శ్రీసుందరేశ్వర స్వామికి విశేష అలంకరణ


మహాశక్తి ఆలయంలో లింగార్చన


పాత బజార్ శివాలయంలో భక్తుల సందడి


శివుడి వేషధారణలో చిన్నారి

శంభో శివ శంభో

• శివనామస్మరణతో మారుమోగిన శైవక్షేత్రాలు • బారులు తీరిన భక్తులు

మహాశివరాత్రి వేడుకలను శనివారం కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో మారుమోగాయి. ముక్కంటిని దర్శించుకునేందుకు బారులు తీరారు. మహాశివునికి రుద్రాభిషేకాలు, ఫలరస పంచామృతాభిషేకాలు, బిల్వ దళార్చనలు, మహాభిషేకం, పుష్పాలంకరణ, మహాపూజ నిర్వహించారు. పలు ఆలయాల్లో కల్యాణవేడుకలు, హోమాలు జరిపారు. నగరంలోని పాతబజార్ శివాలయం, కమాన్‌రోడ్‌లోని రామేశ్వరాలయం, అయ్యప్ప ఆలయంలోని రాజరాజేశ్వరాలయం, భగత్‌నగర్‌లోని భవానీ శంకరాలయం, గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయ ఆలయం, ఆదర్శనగర్‌లోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం, ర్కండేయనగర్‌కాలనీలోని శివ భక్తమార్కండేయ ఆలయం, భగత్‌నగర్ రాంచంద్రాపూర్‌కాలనీలోని శివ భక్త మార్కండేయ ఆలయం, చామనపల్లి ఉమామహేశ్వర ఆలయం, మొగ్ధుంపూర్‌లోని శివాలయం, నగునూరులోని దుర్గాభవానీ ఆలయం, దుర్శేడ్‌లోని శివాలయం, ఎలగందుల భవానీ శంకరాలయం, కొత్తపల్లిలోని శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. మేయర్ సునీల్‌రావు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు మెన్నేని రోహిత్‌రావు, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ చైర్మన్ రవీందర్‌సింగ్, కరీంనగర్ ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు పూజలు చేశారు. కరీంనగర్‌లోని సిక్‌వాడికి చెందిన చిన్నారి రాచర్ల ఆర్యహి శివుని వేషధారణలో ఆకట్టుకుంది. - కరీంనగర్‌కల్చరల్/విద్యానగర్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి


భగత్‌నగర్ భవానీ శంకరాలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు


చామనపల్లి ఉమామహేశ్వర ఆలయంలో..


మొగ్ధుంపూర్ శివాలయంలో హోమం






పూజలు చేస్తున్న మేయర్ సునీల్‌రావు దంపతులు


పూజల్లో కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు


పూజలు చేస్తున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్


పూజలు చేస్తున్న రోహిత్‌రావు


రేకుర్తిలోని శ్రీఅపర్ణ అమృతేశ్వర శివాలయంలో..


కొత్తపల్లి శివాలయంలో మహారుద్రాభిషేకం


కరీంనగర్‌లోని రామేశ్వరాలయంలో బారులు తీరిన భక్తులు


రామలింగేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


నగునూరులో లింగాభిషేకం చేస్తున్న భక్తులు


సైదాపూర్ మండలం బొమ్మకల్‌లో..

క్లుప్తంగా

పండ్లు పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ బాధ్యులు

కరీంనగర్‌కల్చరల్: మహాశివరాత్రి పురస్కరించుకొని నగరంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం వాసవీ క్లబ్ కట్టరాంపూర్ ఆధ్వర్యంలో భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జైన అర్చన, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రెటరీ సూర గీత, జెడ్‌సీ కొండూరి గంగాధర్, ప్రధాన కార్యదర్శి బొడ్ల శ్రవణ్ కుమార్, కోశాధికారి జిల్లా శేఖర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జమియత్ అహలె హదీస్ కార్యవర్గం


నియమాకపత్రం అందజేస్తున్న నేమతుల్లా

కరీంనగర్‌కల్చరల్: జమియత్ అహలె హదీస్ జిల్లా కమిటీ ఎన్నికలు సుభాయి జమియత్ అహలె హదీస్ రాష్ట్ర అధ్యక్షుడు నేమతుల్లా, ప్రధాన కార్యదర్శి అబుల్ ముజాహిద్ ఇలియాస్, కోశాధికారి అబ్దుల్ ఖదీర్, సహాయ కార్యదర్శి యూసఫ్ ఖాన్ ఉమ్రి ఆధ్వర్యంలో శనివారం శాసహబ్ మొహల్లలోని మర్కజి జమియత్ అహలె హదీస్‌లో నిర్వహించారు. అధ్యక్షుడిగా సయ్యద్ హైదర్, ప్రధాన కార్యదర్శిగా మౌలానా అబ్దుల్ సమీ, కోశాధికారిగా షేఖ్ సిరాజ్ అహ్మద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ చిన్న ఇస్మాయిల్, షహెరి జమియత్ అహెలె హదీస్ అధ్యక్షుడు మౌలానా ఖాలీద్ నద్వి, కార్యదర్శి హఫీజుల్లా, కోశాధికారి షఫిక్ అహ్మద్, మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రహీం, ప్రతినిధులు అహ్మద్ ఖాన్, అబ్దుల్లా, అబూబకర్ బిన్ సయీద్, జలాల్ అబ్దుల్ ఖాలీద్, ఎండీ. ఇస్మాయిల్, నజీర్ అహ్మద్, యాఖూబ్, సయ్యద్ అబ్దుల్ కరీం, మహమ్మద్ యూసఫ్, లాల్ మహమ్మద్, అబ్దుల్ బాసిత్, అబ్దుల్ రహీం, అబ్దుల్ రౌఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోమెటిక్ స్టార్టర్లు తొలగించండి

- విద్యుత్ అధికారులకు ఆదేశాలు
- క్షేత్రస్థాయిలో ప్రచారం చేపట్టిన సిబ్బంది

కరీంనగర్‌రూరల్: వ్యవసాయ విద్యుత్ మోటార్లకు రైతులు ఏర్పాటు చేసుకున్న ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు విద్యుత్ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఆటోమెటిక్ స్టార్టర్లతో కలిగే ఇబ్బందులు, సమస్యలపై రైతులకు అవగాహన కల్పించి వాటి తొలగింపునకు చర్యలు చేపట్టారు.

విద్యుత్‌తో పాటు సాగునీరు వృథా

- కరీంనగర్‌రూరల్ డివిజన్ పరిధిలో మొత్తం 5,040 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లున్నాయి.
- దాదాపు సగానికిపైగా విద్యుత్ మోటార్లకు ఆటోమెటిక్ స్టార్టర్లున్నాయి.
- వ్యవసాయానికి ప్రభుత్వం 24గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తోంది.
- రైతుల నుంచి కస్టమర్ చార్జీల కింద నెలకు రూ.30 చొప్పున ఏడాదికి రూ.360 మాత్రమే వసూలు చేస్తోంది.
- ప్రస్తుత యాసంగి సీజన్‌లో విద్యుత్ వినియోగం భారీగా పెరగడంతో వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయడం సమస్యగా మారింది.
- ఓవర్‌లోడ్‌తో సబ్‌స్టేషన్ల వారీగా రోజుకు 8గంటల నుంచి 10గంటలవరకు మాత్రమే విద్యుత్‌ను సరఫరా చేసే పరిస్థితి నెలకొంది.
- ప్రభుత్వం ఒక యూనిట్ విద్యుత్‌ను రూ.10 నుంచి రూ.14 వెచ్చించి ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తోందని, నెలకు రూ.1,500కోట్లను ఖర్చు చేస్తుంది.
- రైతులు ఆటోమెటిక్ స్టార్టర్లను ఉపయోగించడంతో ఒకవైపు విద్యుత్ మరోవైపు నీరు వృథా అవుతున్నాయంటూ విద్యుత్ అధికారులు రైతులను చైతన్య పరుస్తున్నారు.
- ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించి సాధారణ ఆన్ ఆఫ్ స్టార్టర్లను బిగించుకోవాలని వాట్సాప్ గ్రూపుల్లో మెస్సెజ్‌లు పెట్టి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.
- అంతేకాకుండా వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లను బిగించుకోవడం ద్వారా 10శాతం నుంచి 12శాతం వరకు విద్యుత్ ఆదా అవుతుందని పేర్కొంటున్నారు.

రైతులు స్వచ్ఛందంగా తొలగించాలి

రైతులందరూ ఆటోమెటిక్ స్టార్టర్లను స్వచ్ఛందంగా తొలగించి సాధారణ స్టార్టర్లను ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. - కె.రాజు, ఏడీఈ, కరీంనగర్‌రూరల్

కొనసాగుతున్న నిరాహార దీక్ష

గంగాధర: పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని పది రోజుల క్రితం మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన నారా యణపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితులు చేపట్టిన నిరాహారదీక్ష కొనసాగుతోంది. రిజర్వాయ ర్ నిర్మాణం పరిహారం ఇంతవరకు మంజూరు చేయలేదని ఈనెల 9న నిరా హార దీక్ష ప్రారంభించారు. శనివారం శివరాత్రి రోజు సైతం చెరువు కట్ట వద్ద వేసిన టెంటు కింద పలువురు నిర్వాసితులు నిరహార దీక్షలో కూర్చున్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

మానకొండూర్‌రూరల్: భారతదేశం మహిళలకు సురక్షిత ప్రదేశమని ప్రపంచానికి తెలియపర్చడానికి మధ్యప్రదేశ్‌కు చెందిన క్రీడాకారిణి, మౌంటైనర్ ఆశామాలవియ సైకిల్‌యాత్ర చేపట్టింది. అందులో భాగంగా 110వ రోజు మండలంలోని శ్రీనివాసనగర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించింది. పాఠశాల సిబ్బంది ఆమెకు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గుజరాత్ నుంచి ప్రారంభమైన యాత్ర 250 రోజుల్లో 25వేల కి.మీ కొనసాగుతుందన్నా. ప్రతి మహిళా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, ప్రిన్సిపాల్ స్వప్న, సఖీ అడ్మిన్ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మకు నివాళి


భాగ్యరెడ్డివర్మ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

కరీంనగర్: దళిత జనోద్ధారకుడు, సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ 84వ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని మాతాశిశు ఆస్పత్రి వద్ద ఉన్న భాగ్యరెడ్డి వర్మ విగ్రహానికి దళిత మాల సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు. నేటి యువత ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొరివి వేణుగోపాల్, జనపట్ల స్వామి, మేడి మహేశ్, కాడె శంకర్, మెగురం రమేశ్, తాళ్ల వెంకటేశ్, దామెర సత్యం, కర్నె పవన్, సీహెచ్.లత, సదానందం, గంటల మహేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ

ఆటోలదే హవా..!



నగరంలో ఆటో వాలాల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. రోడ్డుపైకి వస్తే నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. అడ్డాల మీద ఉండాల్సిన ఆటోలు నడిరోడ్డుపైకి వస్తున్నాయి. బస్సులకు అడ్డంగా నిలుపుతూ ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఆటోవాలాలపై చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

రోడ్డుపై గుంతల పూడ్చివేత



చొప్పదండి: మహా శివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ దుర్గయ్య తారురోడ్డు ఏర్పడిన గుంతలను పూడ్చాడు. ఐదేళ్లుగా ఆటోలో మట్టిని తీసుకొచ్చి ఎక్కడ గుంతలు ఏర్పడినా పూడ్చుతూ పలు సన్మానాలు పొందాడు. శివకేశవాలయం వార్షిక ఉత్సవాల నేపథ్యంలో మహాశివరాత్రి నుంచి వచ్చే శుక్రవారం వరకు గుంతలను పూడ్చేందుకు నడుం బిగించగా భక్తులు అభినందిస్తున్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ అల్కాపురి ఫీడర్ పరిధిలోని అల్కాపురి, కోతిరాంపూర్, హనుమాన్‌నగర్, గణేశ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.

క్రైం కార్నర్

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

కరీంనగర్‌క్రైం: నగరంలోని మంకమ్మతోటకు చెందిన వివాహిత శ్రీవాణి శనివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనపై ఇంకా ఎవరు ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

బిల్డింగ్‌పై నుంచి పడి బాలికకు గాయాలు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక శనివారం బిల్డింగ్‌పై నుంచి పడగా గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఆ బాలికను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వివరాలు తెలియాల్సి ఉంది.

రేషన్‌బియ్యం పట్టివేత

కరీంనగర్‌క్రైం:: రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేస్తున్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌కు చెందిన ఊర శంకర్ కట్టరాంపూర్, అలుగునూర్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం రూ.10 చొప్పున 30 క్వింటాళ్లు కొని రూ.15 చొప్పున మహారాష్ట్రకు చెందిన మహేశ్‌కు అమ్మేందుకు తన ఇంట్లో నిల్వ చేయగా శనివారం వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.39,000 విలువ గల రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

మట్టిని తరలిస్తున్న లారీల అడ్డగింత


మట్టి లారీలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

గంగాధర: నారాయణపూర్ చెరువు నుంచి రేగడి మట్టిని తరలిస్తున్న లారీలను శనివారం చర్లపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. ఎటువంటి అనుమతి లేకుండా కొద్ది రోజులుగా చెరువు నుంచి ఇటుకబట్టీల నిర్వాహకులు మట్టి తరలిస్తున్నారని ఆరోపించారు. మట్టి తరలించకుండా, నారాయణపూర్ చెరువుకు నీరు పంపింగ్ చేయడానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా: 9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజురాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899

రూ.680 కోట్లతో యకహోమా విస్తరణ

- విశాఖలో మరో యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన
- ప్రత్యక్షంగా 2,000 మందికి ఉపాధి

సాక్షి, అమరావతి: జపాన్‌కు చెందిన ప్రముఖ టైర్ల తయారీ సంస్థ యకహోమా గ్రూప్ విశాఖపట్నం యూనిట్‌ను విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. సుమారు రూ.680 కోట్ల పెట్టుబడితో ప్యాసింజర్ కార్ టైర్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. ఏడాదికి దాదాపు 17 లక్షల టైర్ల తయారీ సామర్థ్యంతో దీనిని ఏర్పాటు చేయబోతోంది. 2024 చివరి త్రైమాసికానికి ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా ప్రస్తుతం 28 లక్షల టైర్లుగా ఉన్న ఏటీసీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 45 లక్షల టైర్లకు చేరుకోనుంది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న యూనిట్‌లో 22 అంగుళాల వరకు ఉండే టైర్లను ఉత్పత్తి చేస్తారు. దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తోందని, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్‌గా భారత్ అవతరించిందని.. ఇదే రకమైన వృద్ధి భవిష్యత్‌లో కూడా కొనసాగుతుందని యకహోమా అంచనా వేస్తోంది. 2007లో 7 లక్షల టైర్ల ఉత్పత్తి సామర్థ్యంతో భారత్‌లోకి అడుగుపెట్టిన యకహోమా గ్రూప్ వేగంగా విస్తరిస్తోంది. ఈ గ్రూప్‌కు భారత్‌లో ఇప్పటికే రెండు యూనిట్లు (తిరునల్వేలి, దహేజ్) ఉండగా.. మూడో యూనిట్‌ను విశాఖ సమీపంలోని అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు చేసింది.

సీఎం చేతుల మీదుగా తొలి దశ ప్రారంభం..

యకహోమా గ్రూప్ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు చేసిన అలయన్స్ టైర్స్ కంపెనీ(ఏటీసీ)ని సీఎం వైఎస్ జగన్ ఆగస్టు 16న ప్రారంభించారు. తొలి దశలో రూ.1,384 కోట్లతో హాఫ్ హైవే టైర్ల తయారీ యూనిట్‌ను ఈ సంస్థ ఏర్పాటు చేసింది. 3.7 కేజీల నుంచి 1.26 కేజీల బరువు ఉండే భారీ టైర్లను ఈ యూనిట్‌లో తయారు చేస్తోంది. ఇక్కడ తయారైన టైర్లను 120కు పైగా దేశాలకు ఎగుమతి చేయనుంది. విశాఖ యూనిట్ల ద్వారా సుమారు 2,000 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుంది.

మాజీ ఎమ్మెల్యే సర్రాజు కన్నుమూత



సాక్షి ప్రతినిధి, ఏలూరు/సాక్షి, అమరావతి: మాజీ ఎమ్మెల్యే, ఏపీ క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు (72) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం రాత్రి గుండెపోటుకు గురైన సర్రాజును భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సర్రాజు మరణం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హుటాహుటిన భీమవరంలోని ఆదర్శనగర్‌కు చేరుకుని సర్రాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

తారకరత్న కన్నుమూత



లోకేశ్ పాదయాత్రలో అస్వస్థతకు గురై కుప్పకూలిపోతున్న తారకరత్న (ఫైల్)

▶ మొదటి పేజీ తరువాయి

రక్తం గడ్డకట్టడంతో మెదడులో ఒకవైపు వాపు వచ్చినట్టు తెలిసింది. అప్పటి నుంచి బ్రెయిన్‌కు సంబంధించిన అన్ని రకాల చికిత్సలు చేస్తూ వచ్చారు. తొలుత బెంగళూరు నిమ్హాన్స్ ఆస్పత్రి నుంచి ప్రత్యేకంగా వైద్యులను పిలిపించి చికిత్స అందించగా, వారం నుంచి విదేశాల నుంచి ప్రత్యేకంగా న్యూరోసర్జన్లు, న్యూరాలజిస్టులను కూడా రప్పించి చికిత్స అందించారు. అయినప్పటికీ తారకరత్న ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి పురోగతి కనిపించలేదు. మధ్యలో పరిస్థితి కొంచెం మెరుగైందని, చికిత్సకు స్పందిస్తూ కోలుకుంటున్నారనే వార్తలు వచ్చినా, రెండు రోజులుగా పరిస్థితి మరీ క్షీణించడంతో విషమంగా మారింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బాలకృష్ణతో పాటు నందమూరి కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం ఆస్పత్రికి చేరుకున్నారు. పూర్తి సమాచారాన్ని వైద్యులు వారికి వివరించారు. ఆ తర్వాత కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు వెంటిలేటర్ తొలగించారు.

పాదయాత్ర ప్రారంభం రోజునే..

నందమూరి తారకరత్న గత నెల 27న కుప్పంలో లోకేశ్ పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు గుండెపోటుతో కుప్పకూలిపోయారు. వెంట ఉన్న నాయకులు ఆయన్ను అక్కడి నుంచి స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయనకు పల్స్ అందడం లేదని వైద్యులు తెలిపారు. అక్కడే క్రిటికల్ కేర్ వైద్యం చేశారు. అయితే తారకరత్న గుండెపోటుతో అప్పుడే ప్రాణాలొదిలినా.. లోకేశ్ పాదయాత్రను దృష్టిలో ఉంచుకుని బెంగళూరు ఆస్పత్రికి తరలించారనే ప్రచారం జరిగింది. లోకేశ్‌కు చెడ్డ పేరు రాకూడదనే ఇన్నాళ్లూ మెరుగైన వైద్యం పేరుతో కథ నడిపించారని టీడీపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎట్టకేలకు పర్వదినమైన శివరాత్రి రోజున తారకరత్న శివైక్యం చెందినట్లు ప్రకటించడం గమనార్హం.

అభిమానుల ఆందోళన

తారకరత్న మరణవార్త విన్న నందమూరి అభిమానులు నారాయణ హృదయాలయకు వందలాదిగా చేరుకున్నారు. దీంతో ఆస్పత్రి వెనుక గేటు నుంచి ఆయన పార్థివదేహాన్ని తరలించారు. తమకు చివరి చూపు కూడా దక్కకుండా అలా తీసుకెళ్లడాన్ని నిరసిస్తూ కాసేపు ఆందోళన చేపట్టారు.

ప్రముఖుల సంతాపం

సినీ నటుడు, ఎన్టీఆర్ మనవడు నందమూరి తారకరత్న మృతి పట్ల ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తారకరత్న మరణ వార్త తనకు తీవ్ర దిగ్భ్రాంతి, బాధను కలిగించిందని టీడీపీ అధినేత చంద్రబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తారకరత్నను బతికించుకునేందుకు చేసిన ప్రయత్నాలు, కుటుంబ సభ్యులు, అభిమానుల ప్రార్థనలు, అత్యంత నిపుణులైన డాక్టర్ల వైద్యం ఫలితాన్ని ఇవ్వలేదన్నారు. తారకరత్న ఆత్మకు శాంతిని చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్టు చంద్రబాబు పేర్కొన్నారు. తారకరత్న మరణంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఒకేసారి 9 సినిమాలతో రికార్డు

ఎన్టీఆర్ ఐదో కుమారుడైన నందమూరి మోహనకృష్ణ, శాంతిమోహన దంపతులకు 1983 ఫిబ్రవరి 22న హైదరాబాద్‌లో జన్మించారు తారకరత్న. ఛాయాగ్రాహకుడిగా మోహనకృష్ణకు మంచి పేరుంది. చెన్నైలో ఏడో తరగతి వరకు చదువుకున్నారు. ఆ తరువాత హైదరాబాద్‌కు మకాం మార్చిన తారకరత్న జూబ్లీహిల్స్ భారతీయ విద్యాభవన్‌లో ఉన్నత పాఠశాల చదువు పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని విజ్ఞాన్ భవన్‌లో బీటెక్ చదువుకున్నారు. మొత్తం 23 సినిమాలు, ఒక వెబ్ సిరీస్‌లో తారకరత్న నటించారు. ఆయన చిత్రరంగ ప్రవేశమే ఒక రికార్డు. 20 ఏళ్ల వయసులో ఒక హీరోగా తారకరత్న ఒకేసారి 9 సినిమాలు ప్రారంభించడం అప్పట్లో రికార్డు. 2001లో ఒకటో నంబర్ కుర్రాడు సినిమా ద్వారా తెరంగేట్రం చేశారు. అమరావతి సినిమాతో ఆయనను నంది అవార్డు వరించింది. ఆ తర్వాత పలు సినిమాల్లో కథానాయకుడు, ప్రతినాయకుడు, క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా నటించారు. 'మహాభక్త సిరియాల'లో శివ భక్తుడిగా నటించిన తారకరత్న మహాశివరాత్రి నాడు శివైక్యం పొందారు. 2012లో అలేఖ్యరెడ్డిని ప్రేమించి వివాహం చేసుకున్నారు. నందీశ్వరుడు సినిమాకు అలేఖ్యరెడ్డి కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేశారు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

'ధరణి' ఇలా దారిలోకి!

▶ మొదటి పేజీ తరువాయి

నివేదికలోని అంశాలపై దృష్టి పెట్టడం ద్వారా చాలా వరకు 'ధరణి'సమస్యలను పరిష్కరించవచ్చని చెబుతోంది.

సమస్యలపై ట్రిసా నివేదికలోని అంశాలివే...

- వారసత్వ హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్న వారం తర్వాత కూడా తహసీల్దార్/ఆపరేటర్ లాగిన్‌లకు సమాచారం రావడంలేదు. సదరు దరఖాస్తులు చేసుకున్న సమయంలోనే తహసీల్దార్/ఆపరేటర్ లాగిన్‌లలో నోటీసు వచ్చేలా ఆప్షన్ ఇవ్వాలి.
- ఒక సర్వే నంబర్‌లోని కొంతభాగం భూమిని గతంలో ఉన్న తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసి ఉంటే, ఆ భూమిని ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తే ఆ సర్వే నంబర్‌లోని అన్ని భూములకూ ప్రస్తుత తహసీల్దార్ డిజిటల్ సంతకం కనిపిస్తోంది. అలాకాకుండా ఏ తహసీల్దార్ డిజిటల్ సంతకం చేస్తే వారి సంతకమే కనిపించేలా సరిచేయాలి.
- తహసీల్దార్ లాగిన్‌లలో ప్రస్తుత పహాణీ/భూహక్కుల అంతర్గత పుస్తకం/ పాసు పుస్తకాలు కనిపించడంలేదు. దీంతో రికార్డుల పరిశీలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా భూసేకరణ ద్వారా ప్రభుత్వం తీసుకున్న భూములను పరిశీలించే క్రమంలో సమస్యలు వస్తున్నాయి. తహసీల్దార్ లాగిన్‌లో ప్రస్తుత పహాణీలు, ఆర్‌వోఆర్‌బీలు, పాసుపుస్తకాలు అందుబాటులో ఉంచాలి.
- ఉన్న భూమి కంటే ఎక్కువ, తక్కువగా రికార్డయిన వివరాలను సరిచేసే ఆప్షన్ ఇవ్వాలి.
- రిజిస్ట్రేషన్ జరిగిన డాక్యుమెంట్లకు సర్టిఫైడ్ కాపీలు తీసుకునే అవకాశం ప్రస్తుతం ధరణిలో లేదు. కానీ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాత్రం సర్టిఫైడ్ కాపీలిస్తున్నారు. వీటి కోసం ప్రజలు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నందున మీసేవ ద్వారా వాటిని తీసుకునే అవకాశం కల్పించాలి.
- ధరణి ప్రాజెక్టు అందుబాటులోకి రాకముందు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న డాక్యుమెంట్లను రద్దు చేసుకునేందుకు, వాటిల్లోని తప్పులను సరిచేసుకునేందుకు ఆప్షన్ ఇవ్వాలి.
- కొత్త రెవెన్యూ చట్టం అమల్లోకి రాకముందు తహసీల్దార్లు, ఆర్డీవోలు జారీ చేసిన ప్రొసీడింగ్ కాపీలను అమలు చేసే ప్రొవిజన్ ఇవ్వాలి.
- వివాదాల్లో ఉన్న ఇనాం భూములను ప్రాసెస్ చేసేందుకు, ఓఆర్‌సీలు జారీ చేసేందుకు ధరణిలో అవకాశం కల్పించాలి.
- రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత మ్యుటేషన్ జరిగేలోపు పట్టాదారుడు చనిపోతే ఆ పట్టాదారువారసులకు మ్యుటేషన్ చేసే అవకాశం ఇవ్వాలి.
- అసలైన పట్టాదారులను ఇబ్బంది పెట్టాలన్న ఆలోచనతో కొందరు మీసేవ కేంద్రాల ద్వారా పట్టాభూములను నాలా కోసం దరఖాస్తు చేస్తున్నారు. దీంతో అసలైన పట్టాదారులకు ఇబ్బంది అవుతోంది. అలాంటి థర్డ్ పార్టీ దరఖాస్తులను రద్దు చేసే ఆప్షన్ ఇవ్వాలి.
- సిటిజన్ పోర్టల్ ద్వారా భూముల నిర్వహణ, సేల్ సర్టిఫికెట్, ఎక్స్ఛేంజ్ డీడ్‌లు చేసుకునే అవకాశం పవర్ ఆఫ్ అటార్నీలకు ఇవ్వాలి.
- ధరణిలో తప్పుగా నమోదై, డిజిటల్ సంతకాలు కాని ఎంట్రీలను తొలగించే ఆప్షన్ ఇవ్వాలి. రిజిస్టర్డ్ డాక్యుమెంట్లలో పొరపాటున పడిన చిన్న, చిన్న తప్పులను సవరించుకునే అవకాశం కూడా ఇవ్వాలి.
- కొన్ని అసైన్డ్ భూముల రికార్డుల్లో భూమి స్వభావాన్ని పొరపాటున పట్టా అని నమోదు చేశారు. ఈ కారణంతో ఈ భూములన్నీ నిషేధిత జాబితాలో కనిపిస్తున్నాయి. ఈ రికార్డులను సరిచేసే ఆప్షన్ టీఎం-33లో కనిపించడం లేదు. దీంతో అసైన్డ్ భూములకు వారసత్వహక్కులు కూడా కల్పించలేకపోతున్నాం.
- రెండు ఖాతాలు కలిగిన రైతులు ఒక ఖాతాలో ఆధార్ నమోదు చేసుకోకపోతే మళ్లీ నమోదు చేసుకునేందుకు ధరణి పోర్టల్ అనుమతించడం లేదు. మీరు నమోదు చేసిన ఆధార్ నంబర్ ఇప్పటికే ఉందని చూపిస్తోంది. ఈ సమస్యను సవరించాలి.
- ఆర్డీవో స్థాయిలో ఇప్పటికే ప్రొసీడింగ్స్ వచ్చిన భూములకు వ్యవసాయ కేటగిరీ నుంచి నాలా కేటగిరీకి మార్చుకునే అవకాశం కల్పించాలి.
- వీలునామాలను అమలు పరిచే ఆప్షన్ ఇవ్వాలి.

ఏపీ కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్‌గా జోగినాయుడు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్‌గా సినీనటుడు ఎల్.జోగినాయుడుని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ రజత్ భార్గవ ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం డివిజన్‌లోని చెర్లోపాలెం గ్రామానికి చెందిన జోగినాయుడు చలనచిత్ర నటుడిగా 150కి పైగా చిత్రాలలో నటించారు. చిత్ర, టెలివిజన్ రంగాలలోని పలు విభాగాలలో దాదాపు 25 ఏళ్ల అనుభవం ఉంది. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. జోగినాయుడు నియామకానికి సంబంధించి ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ విజయవాడ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తదుపరి చర్యలు చేపట్టనున్నారు.


మోదీకి దేశ ప్రయోజనాల కంటే అదానీయే ముఖ్యం

మంత్రి కేటీఆర్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో ఇచ్చిన హామీని ప్రధాని నరేంద్ర మోదీ పట్టించుకోకపోవడం వెనుక అసలు కారణం ఏమిటో ఇప్పుడు తెలిసిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు పేర్కొన్నారు. ప్రధాని మోదీకి దేశ ప్రయోజనాలకంటే స్నేహితుడి ప్రయోజనాలే ఎక్కువ కావడం సిగ్గుచేటని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో బయ్యారం స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయకుండా కేంద్ర ప్రభుత్వం మాట తప్పిందని బీఆర్‌ఎస్ నేత, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన వీడియోను కేటీఆర్ రీ ట్వీట్ చేశారు. క్రిశాంక్ మంచి పరిశోధన, గొప్ప విశదీకరణ చేశారని కేటీఆర్ మెచ్చుకున్నారు. 'విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు బైలడిల్లా గనుల నుంచి బయ్యారానికి ముడి ఇనుము సరఫరా చేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. కానీ ప్రధాని మోదీ మాత్రం తెలంగాణ వినతిని పట్టించుకోకుండా బైలడిల్లా నుంచి కొరియన్ కంపెనీ పోస్కోకు ముడిఇనుమును సరఫరా చేయాలని 2018 ఏప్రిల్ 25న నిర్ణయించారు. ఈ క్రమంలో 2018 సెప్టెంబర్ 20న గుజరాత్ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ బైలడిల్లాను టేకోవర్ చేశారు. పోస్కో కంపెనీ, అదానీ కంపెనీ కలసి రూ.37,500 కోట్ల స్టీల్ ప్లాంట్ డీల్‌పై సంతకాలు చేశాయి'అని క్రిశాంక్ తన వీడియోలో పేర్కొన్నారు.

కాలుష్య రహిత ఉత్పత్తి



మొదటి చిమ్నీ



రెండో చిమ్నీ



పవర్‌ప్లాంటు

- జైపూర్ థర్మల్‌ప్లాంట్‌లో ఎఫ్‌జీడీ అమలు
- రూ.696కోట్లతో ప్రత్యేక యూనిట్ల ఏర్పాటు
- పర్యావరణ పరిరక్షణ కోసం సంస్థ నిర్ణయం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి వెలువడుతున్న వాయు కాలుష్యాన్ని మరింత తగ్గించేందుకు కంపెనీ మరో అడుగు వేసింది. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్(ఎఫ్‌జీడీ) పద్ధతిలో వాయు కాలుష్యాన్ని పూర్తిగా తగ్గించేందుకు శ్రీకారం చుట్టింది. ఇందు కోసం సంస్థ రూ.696కోట్లు ఖర్చు చేసి ప్రత్యేకంగా ఓ ప్రాజెక్టు చేపట్టింది. దీనికి సంబంధించిన టెండర్లు ఇటీవలే పూర్తయి ఓ నిర్మాణ సంస్థ పనులు కూడా మొదలుపెట్టింది. 2024జూన్ నాటికి మొదటి ఎఫ్‌జీడీ ప్లాంట్, అదే ఏడాది రెండో యూనిట్‌కు సంబంధించి నిర్మాణం మొదలుపెట్టి పూర్తి చేయనున్నారు. దీంతో స్థానిక పరిసరాలు కాలుష్యం కాకుండా ప్రభావిత ప్రాంతంలోనూ స్వచ్ఛమైన గాలి పీల్చుకునేందుకు వీలు కలుగనుంది.

కేంద్ర పర్యావరణ శాఖ ఆదేశాలతో..

దేశ వ్యాప్తంగా థర్మల్ ప్లాంట్ల నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని మరింత తగ్గించాలని 2015లో కేంద్ర పర్యావరణ అటవీశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఆదేశాల ప్రకారం ప్రస్తుతం థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేసేప్పుడు గాలిలోకి విడుదల అవుతున్న సల్ఫర్ ఆక్సైడ్‌ల శాతం ఘనపు మీటర్‌కు 2వేల మిల్లీ గ్రాములు ఉంటోంది. ఇంత మొత్తంలో వెలువడుతున్న సల్ఫర్ ఆక్సైడ్ కారణంగా పర్యావరణంలో సమస్యలు ఏర్పడుతున్నాయి. దీంతో సల్ఫర్‌ఆక్సైడ్‌ను 200 మిల్లీ గ్రాములకు తగ్గించాలని ఆదేశించారు. అలా దేశంలో అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలు తమ ప్లాంట్లకు అనుబంధంగా ఎఫ్‌జీడీ ప్రాజెక్టును ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధపడ్డాయి అలా సింగరేణి సంస్థ ముందుగా స్పందించి పర్యావరణ రక్షణ కోసం ఈ చర్యలు తీసుకుంది.

చిమ్నీ ఏర్పాటు చేసి..

థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ చేసే ప్రక్రియలో బొగ్గును మండించగా వెలువడే వాయువులో ఉన్న సల్ఫర్ అనుబంధ వాయువులను వేరు పరుస్తారు. ఇందుకోసం 150మీటర్ల ఎత్తయిన ఒక చిమ్నీని ఏర్పాటు చేస్తారు. ఈ చిమ్నీలో కింది నుంచి పైకి వచ్చే వాయువులకు, కాల్షియం కార్బోనేట్(తడి సున్నం)ను పైనుంచి బలంగా పంపిస్తారు. ఈ క్రమంలో బొగ్గు మండించిన వాయువుల్లో ఉన్న సల్ఫర్ డయాక్సైడ్‌తో పలు దశల్లో తడి సున్నంతో రసాయనిక చర్య జరుగుతుంది. ఈ ప్రక్రియలో వాయువులో ఉన్న సల్ఫర్ అనుబంధ వాయువులను తడి సున్నం పీల్చుకుంటుంది. చివరకు బయటకు విడుదలయ్యే వాయువుల్లో సల్ఫర్ అనుబంధ వాయువుల శాతం ఘనపు మీటరుకు 200మిల్లీ గ్రాములలోపే ఉంటుంది. ఈ రసానియక చర్యలో జిప్సం(కాల్షియం సల్ఫేట్) ఘన పదార్థం ఏర్పడుతుంది. అలా ఏర్పడిన జిప్సంను తిరిగి ఎరువులు, సిమెంట్, కాగితం, వస్త్ర, నిర్మాణ రంగ పరిశ్రమల్లో వాడుకోవచ్చు. అలా ఈ జిప్సంను సైతం సంస్థ అమ్మడంతోనూ ఆదాయం సమకూరనుంది.

పర్యావరణహిత ఫ్లైయాష్ నిర్వహణ

ప్లాంట్‌లో బొగ్గును మండించగా వెలువడుతున్న బూడిదను వంద శాతం గాలిలో కలవకుండా గత కొన్నేళ్లుగా చర్యలు తీసుకుంటున్నారు. బొగ్గును మండిస్తే వెలువడే వేడిని, మొదట నీటిని ఆవిరి రూపంలోకి మార్చుతునారు. ఆ శక్తితో టర్బైన్లను తిప్పుతూ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ప్రక్రియలో వెలువడే బూడిద, విష వాయువులను శుద్ధి చేస్తున్నారు. వాయువులో ఉండే బూడిదను తొలగించడానికి ఎలక్ట్రో స్టాటిక్ ప్రెసిపిటేటర్స్‌ను వినియోగించి, బూడిదను దాదాపు 100శాతం గాలిలో కలవకుండా చూస్తున్నారు. అలా సమకూరిన బూడిదను సిమెంటు, ఇటుకల నిర్మాణంలో వాడుతున్నారు. జైపూర్ ప్లాంట్ బూడిదను నూటికి నూరు శాతం తిరిగి వాడేలా చేస్తూ జాతీయస్థాయిలో 'బెస్ట్ ఫ్లైయాష్ యుటిలైజేషన్ అవార్డు'లను రెండుసార్లు అందుకున్నది తెలిసిందే.

ఎట్టకేలకు ఊరట

- పాత విధానంలోనే సంఘాలకు ఎరువులు
- బ్యాంకు పూచీకత్తుతోనే సరఫరా
- ఇక సకాలంలో అందనున్న సైనం



ఎరువులను దించుతున్న దృశ్యం

కరీంనగర్ అర్బన్: ప్రాథమిక సహకార సంఘాలకు ఎట్టకేలకు ఊరట లభించింది. పాత విధానంలోనే సంఘాలకు ఎరువులు సరఫరా చేయాలని మార్క్‌ఫెడ్ ఉత్తర్వులు జారీ చేసింది. సంఘాలకు వచ్చిన ఎరువులను విక్రయించి వచ్చిన సొమ్మును ఇతర అవసరాలకు వినియోగించడం, ప్రభుత్వానికి డబ్బులు చెల్లించకపోవడంతో ఎరువుల సరఫరాను నిలిపివేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు మంత్రి ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేయడంతో సహకార రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టికి ఇలా..

జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎరువులు సరఫరా చేయాలని నిర్ణయించినట్లు తెలంగాణ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య (మార్క్‌ఫెడ్) తాజాగా ఉత్తర్వులు జారీ చేయడం సహకార రైతులకు ఎంతో ఊరట కలిగించింది. రాష్ట్ర వ్యాప్తంగా వందల కోట్ల రూపాయలు బకాయిలు పేరుకుపోయిన నేపథ్యంలో గత ఏడాది సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. దీంతో 'క్యాష్ అండ్ క్యారీ' విధానం (నగదు చెల్లించి) ద్వారా మాత్రమే సహకార సంఘాలకు ఎరువులు సరఫరా చేయాలని గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సంఘాల్లో ఎరువులు దొరక్క అనేక మంది రైతులు అధిక ధరలకు ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేశారు. జిల్లాలో రైతుల ఇబ్బందులు గురించి నాఫ్కాబ్, కేడీసీసీబీ చైర్మన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్యని వివరించడం తాజా ఉత్తర్వులకు కారణమని సమాచారం. తమ జిల్లాలో మార్క్‌ఫెడ్‌కు ఉన్న బకాయిలు స్వల్ప మొత్తమని, అందువల్ల బ్యాంకు గ్యారంటీపై సంఘాలకు ఎరువులు సరఫరా చేయాలని డీసీవో విజ్ఞప్తి చేశారు.

మూడు విభాగాలకు ఎరువుల సరఫరా

కరీంనగర్‌లోని మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు ఎరువులను సరఫరా చేస్తారు. ఇక్కడకు వచ్చే నిల్వల్లో 40 శాతం సహకార సంఘాలకు, 40 శాతం ఆగ్రో సేవా కేంద్రాలకు, 20శాతం రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సరఫరా చేయడం పరిపాటి. సహకార సంఘాలకు ఇప్పటి వరకు డీసీసీబీ గ్యారంటీ ఇస్తోంది. దీని ద్వారా ఆయా సంఘాలు ఎరువులను తీసుకెళ్లి రైతులకు విక్రయించి తిరిగి డబ్బులు చెల్లిస్తున్నారు. గత ఏడాది ఈ విధానం నిలిచిపోవడంతో ప్రస్తుత వానాకాలం సీజన్లో ఎరువులు గురించి సహకార రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం సంస్థ ఉత్తర్వులు జారీ చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని మార్క్‌ఫెడ్ అధికారులు వివరించారు.

మార్క్‌ఫెడ్ నిర్ణయంతో ఎంతో మేలు

డీసీసీబీ ద్వారా ప్రతీ సంఘం రూ.10లక్షల వరకు బ్యాంకు గ్యారంటీ చూపిస్తే వెంటనే ఎరువులు సరఫరా చేయాలని సంస్థ ఆదేశించింది. దీనిపై తాజాగా సంస్థ తీసుకున్న నిర్ణయంతో ఇప్పుడు రైతులకు సకాలంలో ఎరువులు అందనున్నాయి. సహకార సంఘాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు నిర్ణయించిన ధరకే లభ్యమవుతాయి. నామమాత్రం కమీషన్ తీసుకుని సంఘాలు వ్యాపారం చేస్తున్నాయి. సంఘాలు సరఫరా చేయకుంటే పూర్తిగా ప్రైవేటు డీలర్లపై ఆధారపడాల్సి ఉంటుంది. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనం కలుగుతుంది. మండల కేంద్రాల్లోని ఆగ్రోస్ సేవా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కూడా అన్నదాతలకు మరింత చేరువయ్యే అవకాశముంది.

ఉమ్మడి జిల్లాలో మార్క్‌ఫెడ్ సరఫరా చేస్తున్న సంస్థలు

పీఏసీఎస్‌లు	102
ఆగ్రోస్ సేవా కేంద్రాలు	48
రైతు ఉత్పత్తిదారుల సంఘాలు	21
రైతులు	5.20 లక్షలు

ప్రస్తుతం మార్క్‌ఫెడ్ దగ్గర ఉన్న ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)

డీఏపీ	710
కాంప్లెక్స్	3,210
యూరియా	11,980

నాగోబా ఆలయంలో 'మహా' పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ప్రవచనాలు చేస్తున్న కుమ్రు శంకర్, కుమ్రు అంజనబాయి

ఇంద్రవెల్లి: మహాశివరాత్రి సందర్భంగా కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుమ్రు శంకర్, కుమ్రు అంజనబాయి, కొడప వినాయక్‌రావ్, రాంషావ్ మహరాజ్, మడావి కొండు మహరాజ్ ఆధ్వర్యంలో భక్తులకు శివలీల ప్రవచనాలు అందించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆదివారం కూడా పూజలు కొనసాగుతాయని ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, మెస్రం వంశీయులు బాదిరావ్ పటేల్, శేఖర్‌బాబు, దేవ్‌రావ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో గాడితప్పిన ప్రభుత్వ పాలన

- తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

జగిత్యాలటౌన్: రాష్ట్రంలో ప్రభుత్వ పాలన గాడితప్పిందని, కేవలం కాంట్రాక్టర్ల కోసమే అన్నట్లు పాలన సాగుతోందని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ విమర్శించారు. శనివారం జగిత్యాలలోని పెన్షనర్స్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ కోతలతో పంటలకు నీళ్లు అందక రైతులు అల్లాడుతుంటే.. సీఎం కేసీఆర్ దేశాన్ని ఉద్ధరిస్తామనడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ప్రభుత్వం డిస్కంలకు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యుత్ కొనుగోలు చేసే శక్తిలేని డిస్కంలు కోతలు విధిస్తున్నాయని అన్నారు. ముందుగా రాష్ట్రంలోని రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. రుణమాఫీతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మార్చి 10న 'తెలంగాణ బచావో' కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాన్ని రక్షించుకునేందుకు ఉద్యమకారులు అంతా కలిసి రావాలని కోరారు. దళితులకు మూడెకరాలు ఇవ్వని ప్రభుత్వం.. గ్రీన్ చాలెంజ్ పేరుతో ఒక వ్యక్తికి 1,100 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ కట్టబెట్టాలని చూడడం దారుణమని దుయ్యబట్టారు. జగిత్యాల మండలం నర్సింగాపూర్‌లో కూతుళ్లతో సహా ఆత్మహత్య చేసుకున్న జలపతిరెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశించిన అభివృద్ధి జరగడం లేదు

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రం ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని, ఇందుకు ప్రభుత్వ ప్రయత్న లోపమేనని కోదండరామ్ విమర్శించారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న అనంతరం గోదావరి నది పరిసరాలను పరిశీలించారు. తలాపున గోదావరి పారుతున్నా ధర్మపురి పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావడం దురదృష్టకరమన్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
ఆదివారం ॥ 19- 2-2023

గట్టిగా అనుకుని ఆచరణలో పెడితే చాలు తలుచుకున్న పని తప్పక సఫలం అవుతుంది అనే మాటలకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తారు బామ్మ ఊర్మిళా అషేర్. ఎనిమిది పదుల వయసుకు చేరువలో ఉండి తన పాకశాస్త్ర ప్రావీణ్యంతో లక్షలాది అభిమానులను ఘుమఘుమలతో కట్టిపడేసింది. ఆటుపోట్ల జీవనాన్ని అధిగమించి తన సత్తా చూపుతోంది.


ఊర్మిళా అషేర్

● బామ్మ వంట

గెలుపు ఘుమఘుమలు @ 78

‘‘మొన్న అప్‌లోడ్ చేసిన నా 200 వ వీడియోతో యూ ట్యూబ్ చానెల్ లక్ష మంది అభిమానులను సంపాదించింది. ఇటీవలే దేశవ్యాప్తంగా టీవీలో ప్రసారమవుతున్న ‘రసోయి షో’లో పాల్గొన్నాను. మాస్టర్ చెఫ్ ఇండియా సీజన్ 7లో పోటీదారుగా చేరడంతో మీ అందరికీ పరిచయం అయ్యాను. ఇదంతా మీ అభిమానం వల్లే కలిగింది’ అంటూ ఆనందంగా చెబుతోంది ఊర్మిళ అషేర్. ముంబైలో ఉంటున్న ఊర్మిళ అషేర్ గుజరాతీ కుటుంబీకురాలు. తన కుటుంబం ఆర్థిక కష్టాలు తీరాలంటే ఏదో ఒక సాయం చేయాలనుకుంది. అందుకు తనకు వచ్చిన పాకశాస్త్ర ప్రావీణ్యాన్ని పెట్టుబడిగా పెట్టింది. తన మనవడు హర్ష్‌తో కలిసి మూడేళ్ల క్రితం ‘గుజ్జు బెన్ న నాస్తా’ ఫుడ్ బిజినెస్ స్టార్ట్ చేసింది. ఏడాదికి రూ.45 లక్షల టర్నోవర్ సాధిస్తూ 78 ఏళ్ల వయసులోనూ ‘గ్రేట్ బామ్మ’ అనిపించుకుంటోంది.

కోల్పోనిది ధైర్యమొక్కటే..

ఊర్మిళా అషేర్‌కు పద్దెనిమిదేళ్ల వయసులో పెళ్లయ్యింది. భర్త చిరుద్యోగి. ముగ్గురు పిల్లలు. ఒక కూతురు, ఇద్దరు కొడుకులు. రెండున్నరేళ్ల వయసులో కూతురు మూడవ అంతస్తు మీద నుంచి కింద పడి మరణించింది. భర్త తెచ్చే జీతం డబ్బులతో ఇంటిని నడుపుకుంటూ వచ్చింది. పెద్ద కొడుకుకి పెళ్లి చేసింది. కరోనాకు ముందు ఇద్దరు కొడుకుల్లో ఒకరు గుండెపోటుతో, మరొకరు బ్రెయిన్ ట్యూమర్‌తో మరణించారు. ఆ తర్వాత భర్త మరణించాడు. ఈ ఎదురు దెబ్బలు ఆమెను నిత్యం గట్టిపరుస్తూనే ఉన్నాయి. ‘మరణం అనేది పరమసత్యం. దాని గురించి ఎన్ని రోజులని ఏడుస్తూ కూర్చుంటాం. నేనెప్పుడూ నా వద్ద ఉన్న శక్తితోనే ఏం చేయగలను అనేదానిపై దృష్టిపెడతాను. ఉన్న సమస్యలు చాలవన్నట్టు నాలుగేళ్ల క్రితం నా మనవడు హర్ష్ ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో పై పెదవి పూర్తిగా దెబ్బతిని, ఇంటికే పరిమితం అయ్యాడు. అతను నడుపుతున్న దుకాణాన్ని కరోనా మహమ్మారి కారణంగా మూసేశాం. దీంతో ఆర్థికంగా చాలా కష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ కష్టాలు తాత్కాలికమేనని, జీవితంపై నమ్మకం కోల్పోకూడదని తెలుసు’ అని చెప్పే ఊర్మిళ ఈ విపరిణామాలు మనవడిపైన ప్రభావం చూపకుండా ఉండేందుకు ధైర్యాన్ని ఎప్పుడూ కోల్పోకూడదని, ధైర్య స్థైర్యాలతోనే జీవితాన్ని గెలవాలని చెబుతూ ఉంటుంది. ఆమె మనో నిబ్బరం, ఆత్మవిశ్వాసాలే నేడు ఏడాదికి రూ.45 లక్షల టర్నోవర్‌కు చేరుకునేంతగా ఫుడ్ బిజినెస్‌లో ఎదిగేలా చేశాయి. కష్టం వచ్చినప్పుడు ఇంకాస్త గట్టిగా ఉండాలని తన కథనే ఉదాహరణగా ఇతరులతో పంచుకుంటోంది ఈ దాదీ.



> కష్టాలు తాత్కాలికమే. జీవితంపై నమ్మకం కోల్పోకూడదు. విపరిణామాలు మనపైన ప్రభావం చూపకుండా ఉండేందుకు ధైర్యాన్ని ఎప్పుడూ కోల్పోకూడదు. ధైర్య స్థైర్యాలతోనే జీవితాన్ని గెలవాలి.
>
> - ఊర్మిళా అషేర్

వ్యాపార విస్తరణ

కోడలు, మనవడితో ఉండే ఊర్మిళ తన చేతి రుచి గురించి చెబుతూ– ‘‘నాకు చిన్నప్పటి నుంచి వంటలు బాగా చేస్తాననే పేరుంది. మమ్మల్ని మేం బతికించుకోవడానికి ముందుగా గుజరాతీ చిరుతిళ్ల వ్యాపారాన్ని ప్రారంభించాం. ఆర్డర్లు వచ్చినదాన్ని బట్టి 20–25 రోజుల్లో 500 కిలోల పచ్చళ్లను రెడీ చేశాం. దీంతో పాటు తేప్లా, ధోక్లా, పూరన్ పోలీ.. వంటి ఇతర స్నాక్స్ కూడా అమ్మడం మొదలుపెట్టాం. డిమాండ్‌ను బట్టి పనివాళ్లను ఎక్కువ మందిని నియమించుకున్నాం. ఒక సంవత్సరం తిరిగేసరికల్లా మా జీవితాలే మారిపోయాయి. నేనిప్పుడు టెడెక్స్ స్పీకర్‌ని కూడా. నా కథలను ఇతరులతో పంచుకుంటూ, ఇతరులకు స్ఫూర్తినిచ్చే విధంగా ఉంటూ వివిధ నగరాలకూ ప్రయాణిస్తున్నాను. ఇప్పుడు మా ఆలోచన ఒక్కటే! నేను, మా మనవడు కలిసి అంతర్జాతీయ విమానాశ్రయాలలో ‘గుజ్జుబెన్ నాస్తా’ను ఏర్పాటు చేయాలని. అమెరికా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా నుండి కూడా ఆర్డర్లు తీసుకుంటున్నాం. వ్యాపారాన్ని ఇంకా విస్తరిస్తేనే కదా మరింత మందికి చేరువ అయ్యేది... మా ఊరగాయలను ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో పెట్టడానికి కావలసిన లాంఛనాలు కూడా పూర్తయ్యాయి’ అని ఉత్సాహంగా వివరించే ఊర్మిళ మాటలు నేటి యువతకూ స్ఫూర్తినిస్తాయి.



‘ఒక మహిళ చిత్రకారిణిగా ఉంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కాని టాటూ ఆర్టిస్ట్‌గా ఉంటానంటే ఆశ్చర్యంగా చూస్తారు’ అంటుంది **అర్చన భానుషాలి.** దేశంలో ఉత్తమ మహిళా టాటూ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందిన అర్చన మగవాళ్లు రాజ్యమేలే ఈ రంగంలో తన ఉనికిని సగర్వంగా చాటుతోంది.


అర్చన భానుషాలి

● ఫిమేల్ టాటూ ఆర్టిస్ట్

చెరిగిపోని పచ్చబొట్టు సంతకం

శివరాత్రి సందర్భంగా ‘శివ్ అండ్ శక్తి కాస్మిక్ డాన్స్’ అనే సబ్జెక్ట్‌ను పచ్చబొట్టుగా వేసింది అర్చన భానుషాలి. శివుడు, పార్వతి ఆనంద తాండవం చేస్తున్న ఆ పచ్చబొట్టులో జీవం ఉట్టి పడుతోంది. అర్ధనారీశ్వరుడి చిత్రం కూడా పచ్చబొట్టుగా వేస్తుందామె. ఇవే కాదు ఆమె బొమ్మల్లో మన సంస్కృతిని ప్రతిబింబించే భారతీయ పౌరాణిక, ఆధ్యాత్మిక చిహ్నాలు కనపడతాయి. శివాజీ వంటి వీరులూ, అన్నా హజారే వంటి సామాజిక ఉద్యమకారులు కూడా కనపడతారు. పచ్చబొట్టును ఒక విశృంఖల చిహ్నంగా కాకుండా వ్యక్తిత్వ ప్రకటనగా మార్చడం వల్లే అర్చనకు మంచి పేరొచ్చింది. అందుకే ఆమె ప్రస్తుతం దేశంలో ఉన్న మహిళా టాటూ ఆర్టిస్ట్‌లలో బెస్ట్ ఆర్టిస్ట్‌గా, సీనియర్ ఆర్టిస్ట్‌గా గౌరవం పొందుతోంది.





కమర్షియల్ ఆర్టిస్ట్‌గా

అర్చన కుటుంబానిది గుజరాత్ అయినా ముంబైలో స్థిరపడింది. అర్చన ఏడేళ్ల వయసు నుంచే వయసుకు మించిన పరిణితిని ప్రదర్శిస్తూ బొమ్మలు వేసేది. దాంతో ఇంట్లో ప్రోత్సహించారు. అయితే ఇంటర్ వయసు వచ్చే సరికి గుజరాతీలలో అమ్మాయిలకు పెళ్లి చేసి పంపాలనే తొందర ఉంటుంది. అందుకే తల్లిదండ్రులు పెళ్లి చేస్తామని వెంటపడితే అప్పుడే వద్దని చెప్పి ముంబై జెజె స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో మూడేళ్ల డిప్లమా చేసింది కమర్షియల్ ఆర్ట్‌లో. ఆ తర్వాత లండన్ వెళ్లి ఒక సంవత్సరం కోర్సు చదవాలని అనుకుంది. ఆ కోర్సుకు అడ్మిషన్ కోసం ప్రయత్నిస్తుండగా టీవీలో ఒక షో చూసింది. అందులో ప్రఖ్యాత అమెరికన్ టాటూ చిత్రకారిణి కేట్ వాన్ డి తన క్లయింట్లకు అద్భుతంగా టాటూలు వేయడం చూపించారు. ‘నేను పేపర్ మీద వేసేది ఈమె ఒంటి మీద వేస్తోంది. నేనెందుకు ఇలా వేయకూడదు’ అనుకుంది అర్చన. ఆమె యాత్ర మొదలైంది.



> ఈ రంగంలో మగవారు విపరీతంగా ఉన్నారు. ఆడవాళ్ల ప్రవేశం అంత సులభం కాదు. కాని నేను పంతంతో ఈ స్థాయికి వచ్చాను. మహిళలకు నేను చెప్పేది ఒక్కటే. మీకు లక్ష్యం ఉంటే సరిపోదు. దానికి తగ్గ కష్టం చాలా చేయాలి. ఇవాళ నేను ఈ రంగంలో గుర్తింపుతో పాటు ఆర్థికంగా కూడా మంచి రాబడి పొందుతున్నాను.
>
> – అర్చన

‘మా అమ్మానాన్నలు నేను టాటూ ఆర్టిస్ట్‌గా మారతానంటే కంగారు పడినా ఆ తర్వాత ప్రోత్సహించారు. దాని వల్ల టాటూ వేయడంలో కోర్సు చేశాను. నాకు బొమ్మలు వచ్చు కనుక చాలా త్వరగా పని నేర్చుకున్నాను. మేము గుజరాతీలం. ఒకరి కింద పని చేయడం కంటే సొంత బిజినెస్ ఉండటాన్నే ఇష్టపడతాం. అందుకే ‘ఏస్ టాటూజ్’ పేరుతో ముంబైలో మా నాన్న నా కోసం టాటూ స్టూడియో ఏర్పాటు చేశాడు’ అంటుంది అర్చన. అయితే అసలు ప్రోత్సాహం భర్త నిఖిల్ నుంచి, అత్తా మామల నుంచి లభించింది. ‘మా అత్తగారు నన్ను బాగా ప్రోత్సహిస్తారు. పెళ్లయ్యాక నా మొదటి పచ్చబొట్టును ఆమెకే వేశాను’ అంది అర్చన.

హెల్త్

● సెప్టిసీమియా

రక్తానికి ఇన్ఫెక్షన్..? రక్షణ ఇలా!



సాధారణంగా ఇతర అవయవాలకు వచ్చే ఇన్ఫెక్షన్ తెలుసుగానీ... రక్తానికి వచ్చే ఇన్ఫెక్షన్ గురించి పెద్దగా అవగాహన ఉండదు. ఇక్కడ ఓ కీలకం దాగి ఉంది. మిగతా అవయవాలకు ఇన్ఫెక్షన్ సోకితే... మెల్లగా పాకుతూ అంత త్వరగా ప్రమాదం రాకపోవచ్చు. కానీ రక్తానికి ఇన్ఫెక్షన్ గనక సోకితే అది అన్ని అవయవాలకూ, కణాలకూ వెళ్తూ ఆహారాన్నీ, ఆక్సిజన్‌ను తీసుకెళ్తూ వెళ్తూ ఇన్ఫెక్షన్‌ను కూడా దేహమంతటికీ వ్యాప్తి చేస్తుంది కాబట్టి ఇది కాస్త ప్రమాదకరమైన పరిస్థితి. రక్తానికి ఇన్ఫెక్షన్ కలిగించే ఈ కండిషన్‌ను ‘సెప్టిసీమియా’ అని పిలుస్తారు. దీనిపై అవగాహన కోసం ఈ కథనం.

మామూలుగా ఏదైనా భాగానికి ఇన్ఫెక్షన్, ఇన్‌ఫ్లమేషన్ వస్తే దాన్ని వాడుకగా ‘సెప్టిక్’ అయిందని అంటారు. రక్తానికి ఇన్ఫెక్షన్ వచ్చి అది దేహాన్నంతటినీ విషపూరితం చేసే కండిషన్‌ను ‘సెప్సిస్’ లేదా ‘సెప్టిసీమియా’ అంటారు. దీని గురించి కొన్ని వివరాలివి...

సెప్టిసీమియాకు కారణాలు

బ్యాక్టీరియల్, వైరల్, ఫంగల్, ఏవైనా పరాన్నజీవులతో పాటు మరికొన్ని అంశాలు కూడా సెప్టిసీమియాకు దారితీయవచ్చు. చాలాకాలంగా ఆల్కహాల్‌కు తీసుకుంటూ ఉండటం, దీర్ఘకాలంగా అదుపులేకుండా డయాబెటిస్ బారిన పడటం, తగిన పోషకాహారం తీసుకోకపోవడం, కొన్ని రకాల మందుల్ని దీర్ఘకాలికంగా వాడటం, రోగనిరోధక వ్యవస్థను మందకొడిగా చేసే ఇమ్యునోసప్రెసెంట్స్ వాడుతుండటం, కొన్ని రకాల యాంటీబయాటిక్ మందులను విచక్షణరహితంగా వాడటం సెప్టిసీమియాకు దారితీయవచ్చు.

కొన్ని ఇన్ఫెక్షన్లలో సెప్టిసీమియా ముప్పు మరీ ఎక్కువ...

- గుండెజబ్బులు వచ్చి చికిత్స పొందని సందర్భాల్లో
- ఊపిరితిత్తుల జబ్బులు వచ్చిన వాళ్లలో దాదాపు సగం మందిలో కేసుల్లో అది సెప్టిసీమియాకు దారితీయవచ్చు. ప్రధానంగా నిమోనియా వచ్చినప్పుడు ఇది మరీ ఎక్కువ.
- ఏదైనా కారణంతో పొట్ట (అబ్డామిన్)లో ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు దాదాపు మూడోవంతు కేసుల్లో అది సెప్టిసీమియాకు దారితీయవచ్చు.
- కిడ్నీ ఇన్ఫెక్షన్ వచ్చిన సందర్భాల్లో దాదాపు 11 శాతం కేసుల్లో అది సెప్టిసీమియాకు దారితీయవచ్చు. ముఖ్యంగా పైలోనెఫ్రైటిస్ అనే కిడ్నీ వ్యాధి వచ్చిన వారిలో లేదా యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ వచ్చిన వారిలో అది సెప్టిసీమియా ముప్పు తెచ్చిపెట్టవచ్చు.
- మెదడు తాలూకు ఇన్ఫెక్షన్స్ కూడా సెప్టిసీమియాగా మారవచ్చు.
- ఎముకలు, కీళ్లకు ఇన్ఫెక్షన్ సోకితే చాలా కొద్దిమందిలో (2% మందిలో) అది సెప్టిసీమియాగా మారే అవకాశముంది.

లక్షణాలు

- చలితో వచ్చే జ్వరం (ఫీవర్ విత్ చిల్స్)
- ఊపిరి అందకపోవడం (బ్రెత్‌లెస్‌నెస్)
- గుండె వేగంగా కొట్టుకోవడం (ర్యాపిడ్ హార్ట్‌బీట్)
- అయోమయం / మూర్ఛ (ఆల్టర్డ్ మెంటల్ స్టేటస్ / సీజర్స్)
- మూత్రం పరిమాణం బాగా తగ్గడం
- దేహంలోని చాలా చోట్ల నుంచి రక్తస్రావం
- పొట్టలో నొప్పి / వాంతులు / నీళ్ల విరేచనాలు
- కామెర్లు (జాండీస్).

చికిత్స

సెప్టిసీమియా రోగులను ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో ఉంచి చికిత్స చేయాల్సి ఉంటుంది. చికిత్సలో భాగంగా డాక్టర్లు ఈ కింది ప్రొసీజర్స్ చేస్తారు. ● రక్తనాళం ద్వారా ద్రవపదార్థాలు అందజేయడం (ఇంట్రావీనస్ ఫ్లుయిడ్స్) ● రక్తనాళం ద్వారా యాంటీబయాటిక్స్ (ఇంట్రావీనస్ యాంటీబయాటిక్స్) ● రక్తపోటు అకస్మాత్తుగా పెరగడాన్ని నివారించే మందులతో సపోర్ట్ ● ఆక్సిజన్ తీసుకోలేకపోతున్న రోగికి కృత్రిమ శ్వాస ఇవ్వడం. వెంటిలేటర్‌తో శ్వాస అందించడం ● కిడ్నీ రోగుల్లో డయాలసిస్ ● అవసరమైన సందర్భాల్లో రక్తమార్పిడి లేదా రక్తంలోని కొన్ని అంశాలు తగ్గితే కోల్పోయిన వాటిని తిరిగి భర్తీ చేయడం (బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ లేదా బ్లడ్ ప్రొడక్ట్స్‌ను ఎక్కించడం) ● పేషెంట్‌కు ఇవ్వాల్సిన ఆహారాన్ని కూడా రక్తనాళం ద్వారానే అందిస్తారు. (ఇంట్రావీనస్ న్యూట్రిషనల్ సపోర్ట్).


నిర్ధారణ పరీక్షలు

రక్త పరీక్ష, మూత్ర పరీక్షలతో పాటు ఎక్స్‌–రే, అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్ వంటి రేడియాలజికల్ పరీక్షలతో సెప్టిసీమియా ఉనికి, తీవ్రతను అంచనా వేయవచ్చు. ఈ పరీక్షల ఆధారంగా తర్వాత చేయాల్సిన చికిత్సనూ నిర్ణయిస్తారు.

నివారణ

బ్యాక్టీరియా, వైరల్, ఫంగల్ వంటి సూక్ష్మజీవుల బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవడం ద్వారా చాలావరకు సెప్టిసీమియా నుంచి రక్షించుకోవచ్చు. మనం తీసుకునే ఆహారం, తాగేనీరు, పీల్చే గాలి కూడా పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్త పడాలి. అలాగే మరికొన్ని అంశాలూ సెప్సిస్ నుంచి కాపాడతాయి. అవి...

- ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలి.
- నీటిని కాచి, చల్లార్చి లేదా ఫిల్టర్ అయిన నీటినే తాగాలి.
- వంటకాల్ని వేడివేడిగా ఉండగానే తినేయాలి. బయటి ఫుడ్‌కు (వీలైనంతవరకు) దూరంగా ఉండాలి.
- కూరగాయలను, ఆకుకూరలను శుభ్రంగా కడిగాకే వంటకు ఉపక్రమించాలి. తొక్క ఒలిచి తినే పండ్లు మినహా మిగతా వాటిని కడిగే తినాలి.
- తినడానికి ముందుగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
- మల, మూత్ర విసర్జన తర్వాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.
- గాయాలను, పుండ్లను నేరుగా చేతితో ముట్టుకోకూడదు. వాటిని ముట్టుకోవాల్సి వస్తే చేతులకు గ్లౌవ్స్ వేసుకొని, సేవలందించాలి.
- తుమ్ముతూ, దగ్గుతూ ఉండేవారి నుంచి, ముక్కు నుంచి స్రావాలు వస్తున్నవారి నుంచి, జ్వరంతో బాధపడుతున్నవారి నుంచి దూరంగా ఉండాలి. వాళ్లతో మాట్లాడాల్సి వస్తే ఫేస్‌మాస్క్ ధరించాలి.
- చెప్పులు, బూట్లు వంటి పాదరక్షల్ని బయటే విడవాలి.
- పొగతాగడం, మద్యం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి.
- డయాబెటిస్ అదుపులో ఉంచుకోవాలి. డాక్టర్ల సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వాడకూడదు.


డాక్టర్ ఆరతి బెల్లారి
సీనియర్ ఫిజీషియన్

ఫంగల్ వ్యాధుల్ని నివారించే తెల్లముల్లంగి!

హెల్త్ టిప్



తరచూ ఫంగల్ ఇన్ఫెక్షన్స్ వస్తున్నాయా? ఆలస్యం వద్దు తెల్లముల్లంగితో వండిన పదార్థాలు ఎక్కువగా తింటూ ఉంటే... ఫంగల్ ఇన్ఫెక్షన్లు త్వరగా తగ్గుతాయి. అంతేకాదు తేలిగ్గా నివారితమవుతాయి. దీనికి ఓ కారణం ఉంది. రెఫానస్ సెటైవస్ యాంటీఫంగల్ పెప్టైడ్–2 (సంక్షిప్తంగా ఆర్‌ఎస్ఏఎఫ్‌పీ–2) అనే ఓ ప్రొటీన్ కారణంగా తెల్లముల్లంగి ఫంగల్ వ్యాధుల్ని తేలిగ్గా నివారించగలుగుతుంది.

అంతేకాదు... ఇది మంచి డీ–టాక్సిఫైయర్ కావడంతో దేహంలో పేరుకుపోయిన విషపదార్థాలను బయటకు పంపుతుంది. తద్వారా కాలేయం ఆరోగ్యం చాలా బాగా మెరుగుపడుతుంది. కామెర్లతో బాధపడిన వాళ్లలో ఎర్ర రక్తకణాలు నాశనం కాకుండా కాపాడుతుంది. వాటిని కాపాడటమంటే పోషకాలు, ఆక్సిజన్ అందేలా చూసి ప్రతి కణాన్నీ కాపాడినట్టే. మామూలుగానైతే డయాబెటిస్‌తో బాధపడేవారు దుంపకూరల్ని తినకూడదంటారు. కానీ ముల్లంగిలోని పీచు చక్కెరను చాలా నెమ్మదిగా వెలువడేలా చేస్తుంది కాబట్టి ఇది డయాబెటిస్ ఉన్నవారికీ మేలు చేసే దుంపగా పేరుతెచ్చుకుంది.

కార్డియోమయోపతి!

లక్షణాలు కనపడకుండానే గుండెజబ్బు రావచ్చా?

కార్డియోమయోపతీ అనేది గుండె కండరాలకు సంబంధించిన వ్యాధి. మొదట్లో చాలామందిలో దీనికి సంబంధించి ఎలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. అందుకే చాలామందిలో ఇది ఆలస్యంగా బయటపడటం, కొందరిలో ప్రమాదకరమైన పరిస్థితికి తీసుకోవడం కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో కొన్ని కుటుంబాల్లో ఇది వంశపారపర్యంగా కనిపించవచ్చు. గుర్తించడం, చికిత్స అందించడంలో ఆలస్యం జరిగితే ప్రమాదకరంగా కూడా మారవచ్చు.

లక్షణాలు: ఈ వ్యాధి చాలా నెమ్మదిగా ముదురుతూ పోవడం వల్ల మొదట్లో లక్షణాలు కనిపించవు. అటు తర్వాత కూడా క్రమక్రమంగా లక్షణాలు బయటపడుతుంటాయి. కానీ ఇంకొందరిలో మాత్రం సమస్య నిర్ధారణకు ముందునుంచే లక్షణాలు వ్యక్తమవుతుంటాయి.


● శ్వాస తీసుకోవడం కష్టం ఉండటం, తరచూ శ్వాస అందక విపరీతమైన ఆయాసం వస్తుండటం ● విపరీతమైన అలసట, ● పొట్ట – చీలమండ వాపు, కొంతమందిలో కాళ్లవాపు ● అరుదుగా ఒక్కోసారి స్పృహ తప్పవచ్చు.

రకాలు : కార్డియోమయోపతిలో ప్రధానంగా మూడు రకాలు ఉంటాయి. అవి డయలేటెడ్ కార్డియోమయోపతి, హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతి, రెస్ట్రిక్టెడ్ కార్డియోమయోపతి.

వంశపారంపర్యంగా వచ్చే హైపర్‌ట్రోఫిక్ రకంలో గుండెకండరాలు, గుండెగోడలు మందంగా తయారవుతాయి. పైగా హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతిలో గుండె కండరాలు, గోడలు మందంగా మారడమన్నది రోగులందరిలోనూ ఒకేలా ఉండదు. ఈ తరహా కేసులు మొత్తం కార్డియోమయోపతిలో నాలుగు శాతం వరకు ఉంటాయి.

వంశపారంపర్యంగానే వచ్చే మరో రకమైన రెస్ట్రిక్టివ్ రకంలో గుండెగదుల్లో రక్తం భర్తీ అయ్యేందుకు అవసరమైన ఒత్తిడికి సంబంధించిన లోటు ఏర్పడుతుంది. ఈ తరహా కార్డియోమయోపతి కేసులు 1 శాతం ఉంటాయి.

కారణాలు: ● మద్యం అలవాటు ● వైరల్ ఇన్ఫెక్షన్‌లు ● నియంత్రణలో లేని అధిక రక్తపోటు (హైబీపీ), ● గుండె కవాటాలకు సంబంధించిన సమస్యలు దీనికి కారణమవుతాయి. అయితే అనువంశీకంగా (వంశపారంపర్యంగా) కొన్ని కుటుంబాల్లో కనిపించే కార్డియోమయోపతికి మాత్రం జన్యువుల్లో మార్పు (మ్యుటేషన్)లే కారణం. అలాంటప్పుడు తల్లిదండ్రుల్లో ఒకరికి డయలేటెడ్ కార్డియోమయోపతి ఉన్నట్లయితే పిల్లల్లో సగం మందికి ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఉంటాయి.



చికిత్స ఎలాగంటే...

● కార్డియోమయోపతి కారణంగా గుండె కొట్టుకోవడంలో తీవ్రమైన హెచ్చుతగ్గులు, ఛాతీలో నొప్పి, రక్తం గడ్డకట్టడం వంటి మరికొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉండవచ్చు. అందుకే నిర్దిష్టంగా కాకుండా... పరిస్థితి తీవ్రత ఆధారంగా చికిత్స అందిస్తారు. గుండె ఏ మేరకు నష్టపోయింది, ఎలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయన్న అంశాల ఆధారంగా డాక్టర్లు చికిత్సను నిర్ణయిస్తారు. ● అధిక రక్తపోటు, గుండె స్పందనల్లో విపరీతమైన హెచ్చుతగ్గులను మందులతో అదుపు చేస్తారు. ● గుండెకొట్టుకోవడంలో అసాధారణ మార్పులను అదుపుచేయడానికి అవసరమైతే పేస్‌మేకర్ అమర్చుతారు. దాన్ని అమర్చడం ద్వారా గుండెస్పందనలు సజావుగా, లయబద్ధంగా జరిగేలా చూస్తారు. గుండెకొట్టుకోవడంలో ఇంకా ఏవైనా లోటుపాట్లు ప్రాణానికి ప్రమాదం తెచ్చేలా ఉంటే... వాటిని సరిచేసి ప్రాణాల్ని కాపాడటం కోసం ఐసీడీ పరికరాన్ని అమర్చుతారు. ● హైపోట్రోఫిక్, రెస్ట్రిక్టివ్ రకాల కార్డియోమయోపతిలో... అది ఏ రకమైనప్పటికీ చికిత్సలో ప్రధానంగా వ్యాధిలక్షణాలను అదుపు చేయడం, పేషెంట్ పరిస్థితి విషమించకుండా చూడటమే ప్రధానం.


డాక్టర్ హేమంత్ కౌకుంట్ల
సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్

స్పోర్ట్స్



ఆర్‌సీబీ కెప్టెన్‌గా స్మృతి మంధాన

వచ్చే నెలలో ముంబైలో జరిగే మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో పాల్గొనే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు కెప్టెన్‌గా స్మృతి మంధానను నియమించారు. భారత జట్టు వైస్ కెప్టెన్ అయిన స్మృతిపై ఇటీవల జరిగిన వేలం కార్యక్రమంలో ఆర్‌సీబీ రూ. 3 కోట్ల 40 లక్షలు వెచ్చించి జట్టులోకి తీసుకుంది. స్మృతికి ఆర్‌సీబీ నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు పురుషుల ఐపీఎల్ టోర్నీలో ఆర్‌సీబీ కెప్టెన్‌గా ఉన్న డు ప్లెసిస్, మాజీ సారథి విరాట్ కోహ్లి ట్విటర్‌లో ప్రకటించడం విశేషం.

ఫైనల్లో బోపన్న జోడీ

ఏబీఎన్ ఆమ్రో ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. నెదర్లాండ్స్‌లోని రోటర్‌డామ్‌లో శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-4, 6-4తో కెవిన్ క్రాయిట్జ్-టిమ్ పుయిట్జ్ (జర్మనీ) ద్వయంపై గెలుపొందింది. 67 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ ఐదు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు.



మలుపు ఎటువైపు?

- స్పిన్‌తో ఆస్ట్రేలియా ఎదురుదాడి
- భారత్ 262 ఆలౌట్
- ఆదుకున్న అక్షర్ పటేల్, అశ్విన్
- ఆసీస్ 61/1
- రసవత్తరంగా రెండో టెస్టు

మనం నమ్ముకున్న 'స్పిన్' మంత్రం మనకే బెడిసి కొట్టింది. రెండో రోజు ఆటలో భారత్ తొలి ఇన్నింగ్స్‌ను కూల్చేసింది. ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు పరుగు ముందే టీమిండియా ఆలౌటైంది. అక్షర్ పటేల్, అశ్విన్ ఆదుకోకుంటే మాత్రం పరిస్థితి ఇంకాస్త క్లిష్టంగా ఉండేది. టాపార్డర్ నుంచి మిడిలార్డర్ దాకా ప్రధాన బ్యాటర్లను లయన్ తిప్పేస్తుంటే ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ ఆపద్బాంధవుడి పాత్ర పోషించాడు.


అక్షర్ పటేల్


లయన్

న్యూఢిల్లీ: ఎవరి ఊహకు అందనంతగా స్పిన్ తిరుగుతోంది. మ్యాచ్ అనూహ్య మలుపులు తిరుగుతోంది. రెండు రోజుల్లోనే 21 వికెట్లు కూలాయి. ఇందులో 16 వికెట్లు స్పిన్నర్లవే! ప్రత్యేకించి రెండో రోజు ఆటలో పడిన 11 వికెట్లలో 10 వికెట్లు స్పిన్నర్లే పడేశారు. దీంతో ఢిల్లీ టెస్టు రసవత్తరంగా మారింది. మిగిలిన మూడు రోజుల ఆటలో గెలుపు ఎటు మళ్లుతుందో చెప్పలేని స్థితి! టీమిండియాకు ఎదురులేని ఢిల్లీ కోటలో ఆస్ట్రేలియా 'స్పిన్'తో ప్రతిదాడి చేసింది. దీంతో రెండో రోజు ఆటలో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 83.3 ఓవర్లలో 262 పరుగుల వద్ద ఆలౌటైంది. లోయర్ ఆర్డర్‌లో అక్షర్ పటేల్ (115 బంతుల్లో 74; 9 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీతో ఆదుకున్నాడు. ఆసీస్ స్పిన్నర్లలో లయన్ (5/67) చెలరేగాడు. కున్‌మన్, మర్ఫీలకు రెండేసి వికెట్లు దక్కాయి. తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో వికెట్ కోల్పోయి 61 పరుగులు చేసింది.

లయన్ ఉచ్చులో...

ఓవర్‌నైట్ స్కోరు 21/0తో శనివారం ఆట కొనసాగించిన భారత్ 7 ఓవర్లపాటు బాగానే ఆడింది. కున్‌మన్ బౌలింగ్‌లో కేఎల్ రాహుల్ లాంగాన్‌లో భారీ సిక్సర్ బాదాడు. ఇక ఓపెనర్లు కుదురుకున్నట్లే అనుకుంటున్న తరుణంలో లయన్ బౌలింగ్‌కు దిగాడు. తన రెండు వరుస ఓవర్లలో టాపార్డర్‌ను ఎల్బీడబ్ల్యూగా దెబ్బ మీద దెబ్బ తీశాడు. ముందుగా రాహుల్ (17; 1 సిక్స్)ను బోల్తా కొట్టించిన లయన్ తన మరుసటి ఓవర్లో కెప్టెన్ రోహిత్ శర్మ (32; 2 ఫోర్లు), 100వ టెస్టు ఆడుతున్న పుజారా (0)లను పెవిలియన్ చేర్చాడు. ఇంకో ఓవర్లో అయ్యర్ (4) ఆట ముగించడంతో భారత్ 66 పరుగులకే 4 ప్రధాన వికెట్లను కోల్పోయింది. కోహ్లి క్రీజులో ఉండటమే జట్టుకు కాస్త ఊరట కాగా 88/4 స్కోరు వద్ద తొలి సెషన్ ముగిసింది.

అక్షర్ వీరోచితం

లంచ్ తర్వాత కోహ్లి, జడేజా జాగ్రత్తగా ఆడటంతో భారత్ వంద పరుగులు పూర్తి చేసుకుంది. అనంతరం స్పిన్నర్లు మర్ఫీ, కున్‌మన్ కలిసి భారత్‌ను పెద్ద దెబ్బే కొట్టారు. జడేజా (26; 4 ఫోర్లు)ను మర్ఫీ, కోహ్లి (44; 4 ఫోర్లు)ని కున్‌మన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నారు. శ్రీకర్ భరత్ (6) లయన్ ఉచ్చులో చిక్కాడు. 139/7 స్కోరు వద్ద భారత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే అశ్విన్ (37; 5 ఫోర్లు) అండతో అక్షర్ జట్టును ఒడ్డున పడేశాడు. అక్షర్ 94 బంతుల్లో (6 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధసెంచరీ సాధించాడు. దీంతో టీమిండియా... ఆసీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరు దాకా వెళ్లగలిగింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 263; **భారత్ తొలి ఇన్నింగ్స్:** రోహిత్ శర్మ (బి) లయన్ 32; రాహుల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లయన్ 17; పుజారా (ఎల్బీడబ్ల్యూ) (బి) లయన్ 0; కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) కున్‌మన్ 44; అయ్యర్ (సి) హ్యాండ్స్‌కాంబ్ (బి) లయన్ 4; జడేజా (ఎల్బీడబ్ల్యూ) (బి) మర్ఫీ 26; శ్రీకర్ భరత్ (సి) స్మిత్ (బి) లయన్ 6; అక్షర్ (సి) కమిన్స్ (బి) మర్ఫీ 74; అశ్విన్ (సి) రెన్‌షా (బి) కమిన్స్ 37; షమీ (బి) కున్‌మన్ 2; సిరాజ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (83.3 ఓవర్లలో ఆలౌట్) 262. వికెట్ల పతనం:** 1-46, 2-53, 3-54, 4-66, 5-125, 6-135, 7-139, 8-253, 9-259, 10-262. **బౌలింగ్:** కమిన్స్ 13-2-41-1, కున్‌మన్ 21.3-4-72-2, లయన్ 29-5-67-5, మర్ఫీ 18-2-53-2, హెడ్ 2-0-10-0.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఖాజా (సి) అయ్యర్ (బి) జడేజా 6; హెడ్ (బ్యాటింగ్) 39; లబుషేన్ బ్యాటింగ్ 16; **మొత్తం (12 ఓవర్లలో వికెట్ నష్టానికి) 61. వికెట్ల పతనం:** 1-23. **బౌలింగ్:** అశ్విన్ 6-1-26-0, షమీ 2-0-10-0, జడేజా 3-0-23-1, అక్షర్ 1-0-2-0.

వార్నర్ కన్‌కషన్

ఆసీస్ స్టార్ ఓపెనర్ వార్నర్ రెండో టెస్టు మిగతా ఆటకు దూరమయ్యాడు. తొలిరోజు ఆటలోనే సిరాజ్ పదో ఓవర్లో వార్నర్ మోచేతికి గాయమైంది. కాసేపు ఫిజియో సేవలతో బ్యాటింగ్ చేశాడు. అయితే గాయం తీవ్రత దృష్ట్యా టెస్టు నుంచి తప్పుకోగా... కన్‌కషన్ (ఆటలో గాయమైతేనే) సబ్‌స్టిట్యూట్‌గా రెన్‌షాను తీసుకున్నారు. మూడో టెస్టుకల్లా వార్నర్ కోలుకునేది అనుమానంగానే ఉంది.

భారత్‌కు కాంస్యం



దుబాయ్: ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు కాంస్య పతకం లభించింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 2-3తో చైనా చేతిలో పోరాడి ఓడిపోయింది. భారత స్టార్స్ ప్రణయ్, పీవీ సింధు తమకంటే తక్కువ ర్యాంక్ ఉన్న ప్లేయర్ల చేతిలో ఓడిపోవడం భారత్‌ను దెబ్బ తీసింది. తొలి మ్యాచ్‌లో 9వ ర్యాంకర్ ప్రణయ్ 13-21, 15-21తో 121వ ర్యాంకర్ లె లాన్ జీ (చైనా) చేతిలో... రెండో మ్యాచ్‌లో 9వ ర్యాంకర్ పీవీ సింధు 9-21, 21-16, 18-21తో 101వ ర్యాంకర్ గావో ఫాంగ్ జీ (చైనా) చేతిలో ఓడిపోవడంతో భారత్ 0-2తో వెనుబడింది. అయితే మూడో మ్యాచ్‌లో ధ్రువ్ కపిల-చిరాగ్ శెట్టి జోడీ 21-19, 21-19తో హి జి టింగ్-జౌ హావో డాంగ్ ద్వయంపై... నాలుగో మ్యాచ్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ 21-18, 13-21, 21-19తో లియు షెంగ్ షు-తాన్ నింగ్ ద్వయంపై నెగ్గడంతో స్కోరు 2-2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో ఇషాన్-తనీషా ద్వయం 17-21, 13-21తో జియాన్ జాంగ్ బాంగ్-వె యా జిన్ జోడీ చేతిలో ఓడిపోవడంతో భారత్ కాంస్యంతో సంతృప్తి పడింది.

హైదరాబాద్ ఎఫ్‌సీ ఓటమి

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) టోర్నీలో ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్న డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు అనూహ్య ఓటమి ఎదురైంది. జంషెడ్‌పూర్ ఎఫ్‌సీతో శనివారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 2-3 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. జంషెడ్‌పూర్ తరఫున రిత్విక్ దాస్ (22వ ని.లో), జే ఇమ్మాన్యుయెల్ థామస్ (27వ ని.లో), డానియల్ చుక్వు (29వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... హైదరాబాద్ తరఫున ఒగ్‌బెచె (12వ, 79వ ని.లో) రెండు గోల్స్ సాధించాడు.

బ్లాక్‌హాక్స్ విజయం

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టు మూడో విజయం నమోదు చేసింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ 10-15, 15-14, 15-9, 12-15, 15-11తో చెన్నై బ్లిట్జ్ జట్టును ఓడించింది.

రేణుక, స్మృతి మెరుపులు వృథా

- ఇంగ్లండ్ చేతిలో భారత్ పరాజయం
- రేపు ఐర్లాండ్‌తో చివరి మ్యాచ్


స్మృతి


రేణుక

కెబేహ (దక్షిణాఫ్రికా): మహిళల టి20 ప్రపంచకప్‌లో భారత జోరుకు ఇంగ్లండ్ బ్రేకులేసింది. గ్రూప్-2లో శనివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన 11 పరుగుల తేడాతో ఓడింది. ఇంగ్లండ్ ఈ మెగా టోర్నీలో 'హ్యాట్రిక్' విజయాలతో సెమీస్ బెర్త్‌ను దాదాపు ఖాయం చేసుకుంది. ముందుగా ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 151 పరుగులు చేసింది. రేణుకా సింగ్ (4-0-15-5) అద్భుతమైన బౌలింగ్‌తో టాపార్డర్ బ్యాటర్లు సోఫియా (10), వ్యాట్ (0), అలైస్ క్యాప్సీ (2)లను బెంబేలెత్తించింది. సీవర్ బ్రంట్ (42 బంతుల్లో 50; 5 ఫోర్లు), ఆఖర్లో అమీ జోన్స్ (27 బంతుల్లో 40; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించడంతో ఇంగ్లండ్ పోరాడే లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 140 పరుగులే చేసింది. ఆరంభంలో ఓపెనర్ స్మృతి మంధాన (41 బంతుల్లో 52; 7 ఫోర్లు, 1 సిక్స్), ఆఖరిదాకా రిచా ఘోష్ (34 బంతుల్లో 47 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడారు. కానీ మిగతా బ్యాటర్లు షఫాలీ (8), జెమీమా (13), హర్మన్‌ప్రీత్ (4), దీప్తి శర్మ (7)ల వైఫల్యంతో జట్టు ఓడింది. నేడు వెస్టిండీస్ చేతిలో పాకిస్తాన్ ఓడిపోయి... రేపు ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై గెలిస్తేనే భారత్ ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా సెమీస్ చేరుతుంది. వెస్టిండీస్, ఇంగ్లండ్ జట్లపై పాక్ గెలిచి... ఐర్లాండ్‌ను భారత్ కూడా ఓడిస్తే... భారత్, ఇంగ్లండ్, పాక్ ఆరు పాయింట్లతో సమఉజ్జీగా నిలుస్తాయి. మెరుగైన రన్‌రేట్ ఉన్న రెండు జట్లు సెమీస్ చేరుకుంటాయి.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సోఫియా (బి) రేణుక 10; వ్యాట్ (సి) రిచా (బి) రేణుక 0; అలైస్ (బి) రేణుక 3; సీవర్ బ్రంట్ (సి) స్మృతి (బి) దీప్తి 50; హీథెర్ (సి) షఫాలీ (బి) శిఖా 28; అమీ జోన్స్ (సి) రిచా (బి) రేణుక 40; ఎకిల్‌స్టోన్ (నాటౌట్) 11; కేథరిన్ (సి) రాధ (బి) రేణుక 0; సారా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 151. వికెట్ల పతనం:** 1-1, 2-10, 3-29, 4-80, 5-120, 6-147, 7-147. **బౌలింగ్:** రేణుక సింగ్ ఠాకూర్ 4-0-15-5, శిఖా పాండే 4-0-20-1, పూజ వస్త్రకర్ 2-0-24-0, దీప్తి శర్మ 4-0-37-1, రాజేశ్వరి గైక్వాడ్ 1-0-12-0, షఫాలీ 1-0-11-0, రాధ 4-0- 27-0. **భారత్ ఇన్నింగ్స్:** స్మృతి (సి) సీవర్ (బి) సారా 52; షఫాలీ (సి) బ్రంట్ (బి) బెల్ 8, జెమీమా (సి) బ్రంట్ (బి) సారా 13; హర్మన్‌ప్రీత్ (సి) అలైస్ (బి) ఎకిల్‌స్టోన్ 4; రిచా (నాటౌట్) 47; దీప్తి (రనౌట్) 7; పూజ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 140. వికెట్ల పతనం:** 1-29, 2-57, 3-62, 4-105, 5-119. **బౌలింగ్:** కేథరిన్ 3-0-39-0, బెల్ 4-0-22-1, చార్లీ 3-0-23-0, ఎకిల్‌స్టోన్ 4-0-14-1, సారా 4-0-27-2, బ్రంట్ 2-0-15-0.

పట్టు బిగించిన సౌరాష్ట్ర

కోల్‌కతా: బెంగాల్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌పై సౌరాష్ట్ర పట్టు బిగించింది. 230 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బెంగాల్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లకు 169 పరుగులు చేసింది. బెంగాల్ మరో 61 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 404 పరుగుల వద్ద ఆలౌటైంది.

విజయం దిశగా ఇంగ్లండ్

మౌంట్ మాంగనుయ్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ విజయం దిశగా సాగుతోంది. 394 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 63 పరుగులు చేసింది. న్యూజిలాండ్ గెలవాలంటే మరో 331 పరుగులు చేయాలి. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 374 పరుగులకు ఆలౌటైంది.

సినిమా



మహా జోరు

మహా శివరాత్రి సందర్భంగా టాలీవుడ్ జోరుగా హుషారుగా మహా అప్‌డేట్స్ ఇచ్చింది. ఆ విశేషాలు తెలుసుకుందాం...

వెండితెర భోళా శంకరుడిగా దుష్టులపై శివతాండవం చేస్తున్నారు చిరంజీవి. మెహర్ రమేష్ దర్శకత్వంలో చిరంజీవి టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవికి జోడీగా తమన్నా, ఆయనకు చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటిస్తున్నారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కాగా శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 'భోళా శంకర్'లోని చిరంజీవి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రానికి మణిశర్మ సంగీతదర్శకుడు. ఏప్రిల్ 14న 'భోళా శంకర్'ని విడుదల చేయాలనుకుంటున్నారు. మరోవైపు పండగ రోజున 'నేను ప్యార్‌లోన పాగలే..' అంటూ 'రావణాసుర' చిత్రం కోసం పాట పాడారు రవితేజ. పబ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ పాటకు కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించగా, స్వయంగా రవితేజ పాడటం విశేషం. సుధీర్ వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్ డైరెక్టర్. అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజిత పొన్నాడ హీరోయిన్లుగా, హీరో సుశాంత్ కీ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఇక సంక్రాంతికి థియేటర్స్‌లోకి వస్తానన్న విషయాన్ని శివరాత్రి రోజున వెల్లడించారు ప్రభాస్. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'ప్రాజెక్ట్ కె' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. దీపికా పదుకోన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, దిశా పటానీ కీ రోల్స్ చేస్తున్నారు. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదల చేయనున్నట్లు శనివారం ప్రకటించారు. అలాగే శివరాత్రి రోజునే 'రామబాణం' ఫస్ట్ లుక్‌ను వదిలారు గోపీచంద్. 'లక్ష్యం', 'లౌక్యం' చిత్రాల తర్వాత మూడోసారి హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీవాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'రామబాణం'. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్న ఈ చిత్రంలో డింపుల్ హయతి హీరోయిన్‌గా నటిస్తుండగా, జగపతిబాబు, ఖుష్బూ కీ రోల్స్ చేస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో రిలీజ్ కానుంది. ఇక త్వరలోనే మ్యూజిక్ బ్లాస్ట్ ఉంటుందంటున్నారు 'ఏజెంట్'. అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'ఏజెంట్'. సాక్షి వైద్య హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ ప్రముఖ హీరో మమ్ముట్టి ఓ కీ రోల్ చేస్తున్నారు. కాగా 'ఏజెంట్' ఆడియోను త్వరలోనే విడుదల చేయనున్నట్లు శనివారం ప్రకటించారు మేకర్స్. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, సురేందర్ 2 సినిమాస్ పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి హిప్ హాప్ తమిళ సంగీతం అందిస్తున్నారు. 'ఏజెంట్' చిత్రం ఏప్రిల్ 28న రిలీజ్ కానుంది.

ఇవే కాదు.. అల్లరి నరేశ్ 'ఉగ్రం', సాయిధరమ్ 'విరూపాక్ష', సందీప్ కిషన్ 'ఊరు పేరు భైరవకోన'తో పాటు మరికొన్ని చిత్ర బృందాలు శివరాత్రి శుభాకాంక్షలు తెలిపాయి.

పోస్టర్ బాగుంది

- నాగార్జున


తేజ, నాగార్జున, రామచంద్ర రావు

''ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్ అందర్నీ ఆకట్టుకునేలా బాగుంది. ఈ సినిమా హిట్ అయి, యూనిట్‌కి మంచి పేరు రావాలి'' అన్నారు అక్కినేని నాగార్జున. బొమ్మదేవర శ్రీదేవి సమర్పణలో తేజ బొమ్మదేవర, రిషికా లోక్రే జంటగా బొమ్మదేవర రామచంద్ర రావు దర్శక-నిర్మాణ సారథ్యంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నాగార్జున రిలీజ్ చేశారు. ''ప్రేమకథ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: వికాస్ బాడిస, కెమెరా: వాసు.

కొత్త కాన్సెప్ట్‌లా ఉంది

- దర్శక-నిర్మాత యం.ఎస్. రాజు


యం.ఎస్.రాజు, నరేష్, శరణ్‌కుమార్

దివంగత ప్రముఖ నటి-దర్శకురాలు విజయ నిర్మల మనవడు శరణ్ కుమార్ (నరేశ్ కజిన్ రాజ్ కుమార్ కొడుకు) హీరోగా రూపొందిన చిత్రం 'మిస్టర్ కింగ్'. శశిధర్ చావలి దర్శకత్వంలో బీఎన్ రావు నిర్మించారు. యశ్విక నిష్కల, ఊర్వీ సింగ్ కథానాయికలు. ఈ నెల 24న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శనివారం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో అతిథిగా పాల్గొన్న దర్శక-నిర్మాత ఎంఎస్ రాజు మాట్లాడుతూ - ''ట్రైలర్ ప్రామిసింగ్‌గా వుంది. కొత్త కాన్సెప్ట్‌తో సినిమాని రూపొందించారనిపిస్తోంది'' అన్నారు. ''మా అల్లుడు శరణ్ హీరోగా పరిచయమవుతున్నాడు. సూపర్‌స్టార్ కృష్ణ, విజయ నిర్మలగార్ల ఆశీస్సులు ఉంటాయి'' అన్నారు నరేష్. ''ఈ చిత్రంలో బలమైన పాత్ర చేశాను'' అన్నారు శరణ్. ''ఆత్మాభిమానం వున్న ఓ అబ్బాయి కథ ఇది'' అన్నారు శశిధర్. ''సినిమా అద్భుతంగా వచ్చింది'' అన్నారు బీఎన్ రావు.

మాఫియాగా మారింది

- సి. కల్యాణ్



''నిర్మాతల మండలిలో 1200 మంది సభ్యులు ఉన్నారు. కానీ ప్రొడ్యూసర్స్ గిల్డ్‌లో 27 మంది సభ్యులు ఉన్నారు. ప్రొడ్యూసర్స్ గిల్డ్ మాఫియాగా మారింది. గుత్తాధిపత్యం వల్ల పరిశ్రమ నాశనమవుతోంది'' అని నిర్మాత సి. కల్యాణ్ ఆరోపణలు చేశారు. నేడు నిర్మాతల మండలి ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత నిర్మాతల మండలి అధ్యక్షుడు సి. కల్యాణ్ శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ – ''అందరూ ఒకే తాటిపై ఉండాలని ఆరంభం అయిన ఆర్గనైజేషన్ చిన్నగా ఎల్ఎల్‌పీగా మారి అది కాస్తా 'గిల్డ్'గా మారింది. గిల్డ్ ఏంటి? ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఏంటి? రెండింటినీ కలిపేయొచ్చు కదా అని చాలా మంది అంటున్నారు. కలపడానికి మేం చేస్తున్న ప్రయత్నాన్ని కొందరు అడ్డుకుంటున్నారు. ఇక్కడంతా మోనోపలి అయ్యింది. వారే హీరోలు, వారే డిస్ట్రిబ్యూటర్స్, వారివే థియేటర్స్.. ఇలా ఇండస్ట్రీని శాశిస్తున్నారు. కల్యాణ్ లీడ్ చేస్తే మంచే జరుగుతుంది అనే నమ్మకం కలిగితే మా ప్యానల్‌కు ఓటు వెయ్యండి'' అన్నారు. కాగా ఈ ఎన్నికల్లో కల్యాణ్ పోటీపడటంలేదు. నిర్మాతల మండలి తరఫున అధ్యక్ష పదవికి పి. కిరణ్ పోటీలో ఉన్నారు.

ఈ ఎన్నికలపై 'దిల్' రాజు స్పందిస్తూ – ''ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్న నిర్మాతలు ఉన్న 'ప్రోగ్రెసివ్ ప్రొడ్యూసర్స్ ప్యానెల్'ని గెలిపించాలని కోరుతున్నాను'' అన్నారు. ఈ ప్యానెల్ తరఫున అధ్యక్షుడిగా దామోదర ప్రసాద్ పోటీ చేస్తున్నారు.

పొలిమేరలో...


రాజేష్, కామాక్షి

సత్యం రాజేష్, డా. కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, బాలాదిత్య, రవి వర్మ, చిత్రం శ్రీను, అక్షత శ్రీనివాస్ ముఖ్య పాత్రల్లో ఓ చిత్రం రూపొందింది. 'మా ఊరి పొలిమేర' చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో గౌరు గణబాబు సమర్పణలో గౌరికృష్ణ ఈ చిత్రాన్ని నిర్మించారు. పల్లెటూరి నేపథ్యంలో, ఊరి పొలిమేర చుట్టూ సాగే కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించారు. సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రానికి సంగీతం: గ్యాని, కెమెరా: ఖుషేందర్ రమేష్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.సి. సతీష్ కుమార్.

వాస్తవంతో...


శ్రుతి ధాంగే

శ్రుతి ధాంగే ప్రధాన పాత్రధారిగా, సత్యప్రకాష్, ఆనంద్ రాజ్ ఇతర ముఖ్య తారాగాణంగా నటించిన చిత్రం 'వీరఖడ్గం'. ఎంఏ చౌదరి దర్శకత్వంలో కె. కోటేశ్వరరావు నిర్మించిన ఈ రివెంజ్ బ్యాక్‌డ్రాప్ చిత్రం మార్చి మొదటి వారంలో రిలీజ్ కానుంది. ''వాస్తవాన్ని వెంటాడుతూ గతం చేసిన యుద్ధమే ఈ 'వీరఖడ్గం' చిత్రం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. బ్రహ్మానందం, మదన్, తపస్వి, అపూర్వ పృధ్వీరాజ్ కీ రోల్స్ చేసిన ఈ చిత్రానికి సంగీతం: షయాక్ పార్వాజ్, మాటలు: ఘటికాచలం, లైన్‌ప్రొడ్యూసర్: మారిశెట్టి సునీల్‌కుమార్.

సీక్వెల్ ఆలోచన లేదు

- దర్శకుడు వెంకీ అట్లూరి



''సార్' సినిమాకు తల్లిదండ్రులు, విద్యార్థులు ఎమోషనల్‌గా బాగా కనెక్ట్ అవుతారు. ఈ సినిమా చూసిన తర్వాత విద్యార్థులకు వారి తల్లిదండ్రులు ఎంత కష్టపడుతున్నారో అర్థం అవుతుంది. మనసున్న ప్రతి మనిషికీ 'సార్' సినిమా నచ్చుతుంది'' అన్నారు దర్శకుడు వెంకీ అట్లూరి. ధనుష్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన ద్విభాషా చిత్రం 'సార్' (తమిళంలో 'వాతి'). సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదలైంది. 'సార్' సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ లభిస్తోందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ చిత్రదర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ- ''చదువు అనేది నిత్యావసరం. అందుకే 'సార్' సినిమా బ్యాక్‌డ్రాప్ 1990 అయినప్పటికీ ఇప్పటి ఆడియన్స్ కూడా కనెక్ట్ అవుతారనిపించింది. ధనుష్‌గారికి మా నిర్మాత 'సార్' కథ చెప్పమనగానే హ్యాపీ ఫీలయ్యాను. కథ విన్నాక ధనుష్‌గారు చప్పట్లు కొట్టి, కాల్షీట్స్ ఎప్పుడు కావాలని అడగటంతో ఇంకా హ్యాపీ ఫీలయ్యాను. ఇందులో తండ్రీకొడుకుల మధ్య మంచి సీన్ ఉంటుంది. అది త్రివిక్రమ్‌గారితో జరిపిన సంభాషణల నుంచే పుట్టింది. 'సార్' యూనివర్సల్ సబ్జెక్ట్. తమిళంలోనూ మంచి స్పందన లభిస్తోంది. ఈ చిత్రానికి సీక్వెల్ ఆలోచన లేదు. ఇక నుంచి నా ప్రతి సినిమాకీ వైవిధ్యం చూపించడంతో పాటు విభిన్న జోనర్లలో చిత్రాలు చేస్తాను'' అన్నారు.

హీరామండిలో...



బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ తెరకెక్కించిన తొలి వెబ్ సిరీస్ 'హీరామండి'. మనీషా కొయిరాల, సోనాక్షీ సిన్హా, అదితీ రావ్ హైదరీ, రిచా చద్దా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్ ఫస్ట్ గ్లింప్స్‌ను శనివారం విడుదల చేశారు. లాహోర్ బ్యాక్‌డ్రాప్‌లో ఒకప్పటి వేశ్యల జీవితాల ఆధారంగా ఈ సిరీస్‌ను రూపొందించారు. త్వరలో స్ట్రీమింగ్ కానుంది.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



ముదిరాజ్ / M.Tech / C.Govt.స్టేషన్ మాస్టర్ / రైల్వేస్ / 80,000/-PM / 5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-10316]

కుమ్మరి/కట్న ప్రసక్తి లేదు/CA/చార్టర్డ్ అకౌంటెంట్/8.5 Lakhs P/A/5'10" ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-10316]

క్రిస్టియన్ మాల/B.Tech/IT / C.Govt. ఇంజనీర్/BHEL / 1 Lakhs PM / "6" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-10316]

లంబాడి/M.Tech / Govt.Asst.ఇంజనీర్ /ఎలక్ట్రికల్ Dept / 86,000/-PM/5'10" ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-10316]

క్రిస్టియన్ మాదిగ/M.Tech/ C.Govt. Sr. అసోసియేట్/SBI బ్యాంక్/60,000/-PM/ 5'11"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-10316]

ఎరుకుల/ST, 46 సం॥ల, బిజినెస్, రెండవ పెళ్లి వరునికి , పిల్లలు, ఏ బాధరబందీలేని మిడిల్ క్లాస్ వధువు కావలెను. వయస్సు: 36-46, కట్నప్రసక్తిలేదు, నో బ్రోకర్స్. Ph: 9948605439 [HA-13867]

SC మాదిగ & క్రిస్టియన్/B.Tech, MBA/ C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI/ 65,000/-pm/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9515755529, 9912280929 [HA-13863]

యాదవ/M.Tech, (IT)/ C.Govt. Sr. ఇంజనీర్/రైల్వే/86,000/-pm /5'9"ఎత్తు / 28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్నప్రసక్తిలేదు. Ph: 9515755529 [HA-13863]

నాయీబ్రాహ్మణ / B.Tech / C.Govt. Asst. మేనేజర్ / FCI/ 78,000/-pm/ 5'10" ఎత్తు / 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9515942275 [HA-13863]

2వ పెళ్లి/B.Tech/ Govt. Asst. ఇంజనీర్/ ఇరిగేషన్ Dept./ 80,000/-pm/ 5'10" ఎత్తు/32 సం॥ల వరునికి వధువు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 9963757612 [HA-13863]

మహేష్, హిందూ, బలిజ/30/5'7"/ CA, B.Com/ 14L Pa/ బలిజ కులంలో మంచి వధువు కావాలి. కాల్: 9590188558 [HA-54566]

36 సం॥ల బిజినెస్ మ్యాన్‌కి సెకండ్ మ్యారేజ్, కుల ప్రసక్తిలేని వరుడికి సెకండ్ మ్యారేజ్/విడో, పిల్లలు ఉన్న వారు అయినా సంప్ర నో జౌరీ Hyd సంప్ర: 6304070671 [H-793371]

SC మాల/క్రిస్టియన్/కట్నప్రసక్తి లేదు/ 28y/5'10"B.Tech(Civil) Asst. Commercial Tax Officer (ACTO) 90,000/-PM గల వరునికి తగిన వధువు కావలెను. Ph: 8978880072 [H-796858]

గౌడ్స్/33yrs/5'7" / B.Tech / కలర్: Fair/సాఫ్ట్‌వేర్ జాబ్/80K per Month. వెల్ సెటిల్డ్ వరునికి వధువు కావలెను. No Caste bar. Ph: 85004 27582 [H-793707]

SC మాల/కుల, కట్న ప్రసక్తి లేదు/లేట్/45y/ 5'1"/ B.Tech/MBA/LLB(Ph.D)/40K PM/కొంచెం శరీర వైకల్యం కాలు Hydలో స్థిరపడిన వరునికి 1st & 2nd మ్యా వధువు కావలెను. నో బ్రోకర్స్ ప్లీజ్. 7702438915 [H-793707]

కాపు / కుల పట్టింపు లేదు / 62 సం॥ Govt. Officer Retd. వరుడుకి 55 సం॥ పైబడిన వెల్‌సెటిల్డ్ వధువు కావలెను. నో బ్రోకర్స్. 78459 06925 [B-1868]

Keralite Divorcee, well settled Nair, 40 Yrs Looking for bride around 30 Yrs from decent family. Caste no bar, 2nd Marriage accepted. Ph: 8639033316. [HA-13867]

★

రెడ్డి కుటుంబానికి చెందిన 37 ఏళ్ల అబ్బాయి హైదరాబాద్ (న్యూ సిటీ) MBBS MD (డాక్టర్) తగిన మ్యాచ్ కోసం వెతుకుతున్నాడు. (080-69070619) [HA-9493]

35 ఏళ్ల అబ్బాయి బి.కామ్ చదివాడు, విడాకులు తీసుకున్న అమ్మాయి కోసం చూస్తున్నాడు. (Caste no bar) (080-69070619) [HA-9491]

SC MALA / Hindu/ 2nd Marriage/ 38/5'10"/ PG/ SWE/ 1lakh P/M/Seeks Good Looking Bride (urgently) No Brokers Cont: 8187861989 [H-796859]

వరుడు కావలెను



విశ్వబ్రాహ్మణ్/ఏకైక కుమార్తె / B.Tech/ Govt.Asst. ఎగ్జి॥ఇంజనీర్/ఇరిగేషన్ Dept/ 50,000/-PM/5'4"ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-10316]

గౌడ/80 లక్షల ఆస్తి/M.Sc/Govt. Jr. Asst/ఫారెస్ట్ Dept/42,000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-10316]

వడ్డెర/50 లక్షల ఆస్తి/B.Tech/C. Govt. P.O/SBI బ్యాంక్ / 50,000/-PM / 5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-10316]

SC హిందు మాల/ఏకైక కుమార్తె/B.Tech/ Govt.ల్యాండ్ సర్వేయర్/రెవెన్యూ Dept/ 45,000/-PM /5'6"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-10316]

SC హిందు మాదిగ/M.Sc/Agri/ Govt. AEO/అగ్రికల్చర్ Dept/52,000/-PM / 5'4" ఎత్తు /24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-10316]

2వ పెళ్లి/ విడో / 46y / District Auditing Officer/ 1L P/M Own విల్లా / 12 ఎ॥ ల్యాండ్స్/ కోట్ల ప్రాపర్టీగల వెల్‌సెటిల్డ్ వధువుకు కుల ప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 8885985513 [H-796858]

వైశ్య/ విడో/48yr/ Govt Job VRS/50K P.M/ Own Business. Own House(Rents) కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను (పిల్లలున్నా OK) Ph: 9177631661 [H-796858]

రెండవపెళ్ళి/విడో /55y/ ఒంగోలు / Govt Job/ 90,000/- PM/ Own House Rents/ Well Settled ఏ బాధర బందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను Ph: 8519803423 [H-796858]

రెడ్డి వధువులు అన్ని వయస్సుల సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, జాబ్స్, లోకల్, విదేశీ, మొదటి, ఆలస్య, రెండవ పెళ్లి సంబంధాలు కలవు. కాల్: 6304826162 (మీ నమ్మకమైన Match Expert) [HA-13867]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 30, 6', Developer, H1, 150 K, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 29, 5' 8", Sr Analyst, 30.3 L P/A, 5 Cr, Hyd. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Canada, BE, MS, 30, 6', SWE, 250 K, 30 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 29, 6', Manager, 18 L P/A, 20 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Bengaluru, MTech IIIT, 26, 5' 3", SWE, 25L P/A, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BDS, MDS, 28, 5' 7", Doctor, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 4", Engineer, H1, 200 K, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MS, 28, 5'3", SAP Consultant, 20 L P/A, Hyd, 10 Cr. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
(రెడ్డిలకు మాత్రమే)
D.V. Koti Reddy
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad
98480 11818, 93933 11818

రెడ్డి BE, M.Tech IIT, MS, 29, 6', 293 K, 15 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 30, 5' 7", SWE, 20 L P/A, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 11", Doctor, Hyd, Rich, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, M.Tech IIT, MS, 28, 5' 7", 300 K, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, MA, 28, 5' 2", 230 K, 15 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 4", SWE, 200 K, 2 Crores, USA, Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 28, 5' 3", Doctor, Rich, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Motati, BE, 25, 5' 6", 64 L P/A, Hyd, Very Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

బ్రాహ్మణ / 25/5'3" / ఇంటర్ "28/5'3"B.Sc "28/5'4"BBM "27/5'2"హోటల్ మేనేజ్‌మెంట్ వధువులకు వరులు కావలెను. కట్నప్రసక్తిలేని వారు సంప్ర. జాబ్/ పురోహితం అయినా Ok. Ph: 7893005879. [HA-13863]

క్రిస్టియన్ మాల / B.Tech / SWE/ 40,000/-pm / 5'4" ఎత్తు / 24 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 7396369922 [HA-13863]

SC మాల/ఏకైక కుమార్తె/M.Sc/ Govt. Jr. Asst./ R&B Dept./ 40,000/-pm/ 5'3" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 8897389698 [HA-13863]

SC మాల & క్రిస్టియన్/M.Tech (EEE)/ C.Govt. డిప్యూటీ మేనేజర్ / SBI/ 65,000/-pm/ 5'4" ఎత్తు/ 26 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9676995093 [HA-13863]

వడ్డెర/B.Sc-Agri/Govt. అగ్రికల్చర్ ఆఫీసర్/ 45,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 8341650195 [HA-13863]

బ్రాహ్మణ/25/5'3"/ ఇంటర్ "28/5'2"B.Sc "30/5'3"ఇంటర్ "27/5'3"MBA వధువులకు వరులు కావలెను. జాబ్/బిజినెస్ Ok. పురోహితులకు కూడా సం॥ధాలు కలవు. Ph: 7815999246 [HA-13863]

2వ పెళ్ళి/కుల ప్రసక్తి లేదు/35yrs/MBA/ సెంట్రల్ Govt ఆఫీసర్/3 లక్షల (PM) / 15 కోట్ల ఆస్తి గల పిల్లలులేని తెల్లని అందమైన వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్న OK) సంప్రదించండి: 7396213324 [H-793371]

రెడ్డి/49y/5'5"/కుల పట్టింపు లేదు/సెంట్రల్/PG/ Govt.ఎంప్లాయ్/86K(PM)/వెల్ సెటిల్డ్/బిజినెస్ & సొంత ఇల్లు/సొంత ఫ్లాట్స్ కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర: 8008474869 [H-793371]

వైశ్య/54y / విడో / 5'4"/ Housewife / 20 ఎకరాల పొలం/సొంత ఇల్లు+రెంట్స్ ఆస్తి కుల పట్టింపులేని వధువుకి వరుడు కావలెను. (పిల్లలు లేరు) సంప్ర: 9515939479 [H-793371]

రెడ్డి/58y/విడో/తెల్లని చాయ/ప్రభుత్వ రిటైర్డ్/Own House గల పిల్లలు లేని వధువుకి కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. సంప్ర: 9063346856 [H-793371]

No Caste bar, 1, 2వ, 1 కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు, వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK త్వరగా చూసుకునే వారికోసం మాత్రమే. P:W: 7794960803 [H-796806]

కాపు/ 55yrs/5'2"/MBA/ కలర్: Fair/ Govt. జాబ్/85K Per Month. ఇల్లరికం అయినా OK వధువుకి వరుడు కావలెను. No Caste Bar. Ph: 79958 25318 [H-793707]

బ్రాహ్మణ/33yrs/5'2"/ఇంటర్. " 29yrs/ 5'4"/ డిగ్రీ/అందమైన వధువులకు వరులు కావలెను/రిటైర్/Pvt, Govt. జాబ్ & పురోహితం అయినా OK. Ph: 6301953980 [H-793707]

FC/విడో/60y/5'4"Fair/సొంత ఇల్లు & రెంట్స్/ వ్యవసాయ భూములు గల ఏ బాదరబందీలేని సాంప్రదాయ కుటుంబం గల వెల్ సెటిల్డ్ ఒంటరి వధువుకు వరుడు కావలెను. కులప్రసక్తి లేదు. Ph: 8297484478 [H-793707]

★

హైదరాబాద్‌కు చెందిన 28 ఏళ్ల డాక్టర్ చాలా సంపన్న కుటుంబానికి చెందిన అందమైన అమ్మాయి తగిన జోడి కోసం వెతుకుతోంది (080-69070621). [HA-9492]

SC మాల హిందు/డైవర్సీ/37 సం.లు, సెంట్రల్ గవర్నమెంట్ టీచర్ సెటిల్డ్ వధువుకు తగిన గవర్నమెంట్ టీచర్ గవర్నమెంట్ లెక్చరర్ గల వరుడు కావలెను. డైరెక్ట్. 7013362957 [HA-13817]

వేదికలు



సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే శ్రీ బాలాజి దుర్గ మ్యారేజ్ బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. Ph: 8555980066 / 6302543297 [H-796858]

నిఖిల్ గౌడ్స్ మ్యారేజ్ బ్యూరో, ఓన్లీ గౌడ్స్/శెట్టి బలిజ/దేశ/విదేశ/1వ/2వ/Engg./డా॥/ పీజీ /డిగ్రీ గౌడ వధూవరులకై. Opp. ఆకృతి టౌన్‌షిప్, బోడుప్పల్. Ph: 9848041335/ 9848371924 [HA-13867]

విశ్వబ్రాహ్మణ పెళ్లి సంబంధాలు కోసం కాల్: 99856 08686 అన్ని ప్రాంతాల Matchesని మంచి సర్వీస్‌తో సెట్ చేయబడును. (33 సం॥ల ప్రైవేట్ జాబ్ అబ్బాయికి వధువు కావాలి). [HA-13867]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.నారదాగౌడ్, Ph: 8790690809 [H-793278]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13847]

Kamma - Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil. Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13847]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Nikhil. Ph: 7032712544/Blue Trend Matrimonial (P) Ltd. [HA-13847]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13847]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13847]

15 రో॥ అన్ని కులముల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల అతి పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com © 94920 33897, 94904 16355, 94407 85888 W [B-937]

Registration Free. మీకు తగిన సంబంధాలు ఉంటేనే Subscription తీసుకోండి. 25 సంబంధాలు కేవలం రూ. 500/- మాత్రమే. www.jeelakarrabellam.com, 98497 44707 [G-955]

40 సంవత్సరాలుగా వేలాది సంబంధాలు కుదిర్చిన సంస్థ కాకతీయ మ్యారేజెస్. kaakateeya.com. Ph: 9342939345, 9383 999 999. [HA-10053]

ఫ్రీ రిజిస్ట్రేషన్. అన్ని కులాల వారికీ 1వ/2వ/లేటు తగిన సంబంధాలు చూడబడును. స్త్రీలకు ప్రత్యేకం. ధృవ మ్యారేజెస్. 9949395407 [H-787368]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt./ సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/ MBBS/ PG/ NRI/ PVT/ బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS 15 సం॥ Exp. Ph: 8712384555 [HA-28721]

వడ్డెర వరుడు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [HA-10303]

★

మాదిగ వివాహ పరిచయవేదిక. ప్రతి శని, ఆదివారాలు, 12-6PM, ముందుగా మీ ప్రొఫైల్ రిజిస్టర్ చేసుకోవాలి. # సికింద్రాబాద్ స్టేషన్, బ్లూసీల్ బ్యాక్. 9347046175 [H-793265]

కేవలం డాక్టర్ వధూవరుల పరిచయ వేదిక అన్ని కులాలకు మరియు కేవలం ఆర్యవైశ్య పరిచయ వేదిక ఫోన్ నెంబర్లు, చిరునామా ఇవ్వబడును. 05-02-23 & 26-02-23, 1116/- భోజనం ఫ్రీ మొదటి 30 మందికి మాత్రమే 9705135074. [Z-0992955]

బ్రాహ్మణ వధూవరుల స్వయంవరం (Online) 2/04/23న Bhavanimatrimony, Hyd, Free Registration. Ph: 9704656103/ 9533608887 (Whatsapp No.) [HA-863]

రెడ్డి పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి U.S.A, కెనడా, లోకల్, నాన్‌లోకల్ Dubbaka Matrimony. Ph: 9059290726 [H-793261]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-906]

V.R.Reddy Marriage Bureau U.S.A & Local Matches Proposals For Rich Families Fast settlement. Ph: 9581725589 Email: ramana.Narsingi@gmail.com (Send Bio-data) [H-779943]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి పెళ్ళిచూపులు

Combined : 1800/- for 4 Lines 485/- Extra Line | Andhra Pradesh : 1350/- for 4 Lines (Incl. Hyd) 375/- Extra Line
Telangana : 1100/- for 4 Lines (Incl. Hyd) 300/- Extra Line | * Color 25% Extra

3+2 3 ప్రకటనలకు చెల్లించండి 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

నిజామాబాద్	:99122 20764	తిరుపతి	:99122 20586	తాడేపల్లిగూడెం	:99122 20558
కరీంనగర్	:9705933396	కడప	:99516 02932	రాజమండ్రి	:99122 20358
వరంగల్	:99516 02872	అనంతపూర్	:99122 20718	విజయవాడ	:9912225442
నల్గొండ	:95055 08382	కర్నూల్	:9010825556	గుంటూరు	:99122 20349
మహబూబ్‌నగర్	:99516 02829	శ్రీకాకుళం	:99122 20343	ఒంగోలు	:99122 25431
ఖమ్మం	:99516 02868	విశాఖపట్నం	:99122 20550	నెల్లూరు	:99516 02861

మరియు మీ దగ్గరలోని సాక్షి ప్రాంతీయ కార్యాలయములలో సంప్రదించండి.

6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, Hyd-34 Ph: 040-23256000 Ext: 6230 / 6235 Cell: 9912225453

శంకర్‌నాయక్ నీతులు చెప్పడం విడ్డూరం: షర్మిల



మహబూబాబాద్ సభలో ప్రసంగిస్తున్న షర్మిల

సాక్షి, మహబూబాబాద్/ రూరల్: ప్రభుత్వ శాఖలో ఇంజనీర్‌గా పనిచేసిన సమయంలో అవినీతికి పాల్పడి ఏసీబీకి అడ్డంగా దొరికిన సంగతి మరిచిపోయిన ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. ఆమె చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్ర శనివారం మహబూబాబాద్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ..ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చని మహబూబాబాద్ ఎమ్మెల్యే చేతకాని దద్దమ్మ అన్నారు. తమది ఆంధ్రా పార్టీ అంటూ చెప్పే ఆయన తన భార్యది నెల్లూరనే విషయం ఎలా మరిచిపోయారని ప్రశ్నించారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే కీచకుడిగా పేరున్న శంకర్‌నాయక్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు కోసం రూ. 23వేల కోట్లు ఖర్చుపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు దాన్ని తాగునీటి ప్రాజెక్టుగా చెప్పడం శోచనీయమన్నారు. ఎంపీ మాలోతు కవితకు 2009లో మహబూబాబాద్ నుంచి టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేను చేసింది దివంగత ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కాదా అని ప్రశ్నించారు. మహబూబాబాద్ ఎంపీగా ఆమె చేసిన పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. సభలో పార్టీ అధికార ప్రతినిధులు పిట్ట రాంరెడ్డి, ఏపూరి సోమన్న తదితరులు పాల్గొన్నారు. కాగా, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌పై షర్మిల అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆమెపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లూనావత్ అశోక్ శనివారం రాత్రి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు షర్మిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ టౌన్ సీఐ తెలిపారు.

సీఆర్పీఎఫ్ డీఐజీ కన్నుమూత

సాక్షి హైదరాబాద్: కొంతకాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న సీఆర్పీఎఫ్ డీఐజీ ప్రీత్ మోహన్‌సింగ్ (56) శనివారం మృతి చెందారు. గత ఏడాది మే నెల నుంచి ఆయన ఈ వ్యాధితో బాధపడుతూ జనవరి 14వ రేడియేషన్ థెరపీ కోసం స్థానిక ఆసుపత్రిలో చేరారు.

భోజనం బాగాలేదన్నందుకు వాతలు

ప్రిన్సిపాల్ కొట్టిన దెబ్బలకు విద్యార్థినుల రోదన

మధిర: భోజనం బాగాలేదని విద్యార్థి సంఘం నేతలకు ఫిర్యాదు చేయడమే ఆ విద్యార్థినులకు శాపమైంది.. గురుకులం ప్రిన్సిపాల్ ఆగ్రహంతో వాతలు పెట్టడంతో శరీరం కమిలిపోయింది. ఖమ్మం జిల్లా మధిర మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల వసతి గృహంలో శనివారం జరిగిన ఈ సంఘటనపై బాధిత విద్యార్థినులు అందించిన వివరాలివి. రెండు రోజుల క్రితం వసతి గృహాన్ని ఒక విద్యార్థి సంఘం నేత సందర్శించారు. ఈ సందర్భంగా భోజనం సక్రమంగా ఉండటం లేదని, కూరలు మంచిగా చేయడం లేదని విద్యార్థినులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ విద్యార్థినులందరినీ పిలిపించారు. హాస్టల్ విషయాలు బయటకు చెబితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. ఇంతలోనే శనివారం మరోమారు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రిన్సిపాల్ ఇరవై మంది విద్యార్థినులను తీవ్రంగా కొట్టారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ నజీమాను వివరణ కోరగా.. పదో తరగతిలో మార్కులు తక్కువగా రావడంతో మందలించే క్రమంలో ఒకటి, రెండు దెబ్బలు కొట్టిన మాట వాస్తవమేనని అంగీకరించారు. హాస్టల్‌లో నాణ్యమైన భోజనమే అందిస్తున్నామని స్పష్టం చేశారు. కానీ విద్యార్థినులు మాత్రం.. హాస్టల్ పైన ప్రత్యేకంగా ఒక రూం ఉందని, అక్కడికి ఎవరైనా వెళ్తే ప్రిన్సిపాల్ కొడుతున్నారని ఆరోపిస్తున్నారు. చదవకపోవడంతో కొట్టినట్లు ప్రిన్సిపాల్ చెబుతున్న విషయం అవాస్తవమని, ఆహారంలో నాణ్యత కూడా లేదని వాపోయారు. ప్రిన్సిపాల్ కొట్టిన దెబ్బలకు శరీరంపై వాతలు తేలాయని రోదిస్తున్నారు.



ప్రిన్సిపాల్ కొట్టిన దెబ్బలకు కమిలిన విద్యార్థిని శరీరం

సంక్లిష్టంగా ఎయిర్‌పోర్టు మెట్రో

- రాయదుర్గం నుంచి నానక్‌రామ్‌గూడ వరకు ప్రత్యేక దృష్టి
- ఇంజనీరింగ్ పరంగా అతి క్లిష్టమైన భాగంగా నిపుణుల గుర్తింపు
- ప్రీస్ట్రెస్డ్ కాంక్రీట్ గర్డర్‌లతో మెట్రో వయాడక్ట్
- సాంకేతిక సవాళ్లపై రైల్వే భద్రతా నిపుణులతో పర్యవేక్షణ
- నిపుణులతో కలిసి బ్లూలైన్ మార్గాన్ని తనిఖీ చేసిన ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



అధికారులకు సూచనలిస్తున్న ఎన్వీఎస్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎయిర్‌పోర్ట్ మెట్రో మార్గాన్ని నిపుణుల బృందం మరోసారి పరిశీలించింది. రాయదుర్గం నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు నిర్మించతలపెట్టిన బ్లూలైన్ మెట్రో రైల్ నిర్మాణంలో ఎదురయ్యే సాంకేతిక సవాళ్లపై దృష్టి సారించింది. మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి నేతృత్వంలో రైల్వే భద్రతా నిపుణులు, రైల్వే బోర్డు ఇంజనీరింగ్ విభాగం మాజీ సభ్యులు సుబోధ్‌జైన్‌లతో కలిసి రూట్ సర్వే నిర్వహించారు. ఈ తనిఖీలో హెచ్ఏఎంఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్ ఎం విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఈ వై సాయపురెడ్డి, రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ జేఎన్ గుప్తా, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టులో రాయదుర్గం స్టేషన్ నుంచి నానక్‌రామ్‌గూడ జంక్షన్ వరకు ఇంజనీరింగ్ పరంగా అతి క్లిష్టమైన భాగమని నిపుణులు గుర్తించారు. ఈ మార్గంలో ఉన్న సాంకేతిక సవాళ్లను అధ్యయనం చేసేందుకు అత్యుత్తమ ఇంజనీరింగ్ పరిష్కారాలపైన దృష్టి సారించినట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో నిపుణుల సలహాలు, సూచనలు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు.

ఇవీ సవాళ్లు...

- ఈ రూట్‌లో సుమారు 21 మీటర్ల (69 అడుగులు) ఎత్తులో మైండ్‌స్పేస్ జంక్షన్‌ను దాటవలసి ఉంటుంది. ఈ జంక్షన్‌లో కింద అండర్‌పాస్ ఉంది. మధ్యలో రోటరీ, పైన ఫ్లైఓవర్ ఒకదాని మీద ఒకటి ఉన్నాయి. ఈ అడ్డంకిని దాటేందుకు ప్రీస్ట్రెస్డ్ కాంక్రీట్ గర్డర్లతో చిన్న స్పాన్‌లుగా మెట్రో వయాడక్ట్‌ను నిర్మించవలసి ఉంటుంది. లేదా కాంపోజిట్ స్టీల్ గర్డర్‌తో 90 మీటర్ల (295 అడుగులు) పొడవైన ప్రత్యేక స్పాన్‌ని 'ఇన్ సిటు' (అక్కడికక్కడే నిర్మాణం) విధానంలో నిర్మించవలసి రావచ్చు.
- స్పాన్ పొడవు, గర్డర్ రకం, నిర్మాణ పద్ధతి, అండర్‌పాస్, రోటరీ, ఫ్లైఓవర్‌ల నిర్మాణ డ్రాయింగ్‌లను జీహెచ్ఎంసీ నుంచి తీసుకొని మెట్రో రైల్ ఇంజనీర్లు విశ్లేషిస్తారు.
- రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు చేపట్టనున్న మెట్రో కారిడార్ – 3 (బ్లూలైన్) ప్రాజెక్టులో ఎయిర్‌పోర్ట్ మెట్రో స్టేషన్‌కు విభిన్నమైన నిర్మాణ ప్రక్రియలను పరిశీలిస్తున్నట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. సరికొత్త ఇంటిగ్రేటెడ్ పద్ధతిలో ప్రయాణికులకు అత్యాధునికమైన రవాణా సదుపాయం కల్పించేవిధంగా అన్ని కోణాల్లో అధ్యయనం చేస్తున్నట్లు పేర్కొన్నారు.
- ఈ బహుళ స్థాయి ఇంటర్‌చేంజ్ స్టేషన్‌కు ఆనుకుని ఉన్న అదనపు హైవోల్టేజ్ 400 కేవీ భూగర్భ కేబుళ్లను ఏమాత్రం మార్చకుండా మెట్రోస్టేషన్‌ను డిజైన్ చేయనున్నారు.

బయోడైవర్సిటీ వద్ద స్టేగర్డ్...

- విమానాశ్రయం మెట్రో వయాడక్ట్ బయోడైవర్సిటీ జంక్షన్ వద్ద 20 మీటర్ల (66 అడుగులు) ఎత్తులో బహుళ స్థాయి ఫ్లైఓవర్‌ను దాటవలసి ఉంటుంది. ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టులో ఇది మరో సవాల్.
- ఫ్లైఓవర్ పిల్లర్ల పునాదులపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడకుండా ఉండేందుకు ఎయిర్‌పోర్ట్ మెట్రో పిల్లర్‌లను ఫ్లైఓవర్ పిల్లర్‌లకు దూరంగా స్టేగర్డ్ (ఒకటి విడిచి ఒకటి)పద్ధతిలో ఏర్పాటు చేస్తారు.
- ఫ్లైఓవర్ మీదుగా నిర్మించే స్పాన్ క్రాసింగ్‌ను 'ఇన్ సిటు' పద్ధతిలో ప్రీస్ట్రెస్డ్ కాంక్రీట్ గర్డర్లతో ప్లాన్ చేసే అవకాశం ఉంది.
- రోడ్డు మీడియన్ వంపులో ఉన్నందున నానక్‌రామ్‌గూడ జంక్షన్ స్టేషన్‌ను పోర్టల్ నిర్మాణంగా రూపొందించాల్సివుంటుందని నిపుణులు సూచించారు. వివిధ మార్గాల్లో వచ్చే ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని స్టేషన్‌ను జంక్షన్‌కు దగ్గరగా నిర్మించాలని పేర్కొన్నారు.

'టికెట్' కలవరం!

▶ మొదటి పేజీ తరువాయి

ఏమిటన్న చర్చ జరుగుతోంది.

ఎంపీలు, ఎమ్మెల్సీల ప్రయత్నాలతో..

పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు ఈసారి అసెంబ్లీకి పోటీచేయాలని భావిస్తున్నారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే దుబ్బాక బరిలోకి దిగేందుకు సన్నాహాలు చేసుకుంటుండగా.. ఎంపీలు మాలోత్ కవిత, పి.రాములు, రంజిత్‌రెడ్డి, మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, శంభీపూర్ రాజు, పాడి కౌశిక్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి తదితరులు అసెంబ్లీ బరిలోకి దిగాలనే ఉత్సాహంతో ఉన్నారు.


పొత్తు, దోస్తీ ప్రభావంపైనా చర్చ

ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో పొత్తు ఉండదని, అవగాహన మాత్రమే ఉంటుందని బీఆర్‌ఎస్ నుంచి సంకేతాలు వస్తున్నా.. రాష్ట్రంలో మనుగడ కోసం అసెంబ్లీలో ప్రాతినిధ్యం తప్పనిసరి అని వామపక్షాలు భావిస్తున్నాయి. మధిర, పాలేరు, భద్రాచలం, మిర్యాలగూడెం లేదా హుజూర్‌నగర్‌ను సీపీఎం.. మునుగోడు, హుస్నాబాద్, కొత్తగూడెంతోపాటు మరికొన్ని అసెంబ్లీ సీట్లను సీపీఐ కోరే అవకాశం ఉందని అంచనా. ఈ నేపథ్యంలో టీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, నేతల్లో ఏం జరుగుతుందన్నది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు బీఆర్‌ఎస్‌కు మిత్రపక్షంగా వ్యవహరిస్తున్న ఎంఐఎం (మజ్లిస్) ఈసారి 50 స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించింది. దీని ప్రభావం బీఆర్‌ఎస్‌పై ఏమేర ఉంటుందనే చర్చ కూడా సాగుతోంది.

'సైలెంట్'గా సిద్ధమవుతున్న కేసీఆర్

బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఈసారి కూడా గెలవాలని, దక్షిణాది రాష్ట్రాల్లో వరుసగా మూడోసారి అధికారం చేపట్టిన సీఎంగా రికార్డు సృష్టించాలని భావిస్తున్నారు. గుంభనంగా ఉంటూనే.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు అవసరమైన కార్యాచరణపై కసరత్తు చేస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సొంత పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, కీలక నేతలతోపాటు ఇతర పార్టీల నాయకుల అనుకూలతలు, ప్రతికూలతలను మదింపు చేస్తున్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒకసారి మాత్రమే పార్టీ అభ్యర్థులు గెలిచిన నియోజకవర్గాలు, ఒక్కసారి కూడా గెలవని సెగ్మెంట్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. వీటితోపాటు ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాలు, బీజేపీ ఎంపీలున్న లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పార్టీ పరిస్థితిని పరిశీలిస్తున్నారు. మొత్తంగా సంస్థాగత లోపాలను చక్కదిద్దడంతోపాటు ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేసేందుకు త్వరలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించినట్టు తెలిసింది.

రైతులు ఆటోమేటిక్ స్టార్టర్లు తొలగించాలి



ఎ.గోపాల్‌రావు

- మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి
- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్‌రావు

హన్మకొండ: ప్రభుత్వం వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న నేపథ్యంలో వ్యవసాయ పంపుసెట్లకు అమర్చిన ఆటోమే టిక్ స్టార్టర్లను తొలగించాలని తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు శనివారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సెక్షన్ 6 ప్రకారం ఆటోమేటిక్ స్టార్టర్‌లు తొలగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా అందిస్తున్న క్రమంలో కరెంటుకు ఇబ్బంది లేదని, ఈ తరుణంలో ఆటోమేటిక్ స్టార్టర్‌లతో పని లేదని పేర్కొన్నారు. వీటివల్ల విద్యుత్ డిస్ట్రిబ్యూ షన్ ట్రాన్స్‌ఫార్మర్‌లపై భారం పడి నిర్వహణ ఖర్చు భారీగా పెరుగుతుందని, ఇప్పుడిస్తు న్న విద్యుత్‌ను అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆటో స్టార్టర్ల రూపంలో జరుగుతున్న విద్యుత్ వృథాను అరికట్టాల్సిన అవసరముందని సూచించారు. మోటార్లు వాడే ప్రతి రైతు తప్పకుండా సరైన రేటింగ్ కలిగిన కెపాసిటర్‌ను బిగించుకోవాలని, తద్వారా ఓల్టేజీ పెరగడంతో విద్యుత్ తక్కువగా వినియోగమవుతుందని, మోటార్లు కాలిపోవని వివరించారు. దీని ధర రూ.300 నుంచి రూ.350 వరకు ఉంటుందని, రైతులు వ్యవసాయ మోటార్లకు తప్పకుండా 2 నుంచి 3 కేవీఏఆర్ కెపాసిటర్ బ్యాంకులను బిగ్గించుకోవాలని సూచించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

చదువు... క్రమశిక్షణ... ఆరోగ్యము... ఒత్తిడిలేని విద్య... శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థలో... ప్రతి విద్యార్థి భవిష్యత్ ఉజ్వలమే...

SRI VISWASANTHI EDUCATIONAL INSTITUTIONS
EDUCATION - DISCIPLINE
ESTD : 1975. VUYYURU

శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థలు

STATE SYLLABUS - SCHOOL & COLLEGE

VUYYURU (Near Vijayawada),
Krishna Dt., ANDHRA PRADESH
Cell : 994 898 4444, 913 331 8502, 924 745 6148, 991 277 5666, 833 300 0899.

Web Site : www.sriviswasanthischools.in
E-mail Id : director.sriviswasanthi@gmail.com


Madala Subrahmaneyswara Rao
Founder & Managing Director


Dr. M. SURYASEKHAR
M.B.B.S., M.B.A.,
Chief Executive Director


M. SUSHMA
MSIS., M.B.A.,
Executive Director



LKG to 10th, Inter & +1, +2


Madala Prameela Rani
Founder


Dr. M. RAJASEKHAR
M.B.B.S., M.S. (Ortho)
Director


Dr. M. NEELIMA
M.B.B.S.,
Director

స్కూల్ విద్యలోనే కాదు... కాలేజి విద్యలో కూడా...
Super Senior Lecturersచే
JEE - Main & Advanced, NEET & EAMCETలలో... అద్భుత ఫలితాలు.

అడ్మిషన్ల వివరములకు

పైన వున్న ఫోన్ నెంబర్లలో సంప్రదించగలరు.



విద్యాసంస్థ యొక్క ప్రత్యేకతలు — విజ్ఞతగల నిర్ణయం మీదే!

- ప్రశాంతమైన గ్రామీణ వాతావరణంలో ఒత్తిడిలేని విద్యను అందిస్తున్న విద్యాసంస్థ... 80 ఎకరముల విస్తీర్ణములో, 20 ఎకరముల ఆటస్థలంతో - మరెక్కడా బ్రాంచీలు లేకుండా, డైరెక్టర్స్ విద్యార్థులతో క్యాంపస్‌లోనే నివాసముంటూ... 24 గంటలూ స్వీయ పర్యవేక్షణలో... 48 సంవత్సరముల నుండి అంకిత భావంతో నడుపబడుతున్న **A MODEL SCHOOL.**
- మా పాఠశాల / కాలేజిలోనికి అతి సాధారణ విద్యార్థులకు కూడా ప్రవేశం కల్పించి... వారిని అసాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్దటం.
- అత్యంత అర్హత, అనుభవం, సమర్థత, అంకితభావం గల ఉపాధ్యాయులు 24 గంటలూ క్యాంపస్‌లోనే ఉంటూ బోధనతోపాటు, స్టడీఅవర్స్ పర్యవేక్షణ. వేరువేరుగా తరగతులు & హాస్టల్ వసతి కలదు.
- 6, 7, 8, 9 & 10వ తరగతుల బాలబాలికలకు వేరేవేరుగా ప్రతి క్లాసులో టాలెంట్ సెక్షన్స్ కలవు.
- 6, 7, 8, 9 & 10వ తరగతులలో టాలెంట్ సెక్షన్స్‌కు అనుభవజ్ఞులైన లెక్చరర్స్‌చే... IIT & Medical Foundation శిక్షణా తరగతులు కలవు.
- ఆధునిక Physics, Chemistry, Botany, Zoology, Computer Labs & Library...
- సువిశాలమైన క్రీడా ప్రాంగణంలో... బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్, బాల్ బ్యాంట్మింటన్, షటిల్, ఖో-ఖో, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, చెస్, క్యారమ్స్, స్కేటింగ్, కరాటే, కుంగ్‌ఫూ, యోగా, మెడిటేషన్, క్లాసికల్ డ్యాన్స్, వెస్ట్రన్ డ్యాన్స్, మ్యూజిక్ మొదలగువాటిలో ప్రత్యేక శిక్షణయిస్తున్న విద్యాసంస్థ.
- స్వంత మినరల్ వాటర్ ప్లాంట్స్, స్వంత Chapathi Making Machine & స్వంత డెయిరీఫామ్ కలిగి పుష్టికరమైన ఆహారాన్ని అందిస్తూ... పిల్లల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతను యిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న విద్యాసంస్థ.
- బాలబాలికలకు ఎన్.సి.సి.లో... ఆర్మీ, నావీ & ఎయిర్‌వింగ్‌లలో ప్రత్యేక శిక్షణయిస్తున్న విద్యాసంస్థ.

48 సంవత్సరాల శ్రీవిశ్వశాంతి సుదీర్ఘ ప్రయాణంలో... లక్షలాది మంది విద్యార్థులు మా వద్ద చదువుకుని, వేలాది మంది విద్యార్థులు ఇతర దేశాలలో స్థిరపడి, అత్యున్నత స్థాయిలో ఉండటం మా విద్యాసంస్థకు ఎంతో గర్వకారణం. విజ్ఞతగల నిర్ణయం మీదే!

STATE 10th Class 2022 Toppers

Congratulations to All

585 — BODDU ARUSH MISRA

Marks	Name
584	M V SANTOSH REDDY
581	RAJULAPATI SHAMITHA
580	SULAIK ZUWAIRIYA
577	NEERUKONDA JAHNAVI
575	V CHARAN RAM TEJA
574	G RESHMA SRI PRIYA
571	D VEERA HARINIKA
570	K MOHANA RUPA
570	K SIVA RAGA ADITHI
569	A S VATSA KAUSTUBH
569	ELLURI PAVAN SAI
565	VEERAGANI SOWMYA
565	C SUMANTH RAJ PETER
564	P AKSHAYA SAI
563	CH GOWTHAM KUMAR
563	V PRAJWAL
561	V SHANMUKHA SURESH
560	S MANOJ KUMAR

JR. INTERMEDIATE MPC - 2022

టాప్ మార్కులు 466 - 460 శ్రీ విశ్వశాంతి విద్యార్థులవే

అత్యుత్తమ మార్కులు సాధించిన మా విద్యార్థులు 19

466/470 — CHAGANTI YASWITHA REDDY

Marks	Name
465/470	RAYAVARAPU SAI NAGA ALEKHYA
465/470	MATURI MEENAMRUTHA
464/470	THAMMISETTY PREM SAGAR
463/470	UJI MADHU VENKAT
463/470	BONTHALA BHAVYA SRI
463/470	RAVELLA VENKATA MOKSHAGNA
463/470	SRIKARAM DIVYASRI
463/470	PUVVULA CHAND NAGA ASHRITH
463/470	SABBINENI JAYASREE
462/470	GUNNAM MEGHANA
462/470	SADAM MAHA LAKSHMI
461/470	PINJARI ABDUL RAHIMAN
461/470	VANDAVASI MANIKANTA
460/470	PASTHAMATLA SRI SAI PRAMOD VARMA
460/470	GUMMADI CHETANA
460/470	CHENNURU MOKSHA PRADHA
460/470	PERUMALLA JYOTHI SRI
460/470	JAMPANI S N V SATYA SAI RAM

JUNIOR INTERMEDIATE Bi.P.C IPE - 2022 TOPPERS

434 — B NAVYA SRI

Marks	Name
423	RAPAKA PREMA LATHA
418	BORRA KARUNA
416	RAJULAPATI RITHIKA
416	G SIVA PARVATHI
414	MIRZA NAZIYA FATHIMA
411	KORATAM MANVIKA
411	TAKKARI RUPESH
410	PAMARTHI JAHNAVI

SENIOR INTERMEDIATE M.P.C IPE - 2022 TOPPERS

976 — GUTTI LIKITHA

Marks	Name
975	P L V SAI CHERITH
975	PEDDINTI SAHITYA
974	B Y VENKATA SAI CHARAN
972	C MANYA RAJIV REDDY
971	B LAKSHMI LAVANYA
970	DIYYALA SAI SUDEEPA
970	NALLA INDHU
968	ANULA TEJA SWAROOP
968	KALAGANDA NIKHITHA
967	MAGANTI CHANDRIKA
965	BATTA CHAITANYA SRI
965	BILLAKANTI MOKSHITH
964	S RAGHURAM REDDY
962	MADDILA SUMANTH

SENIOR INTERMEDIATE Bi.P.C IPE - 2022 TOPPERS

966 — POPURI MYTHILI

Marks	Name
960	YANAMALA LAHARI
959	JANAVATH SHIRIHA NAIK
958	SK SHAAFIYA KOWSAR
935	BURUGUGADDA DIVYA
934	K PRANAI ESWAR REDDY
931	V V S S NIVEDITHA
923	GUDA VYSHNAVI REDDY
922	CHINTAGUNTA SACHINI
920	JYOTHULA KAVYA
916	DESIREDDY DAKSHAYANI
912	SK MUBEENA AFROSE
909	KATURI SINDHUSHA
903	SHAIK SAJIDHA
900	CH PURNA SRIMAYEE
900	ADIREDDY DINESH REDDY

Congratulations To All...

JAYA GRAPHICS - 984 836 3105